సంపుటి : 78 సంచిక : 25 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ చైత్ర బహుళ చవితి
06-12 ఏప్రిల్ 2026
వెల : ₹20/-

ధురంధర్..
ఉలికిపాటు ఎందుకు?

DHURANDHAR

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

వైభవంగా కపాలేశ్వరుడి రథయాత్ర

మార్చి 29న తమిళనాడు రాజధాని చెన్నయ్, మైలాపూర్‌లోని కపాలేశ్వర ఆలయం వార్షిక రథయాత్ర ఘనంగా జరిగింది. ఇది పంగుని పెరువిళా (ఉత్సవం)లో భాగంగా ఏడవ రోజున జరిగింది. ఈ ఉత్సవం మార్చి 23న కొడియేట్రంతో ప్రారంభమై ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు కొనసాగింది.

స్వామి, అమ్మవార్లు అందంగా అలంకరించిన భారీ రథం మీద ఆశీనులైనారు. ఉదయం ఆలయం నుండి బయలుదేరిన రథం మాడ వీధుల్లో ఊరేగింది. వేలాదిగా భక్తులు రథాన్ని ఉత్సాహంగా ముందుకు లాగారు. గాలి వీచినట్లు రథం కదులుతుండగా భక్తుల నుండి హర హర మహాదేవ్ జయఘోషాలు వినిపించాయి. మధ్యాహ్నానికి రథం ఆలయం వైపునకు తిరిగి వచ్చింది. సాయంత్రానికి రథం నుండి స్వామి, అమ్మవార్లు తిరిగి ఆలయంలోకి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి సంగీతం వాయిద్యాలు, వేద మంత్రాలు ఆధ్యాత్మికతను చేకూర్చాయి.

ఈ రథయాత్ర చెన్నయ్ నగరంలోని ప్రముఖ వార్షిక ఉత్సవాల్లో ఒకటి. దీనిని చూడడానికి స్థానికులు, బయటి నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మాడ వీధులు భక్తులతో నిండిపోయాయి. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ మార్పులు కూడా అమ లు చేశారు. గత సంవత్సరాలలాగే ఈ ఏడాది కూడా రథయాత్ర శాంతియుతంగా, వైభవంగా ముగిసింది.

బాలరాముడికి సూర్యతిలకం

భగవాన్ శ్రీరామచంద్రుడి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వేలాది మంది భక్తులు తరలిరావడంతో, 2026 రామ నవమిని అయోధ్యలో అపూర్వమైన ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో జరుపు కున్నారు. ఈ ఏడాది వేడుకలకు ప్రధాన ఆకర్షణ రామ జన్మభూమి ఆలయంలో జరిగిన అద్భుతమైన సూర్య తిలక్ కార్యక్రమం. ఆధ్యాత్మికతను, శాస్త్రీయ కచ్చితత్వాన్ని అద్భుతంగా మేళవించిన ఈ వేడుక జరిగింది. సరిగ్గా మధ్యాహ్నం, ప్రత్యేకంగా రూపొందించిన అద్దాలు, కటకాల వ్యవస్థ ద్వారా సూర్యకిరణాన్ని గర్భగుడిలోకి ప్రసరింపజేసి, కొన్ని పవిత్ర నిమిషాల పాటు రామ్ లల్లా నుదుటిని ప్రకాశవంతం చేశారు. భగవాన్ రాముని సూర్యవంశపు దైవిక ఆశీస్సులకు ప్రతీక అయిన ఈ సూర్య తిలకం, సాంకేతిక పురోగతితో మేళవించిన భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వా నికి ఒక శక్తివంతమైన ప్రతిరూపంగా నిలిచింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని వీక్షించగా, దేశ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తిశ్రద్ధలతో, ఆత్మగర్వంతో ఈ వేడుకలను వీక్షించారు. రోజంతా అయోధ్య నగరం గాఢమైన ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. భక్తులు సమీపంలోని ఘాట్‌లలో పుణ్యస్నానం చేసిన అనంతరం, ప్రార్థనలు సమర్పించడానికి నగరవ్యాప్తంగా ఉన్న ఆలయాలకు తరలివచ్చారు. యాత్రికుల సామూహిక భక్తి, ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తూ, "జై శ్రీ రామ్" నినాదాలు మారుమోగాయి. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సూర్య తిలకాన్ని విశ్వాసం, ఆత్మ గౌరవం, ఆధ్యాత్మిక జాగృతికి ప్రతీకగా అభివర్ణించారు. తన సందేశంలో, ప్రకాశవంతమైన ఈ తిలకం సనాతన సంస్కృతి పునరుజ్జీవనానికి ప్రతీక అని, పౌరులలో నూతన శక్తి, ఆత్మగౌరవాన్ని ప్రేరేపిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను "అభివృద్ధి చెందిన ఆత్మనిర్భర భారతదేశం" అనే విస్తృత దార్శనికతతో కూడా ఆయన ముడిపెట్టారు. వేడుకల స్థాయిని దృష్టిలో ఉంచుకుని, జిల్లా యంత్రాంగం అయోధ్య అంతటా విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఉన్నతాధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, జనసమూహ నియంత్రణ, భద్రత సజావుగా జరిగేలా చూశారు. కీలక ప్రదేశాలలో వ్యూహాత్మకంగా పోలీసు సిబ్బందిని మోహ రించగా, భారీ జనసమూహాన్ని నియంత్రించడానికి నిఘా వ్యవస్థలను పటిష్టం చేశారు. సూర్య తిలకం వేడుక భక్తులను ఆకట్టుకోవడమే కాకుండా, దాని వినూత్న నిర్వహణ కూడా వారిని ఆకర్షించింది. ప్రాచీన విశ్వాసా లను ఆధునిక ఇంజనీరింగ్‌తో మేళవించడం ద్వారా, సంప్రదాయం, విజ్ఞానం ఏ విధంగా సామరస్యంగా సహజీవనం చేయగలవో ఈ కార్య క్రమం ప్రదర్శించింది. భారతదేశపు శాశ్వత ఆధ్యాత్మిక వారసత్వానికి, పురాతన సంప్రదాయాలను సమకాలీన కాలానికి అనుగుణంగా మార్చుకో గల దాని సామర్థ్యానికి అయోధ్య ఒక నిదర్శనంగా నిలిచింది. రామ నవమి 2026 కేవలం దాని వైభవం కోసమే కాకుండా, సూర్య తిలకం ప్రగాఢమైన ప్రతీకాత్మకత కోసం కూడా గుర్తుండిపోతుంది. సూర్యరశ్మి, విశ్వాసం, భక్తి, దైవిక సామరస్యంతో ఏకమైన క్షణం అది. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

దేశంలో నక్సలిజం అంతమైందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మార్చి 30న పార్లమెంటులో సగర్వంగా ప్రకటించటం హర్షణీయం. సమాజంలో జరిగే అన్యాయాలకు రాజ్యాంగ పరిష్కార మార్గాలున్నాయని, వాటిని వదలి ఆయుధాలు చేపట్టడం సరికాదని అన్నారు. ఆయుధాలు వదిలిపెట్టిన వారితోనే ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, ఆ విధంగా జనజీవన స్రవంతిలో కలసినవారికి పునరావాసం కల్పిస్తుందని మరోసారి తెలిపారు.

సమసమాజాన్ని నిర్మిస్తామని ప్రారంభమైన కమ్యునిస్టు పార్టీ నుంచే నక్సలిజం ఉద్యమం ఉద్భవించింది. సమాజంలో వర్గ విభేదాన్ని సృష్టించి ఉన్నవాళ్లు - లేనివాళ్లు అని విడదీసి విద్వేషాన్ని రెచ్చగొట్టింది. పర్యవసానంగా మన దేశంలో కొన్ని ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఆగిపోయాయి. సల్వాజుడం కేసులో 2011లో నక్సల్స్‌కు అనుకూలంగా వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ద్వారా, 2005లో ప్రభుత్వ మద్దతుతో నక్సలిజం నిర్మూలనకై గ్రామ రక్షణ దళాల పేరుతో ప్రజా ఉద్యమంగా ఉద్భవించిన సల్వాజుడుంకు రక్షణ కరువైంది. తత్ఫలితంగా సల్వాజుడుం స్థాపకులైన మహేంద్రకర్మతో సహా అనేకమంది నక్సల్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు.

రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టినవారిపట్ల మానవత్వం ప్రదర్శించాలని కాంగ్రెస్ పార్టీ సుద్దులు చెబుతున్నది. అర్బన్ నక్సల్స్ వ్యాసాలు, పుస్తకాలు రాస్తున్నారు. వీరంతా నక్సల్స్ బారిన పడి చనిపోయిన పౌరుల గురించి కాని, భద్రతా బలగాల గురించి కానీ ఎందుకు వ్యాసాలు రాయడం లేదు? వారి ప్రాణాలకు విలువ లేదా?

విదేశీ ప్రేరణతో మన దేశంలో ఏర్పడిన కమ్యునిస్టు పార్టీ ఏమి ప్రేరణ ఇవ్వగలదు. భారతీయ మూలాల్లోనే ఒకరిపట్ల మరొకరిపై విద్వేషాన్ని రెచ్చగొట్టే ఆలోచనే లేదు. ఉన్నవారు - లేనివారు అనే రెండు వర్గాలుగా మన సమాజం చూడలేదు. లేనివారికి ఉన్నవారు సహకారం అందిస్తూనే మనమంతా ఒకటే అనే ఐక్యతా రాగం అనాదిగా ఈ దేశంలో పరిఢవిల్లుతున్నది. దేశాన్ని 2026 మార్చి 31 నాటికి నక్సలిజం నుంచి విముక్తం చేయడానికి సంకల్పించిన సందర్భంగా మన భద్రతా బలగాలు చేసిన

శాలివాహన 1948 శ్రీ పరాభవ చైత్ర బహుళ చవితి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

ధురంధర్..

ఉలికిపాటు ఎందుకు ?

ధారావాహిక నవల

30 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో

వైపరీత్యం

రణంతో వాతావరణ కాలుష్యం

26లో

జాగృతి

సంపాదకీయం

పోరాటం శ్లాఘనీయం. ఉదాహరణగా తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సరిహిద్దులోని దట్టమైన అడవి ప్రాంతంలో భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' ద్వారా విజయం పొందడం అమోఘం.

ఎస్సీ, ఎస్టీ సమస్యల నేపథ్యంలో నక్సలిజం ప్రారంభమైందని చెబుతున్నప్పటికీ దీర్ఘకాలంలో గిరిజనులు ఎక్కువగా నష్టపోయారని ఇంటర్నల్ సెక్యూరిటి స్టడీస్, జాతీయ మానవ హక్కుల కమిషన్, హోంశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటి రిపోర్టులు చెబుతున్నాయి. హింస, అభివృద్ధి లోపం వంటి సమస్యలు ఎస్సీల జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. గత 10 సంవత్సరాలుగా

నక్సల్స్ ముక్త భారత్

కేంద్ర ప్రభుత్వం నక్సలిజాన్ని ఎదుర్కొనడానికి సమగ్ర వ్యూహాన్ని అమలు చేస్తున్నది. మరోవైపు నక్సల్స్ ప్రభావిత గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వల్ల నక్సలిజం మూలాలను అంతం చేయగలిగింది. ఫలితంగా నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాయుధ పోరాటం కంటే ప్రజాస్వామ్య వ్యవస్థ శాశ్వత పరిష్కారమని ప్రజలు గ్రహించటం ప్రారంభించారు. అందుకే వారికి ప్రజాదరణ తగ్గింది. ప్రజల మద్దతు లేకుండా ఏ ఉద్యమం కోనసాగలేదనేది చరిత్ర చెబుతున్న సత్యం. ఈ నేపథ్యంలో తుపాకులను వదిలిపెట్టి నక్సలైట్లు లొంగిపోవడం హర్షనీయం.

బస్తర్, బీజాపూర్ అటవీప్రాంతంలో నక్సల్స్ ప్రభావం పూర్తిగా తగ్గడం పరిశీలిస్తే, నక్సల్స్ ఏరివేత అనేది ప్రభుత్వ సంకల్పం, భద్రతా బలగాల వ్యూహాత్మక పటిష్టత స్పష్టంగా గోచరిసున్నది. ఇది కేవలం నియంత్రణ కాదు. ముగింపుగా సాగుతున్న ప్రయాణమని కేంద్ర ఇంటలిజెన్స్ విభాగం పేర్కొంది. తిరుపతి నుంచి నేపాల్ వరకు ఎర్రజెండా ఎగురవేయాలన్న మావోయిస్టుల కల కరిగిపోయంది. తుపాకులు గర్జించిన చోటే నేడు బడి గంటలు మోగుతున్నాయి. వైద్యశాలలు వెలిశాయి. రేషన్ షాపులు ప్రారంభమైనాయి. 'బస్తర్ ఫైటర్' వంటి కార్యక్రమాల ద్వారా యువతకు ఉపాధి కల్పనతోపాటు వారినే భద్రతా వ్యవస్థలో భాగస్వాములను చేశారు. మరోవైపు క్రీడల ద్వారా గిరిజన యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపగలుగుతున్నారు. ఇంత గొప్ప మార్పు నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత సాకారమౌతున్నప్పటికీ ప్రతిపక్షాలకు రుచించడం లేదు. 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ సమస్య పరిష్కారం వైపు అడుగులు వేయకపోగా నేడు కూడా అర్బన్ నక్సల్స్‌తో అంటకాగుతున్నది. పేరుమోసిన నక్సలైటు హిడ్మా మరణించిన సందర్భంగా ఇండియా గేటు వద్ద ఉదార వామపక్షవాదులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ఒక్క హిడ్మా మరణిస్తే ప్రతి ఇంటి నుంచి హిడ్మాలు పుట్టుకొస్తారని నినదించారు. ఈ వీడియోను రాహుల్ గాంధీ ఎక్స్ ద్వారా పోస్టు చేయడం దురుదృష్టకరం.

మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నపుడు సోనియాగాంధి నేతృత్వంలో ఏర్పాటు చేసిన నేషనల్ అడ్వైజరీ కమిటీలో అందరూ అర్బన్ నక్సలైట్లు ఉండడం కూడా నక్సల్స్ పట్ల కాంగ్రెస్ వైఖరిని తెలియజేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నక్సల్స్ రహిత భారత్ సంకల్పం నెరవేరినట్లే. ఇప్పటి వరకు నక్సల్స్ కారణంగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు మౌలిక సదుపాయాలతో సహా అన్ని రంగాలలో శరవేగంగా ముందుకెళతాయని ఆశిద్దాం. ★

6 ఏప్రిల్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్

38లో

కథ

ఆమె కూడ మనిషే..

- శింగరాజు శ్రీనివాసరావు

నియోజకవర్గాల స్థితి,గతి మారాల్సిందే! (జాతీయం)	-	12
విపక్షాల నిరసనల మధ్య బడ్జెట్ సమావేశాలు (తెలంగాణ)	-	14
మతకలహాల ముసుగులో దాడులు (ఆంధ్రప్రదేశ్)	-	16
సేవాభావనలో సేవాభారతి	-	18
భారత్ వైపు ఇరాన్ చూపు (అంతర్జాతీయం)	-	24
వైద్యవదాన్య... ధన్యజీవన (మహిళ)	-	28
స్వరాజ్య సమర చైతన్యదీప్తి (గళమెత్తిన గతం)	-	30
...విద్యాభారతి పాత్ర (ఆర్ఎస్ఎస్-100)	-	34
మతమార్పిడిపై రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతిబింబం (తీర్పు)	-	36
వేసవి సెలవులు విజ్ఞాన వినోదాలకు నెలవులు (ఆటవిడుపు)	-	42
అంతై.. ఇంతై.. అంతింతైన ఐపీఎల్! (క్రీడ)	-	43
తెలుగు సినిమా... త్రైమాసిక ఫలితాలు! (సినిమా)	-	50

ఎక్కడ చూసినా ఇదే చర్చ.. ధురంధర్ చూశారా?.. చూడలేదా అని సానుభూతిగా చూస్తూ, వెంటనే చూడమని సలహా ఇస్తున్నారు. ఇలాంటి సాహసోపేత చిత్రం ఇప్పటి వరకూ రాలేదని ప్రశంసిస్తున్నారు. ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్థాన్ పరువును ఈ సినిమా తీసిందని అభినందిస్తున్నారు. చిత్రంలో భారత గూఢచారి హమ్జా సాహసంతో పాటు మరోపాత్ర అజయ్ సన్యాల్ నిజంగా ఎవరు? అని చర్చించుకుంటున్నారు. అదే సమయంలో ఇదంతా ప్రాపగాండా సినిమా అంటూ కొందరు తెగ బాధపడుతున్నారు. ధురంధర్, ధురంధర్: ది రివెంజ్ అనే రెండు సినిమాలు పొరుగు దేశం నగ్న స్వరూపాన్ని, మన కుహనా లౌకిక నాయకుల అసలు రూపాన్ని బయట పెట్టాయి. ఇంతకీ ఈ చిత్రంలో ఏముంది?

సినిమా అనేది శక్తిమంతమైన ఆయుధం. కోట్లాది మందిని ప్రభావితం చేసే బలమైన మాధ్యమం. ఎన్నో చిత్రాలు నిశ్శబ్దంగా వచ్చి అలాగే వెళ్లిపోతాయి. చాలా వరకూ చిత్రాలు వినోదానికి పరిమితమైతే, కొన్ని మాత్రం తీవ్రంగా ఆలోచింప జేస్తాయి. తాజాగా ఈ రెండు చిత్రాలు మాత్రం యావద్దేశాన్ని కదిలించేశాయి. ఇంకా చెప్పాలంటే కొందరికి నిద్రలేని రాత్రులను మిగుల్చాయి. మూడు నెలల క్రితం థియేటర్‌లోకి వచ్చే వరకూ ఆ సినిమాను పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. కొంత కాలంగా కొత్తదనం లేకుండా పోయిన బాలీవుడ్ చిత్రాలను దేశ ప్రజలు బొత్తిగా పట్టించుకోవడం మానేశారు. ఇలాంటి సమయంలో గత ఏడాది డిసెంబర్ 5న విడుదలైన ధురంధర్ ప్రకంపనలు రేపింది.. ఎక్కడ చూసినా దాని గురించే చర్చ! తేరుకునే లోపే అదే చిత్రానికి రెండో భాగం ధురంధర్: ది రివెంజ్ వచ్చి ఆ ప్రకంపనలను మరింత తీవ్రం చేసింది. యాక్షన్, దేశభక్తి, ప్రతీకారం ఈ మూడు ప్రధాన అంశాలను అద్భుతంగా మేళవించిన ఈ చిత్రం కేవలం వినోదం మాత్రమే కాదు, ప్రేక్షకుల మనసుల్లో గాఢమైన అనుభూతిని మిగిల్చే సినీ ప్రయాణం.

యుద్ధంలో పాకిస్థాన్ మీద భారత్ సాధించిన విజయాలపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. ప్రజల్లో దేశభక్తిని తట్టి లేపాయి. ఇప్పుడు యువ దర్శకుడు ఆదిత్యధర్ ఎంచుకున్న కథాంశం కాస్త వైవిధ్యంగా ఉండటం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఓ భారతీయ గూఢచారి మన శత్రు దేశంలోకి వెళ్లి సృష్టించిన విధ్వంసం చర్చనీయాంశంగా మారి పోయింది. దీన్ని కొన్ని వర్గాలు అసలు తట్టుకోలేక పోతున్నాయి. అర్థంపర్థం లేని విమర్శలు గుప్పించడంతో 'ఇంతకీ ఈ సినిమాలో ఏముందో చూద్దాం' అని చాలా కాలంగా థియేటర్లకు దూరంగా ఉన్న ప్రేక్షకులు కూడా వెళుతున్నారు. భారతీయ సినిమాల మీద పాకిస్థాన్‌లో కొన్నేళ్లుగా నిషేధం ఉంది. అయినా ధురంధర్ చిత్రాన్ని రహస్యంగా చూసేస్తున్నారు అక్కడి ప్రజలు. తమ దేశంలో జరుగుతున్న తతంగం తెరకెక్కడం చూసి పాకిస్థాన్ పాలకులు, అధికారులు తట్టుకోలేకపోతున్నారు. అదే సమయంలో మన దేశంలో

ధురంధర్..
ఉలికిపాటు ఎందుకు?

లౌకికవాద ముసుగు వేసుకున్న జాతీయవాద వ్యతిరేకులకు, సంతుష్టీకర రాజకీయ నాయకులకు సహజంగానే ధురంధర్ విజయం మింగుడు పడలేదు.

తెర మీద పచ్చి వాస్తవాలు

'మా పోరాటం పాకిస్థాన్ మీద కాదు. ఆ దేశం పోషిస్తున్న ఉగ్రవాదుల మీద. ఆ ఉగ్రవాదం వల్ల మాకే కాదు... మీ దేశానికి కూడా నష్టం జరుగుతోంది కదా..' హీరో నోట వినిపించిన డైలాగ్ ఇది.

ఆదిత్య ధర్ తెర మీదకు తెచ్చిన ధురంధర్ కేవలం ఒక స్పై థ్రిల్లర్‌గా చూడటం దాని ప్రాధాన్యతను తగ్గించినట్లే అవుతుంది. భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో కాలంగా తప్పించుకుంటూ వచ్చిన వాస్తవాలను నేరుగా ప్రశ్నించింది. బాలీవుడ్ సాధారణంగా వాస్తవానికి దూరంగా, పాటలు, భావోద్వేగాలను నిజాలను చూపించదు. అందుకు కారణం ఇస్లామిక్ ఫోబియో.. ధురంధర్ ఆ సంప్రదాయాన్ని బద్దలు కొట్టింది. వినోదం పేరుతో వాస్తవాలను దాచకుండా ఉగ్రవాదాన్ని ఒక ప్రపంచవ్యాప్త సమస్యగా చూపించింది. కొన్ని వర్గాలు దుష్ప్రచారం చేస్తున్నట్లు ఈ చిత్రంలో ఎక్కడా మత ప్రస్తావన లేదు. ఏ మతాన్ని కించపరచలేదు. మా మతం మాత్రమే గొప్పది అని చూపించే ప్రయత్నం చేయలేదు. జాతీయ భద్రతతో ముడిపడిన సున్నిత అంశాలను వాస్తవిక కోణంలో చూపిస్తూ కొందరికి నచ్చినా నచ్చకపోయినా, ఒక చర్చను ప్రారంభించింది.

ధురంధర్ ముస్లింలంతా దుష్టులని చిత్రించలేదు. పాకిస్థాన్ కేంద్రంగా కొన్ని శక్తులు అధికారం కోసం, డబ్బు కోసం ఎలా పని చేస్తున్నాయనేది ఎత్తి చూపిస్తుంది. ఆ దేశంలో జాతులు, ముఠాల మధ్య జరుగుతున్న ఘర్షణలను తెరకెక్కింది. వీటన్నింటికీ ధురంధర్ సమాధానం కాదు. వాస్తవానికి ఇది ఒక ప్రశ్న. భారతీయ సినిమా వినోదానికే పరిమితమా, వాస్తవాలను వాస్తవికంగా చూపించే ధైర్యం తెచ్చుకుంటుందా అన్న ప్రశ్న. సమస్యను అంగీకరించడమే మొదటి అడుగు. ఆ అడుగే ధురంధర్.

కళ్లకు గంతలు తొలిగాయి

ధురంధర్ చిత్రాన్ని చూసి తట్టుకోలేని వారు ఇదో ప్రాపగాండా చిత్రం అని దుష్ప్రచారం చేస్తున్నారు. వాస్తవాలు చెప్పడం ప్రాపగాండా అవుతుందా? మరి ధురంధర్ ప్రాపగాండా అయితే గతంలో వచ్చిన కొన్ని చిత్రాలను ఏమనాలి? దశాబ్దాల పాటు బాలీవుడ్ పరిశ్రమ ఎవరి కన్నుసన్నల్లో నడిచింది? భారత వ్యతిరేకులు, మాఫియా నీడ నిజం కాదా? హిందీ చిత్ర పరిశ్రమ ఎలాంటి చిత్రాలను నిర్మించిందో గమనించండి. అనేక చిత్రాల్లో భారత సైన్యాన్ని, హిందూ మతాన్ని కించపరచడం లేదా తక్కువ చేసి చూపిస్తూ వచ్చారు. మన దేశం మీదకు ఉగ్రవాదులను పంపుతున్న పాకిస్థాన్‌ను గొప్పగా చూపిస్తూ, కశ్మీర్ వేర్పాటువాదులను సమర్థిస్తూ కొన్ని చిత్రాలు వచ్చాయి. హిందూ మతం కన్నా ఇస్లాం గొప్పది అనే సందేశాన్ని పరోక్షంగా చొప్పించారు. హిందువులు సాధించిన విజయాలపై నిర్మించిన కొన్ని చిత్రాల్లో పాత్రల పేర్లు మారి పోయి వేరే మతం వారి పేర్లు కనిపిస్తాయి. ఇస్లామోఫోబియా కారణంగా భారతీయ సినిమాలు చాలాకాలం ఉగ్రవాదాన్ని స్పష్టంగా, వాస్తవికంగా చూపించలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి తిరగబడింది.

గత దశాబ్దంలో దేశంలో జాతీయవాద భావజాలం బలపడింది. ఆ మార్పు సినిమా పరిశ్రమలోనూ ప్రతిబింబిస్తోంది. కశ్మీర్ ఫైల్స్, ది కేరళ స్టోరీ, ఉరి, ఆర్ఆర్ఆర్, మేజర్ తదితర చిత్రాలు ఈ కోవలోనివే. ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' ఈ మార్పులో ఒక కీలక మైలురాయి. ఇది ఉగ్రవాదాన్ని పేరు పెట్టి పిలవడంతో పాటు దాని మూలాలను ప్రశ్నించింది. అదే కారణంగా ఇది ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొంటోంది. ఈ చిత్రంలో 'ప్రతి ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ఉంటుంది' అని అజయ్ సన్యాల్ పాత్ర చెప్పిన డైలాగ్ కొన్ని వర్గాలకు ఎందుకు ఆందోళన కలిగించిందో మరి.

ధురంధర్ అంటే ఉలుకెందుకు?

ధురంధర్ సహజంగానే కాంగ్రెస్‌తో పాటు కొన్ని పార్టీలకు మంట పుట్టించింది. బీజేపీ ఎజెండా అని కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ దీనిని అభివర్ణించారు. దేశంలో ఒక సమాజానికి వ్యతిరేకంగా ద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకు ఈ సినిమా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ధురంధర్ అతి జాతీయవాద ప్రచార చిత్రం అని, ఈ బోర్ చిత్రాన్ని చూడటం వృథా అంటూ సూచించారు కాంగ్రెస్ మాజీ ఎంపీ, నటి దివ్య స్పందన. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, రాజకీయ వాతావరణాన్ని ప్రభావితం చేసేందుకు బీజేపీ, ఆరెస్సెస్ ఎజెండాతో ఈ చిత్రం విడుదల చేశారని ఉదిత్ రాజ్ ఉవాచ! బీజేపీ ఈ చిత్రానికి నిధులు మంజూరు సమకూర్చిందని రషీద్ అల్వీ ఆరోపించారు. సమాజంలో చీలికలు తెచ్చే ఈ చిత్రాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ అనుకూల రచయిత హుస్సేన్ దల్వాయ్.

ధురంధర్ చిత్రాన్ని చూసి సమాజ్ వాదీ పార్టీ ఉలిక్కిపడింది. చిత్రంలో కొన్ని చారిత్రక వాస్తవాలను వక్రీకరించారని, ఇది ఒక వర్గం ప్రజల భావాలను దెబ్బతీసేలా ఉందని ఆరోపించింది. ధురంధర్ చూడటం టైమ్ వేస్ట్ పని అంటున్నారు అసదుద్దీన్ ఓవైసీ. ముస్లిం పాత్రలను చిత్రీకరించిన విధానంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఒక వర్గాన్ని తప్పుగా చూపించే ధోరణి సినిమాల్లో పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక నిత్యం జాతీయవాదం, ప్రధాని మోదీ మీద

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

పనిగట్టుకొని విమర్శలు చేసే కొందరు యూట్యూబర్లు ధురంధర్ మీద సహజంగానే విషం కక్కారు. ఈ చిత్రం ప్రమాదకర ప్రాపగాండా అంటూ ధ్రువ్ రాఠీ విరుచుకుపడ్డారు. నిజమైన సంఘటనలను వక్రీకరించిందని, రెండో భాగం మరింత బహిరంగంగా బీజేపీ రాజకీయ ఎజెండాను ప్రమోట్ చేస్తోందని విమర్శించారు. ధురంధర్ విపరీతమైన జాతీయవాదం ప్రమోట్ చేసిందని సుచిత్ర త్యాగి ఆరోపిస్తే, కేఆర్కే జీరో స్టార్ రేటింగ్ ఇచ్చారు. కానీ విచిత్రంగా వీరి విమర్శలు ధురంధర్‌ను మరింత మంది చూసేలా చేశాయి.

భుజాలు తడుముకున్నారా?

అసలు కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు ధురంధర్ చిత్రాన్ని చూసి ఎందుకు భయపడ్డాయి? ఇందుకు సమాధానం ఈ చిత్రం కోసం ఎంచుకున్న కొన్ని వాస్తవ ఘటనలు అని చెబుతున్నారు. ముఖ్యంగా యూపీఏ ప్రభుత్వం కపటత్వాన్ని ధురంధర్ ఎండగట్టింది. ముంబై మీద ఉగ్రవాదుల దాడి తర్వాత కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మెతక వైఖరి, పైగా హిందువులను ఉగ్రవాదులుగా చూపించే ప్రయత్నం విమర్శలకు దారి తీసింది. ముఖ్యంగా ఆనాడు అధికారంలో ఉన్న నాయకులకు నకిలీ కరెన్సీ వ్యవహారంతో ఉన్న సంబంధాలను ధురంధర్ బయటపెట్టి, పరోక్షంగా ఇరకాటంలో పడేసింది.

పాకిస్థాన్ మన దేశంలోకి నకిలీ భారత కరెన్సీని ముద్రించి పంపేందుకు చేసిన కుట్రను ధురంధర్ చూపించింది. చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలో కరెన్సీ నోట్ల ముద్రణ కోసం భారత్, పాకిస్థాన్‌లకు ఒకే సంస్థ కాగితాన్ని సరఫరా చేయడం తెలిసిందే. నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాకిస్థాన్ మన దేశంలోకి అక్రమ మార్గంలో పంపేందుకు పెద్ద ఎత్తున నకిలీ కరెన్సీని ముద్రించడం తెలిసిపోయింది. వెంటనే పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ధురంధర్ చిత్రంలో ఇదంతా చూడొచ్చు. ధురంధర్‌లో కనిపించిన మరో పాత్ర అతీఫ్ అహ్మద్. ఈ పాత్ర అచ్చం సమాజ్ వాదీ పార్టీ మాజీ ఎంపీ అష్టల్ అన్సారీని పోలి ఉంది. ఐఎస్ఐతో సంబంధాలున్న ఈ వ్యక్తి 2023లో హత్యకు గురయ్యాయి. ఈ పాత్రను చూసి సమాజ్ వాదీ పార్టీ భుజాలు తడుముకోక తప్పలేదు

చిత్ర పరిశ్రమ ఏమంటోంది?

భారతీయ చిత్ర పరిశ్రమను కుదిపేసిన ధురంధర్ రికార్డు స్థాయి వసూళ్లను రాబట్టింది. మొదటి భాగం ప్రపంచ వ్యాప్తంగా రూ. 1,300 కోట్ల గ్రాస్‌ను వసూలు చేయగా, రెండో భాగం ఇప్పటి వరకూ రూ. 1,365 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. అతి సునాయాసంగా ఈ సినిమా రెండు వేల కోట్ల క్లబ్‌లో చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే బాలీవుడ్ నుంచి ధురంధర్‌కు మిశ్రమ స్పందన వ్యక్తం కావడం చర్చనీయాంశంగా మారింది. ఇది సినిమా అనడం కంటే ఒక గొప్ప అనుభూతిగా అభివర్ణించారు రామ్‌గోపాల్ వర్మ. ఫిల్మ్ మేకింగ్‌ను, రణ్‌వీర్ నటనను ప్రశంసించారు కరణ్ జోహార్, సిద్ధార్థ్ ఆనంద్. ఈ చిత్రంలోని దేశభక్తిని కొనియాడారు అనుపమ్ ఖేర్, అక్షయ్ కుమార్, బోమన్ ఇరాన్, రాణీ ముఖర్జీ, హృతిక్ రోషన్.

కాగా బాలీవుడ్ 'ఖాన్ త్రయం' ఏమంటున్నారన్నదే అందరూ గమనించారు. తాను ధురంధర్ చూడకున్నా, అద్భుత విజయంపై అభినందిస్తున్నానన్నారు అమీర్ ఖాన్. అయితే షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని రజనీకాంత్ వ్యాఖ్యానించారు.

అయితే టాలీవుడ్ మాత్రం ధురంధర్ మీద నిష్పాక్షికంగా ప్రశంసలు కురిపించింది. అక్కినేని నాగార్జున, ఎస్.ఎస్. రాజమౌళి, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, విజయ్ దేవరకొండ తమ అభినందనలు తెలిపారు. కాగా తెలుగు చిత్ర పరిశ్రమ ధురంధర్‌ను ప్రశంసించడం చూసి ప్రకాశ్ రాజ్ తట్టుకోలేక పోయారు. ఈ సినిమాను కేవలం ఒక వర్గం ప్రయోజనాల కోసం తీసిన ప్రచార చిత్రంగా ఆయన అభివర్ణించారు.

ధురంధర్ చిత్రాన్ని ప్రశంసించిన వారిని కొన్ని వర్గాలు వేధించడం మొదలు పెట్టాయి. ఈ చిత్రాన్ని మెచ్చుకున్నందుకు సోషల్ మీడియాలో కొందరు తనను లక్ష్యం చేసుకున్నారని ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ తెలిపారు. ఒక చిత్ర నిర్మాతగా ఆదిత్య ధర్ ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందేనని అన్నారు

పాకిస్థాన్‌ను వణికిస్తున్న ధురంధర్

ధురంధర్ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కలవర పెడుతోంది. తమ దేశంలో నిజంగానే భారత ఏజెంట్లు ఉన్నారేమోనన్న అనుమానంతో పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. వీధుల్లో భిక్షాటన చేస్తున్న వాళ్లని, అనుమానాస్పదంగా తిరుగుతున్న వాళ్లని పట్టుకుని విచారణ చేస్తున్నారు. భారత్‌కు ఏమైనా సమాచారం

'బ్లాక్ టైగర్'

వెండి తెర మీద ధురంధర్ చిత్రం రెండు భాగాలు చూసిన తర్వాత రవీంద్ర కౌశిక్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఇంతకీ ఎవరీ వ్యక్తి, ధురంధర్‌తో పోలిక ఏమిటి అనే చర్చ జరుగుతోంది. పాకిస్థాన్ అసలు రూపాన్ని ప్రపంచానికి చూపించింది ధురంధర్ చిత్రం. కానీ మనం తెర మీద చూడని వ్యక్తే రవీంద్ర కౌశిక్. భారత గూఢచారిగా పాకిస్థాన్ సైన్యంలోకి చొరబడి, దశాబ్ద కాలం పాటు భారత్‌కు కీలక సమాచారాన్ని అందించిన వీరుడు ఆయన. నాటి ప్రధాని ఇందిరా గాంధీ చేత 'బ్లాక్ టైగర్' అని పిలిపించుకున్న రహస్య సైనికుడి జీవితం చివరకు విషాదకరంగా ముగిసింది.

రవీంద్ర కౌశిక్ 1952లో రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో జన్మించారు. చిన్నప్పటి నుంచే నాటకాలంటే ఇష్టపడే వారు. ఆయన 1973లో లక్నోలో జరిగిన ఒక జాతీయ స్థాయి నాటక

అజిత్ దోవల్ పాత్రేనా అది?

ధురంధర్‌లో నటుడు మాధవన్ పోషించిన అజయ్ సన్యాల్ పాత్ర తెర మీద కనిపించగానే ప్రేక్షకులు ఒక్కసారిగా ఈలలు వేసి కేరింతలు కొడుతున్నారు. ఆ పాత్రను చూడగానే అందరికీ గుర్తుకు వచ్చేది ప్రస్తుత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్. ఆయన గతంలో అత్యంత రహస్య నిఘా కార్యకలాపాలు నిర్వహించిన అధికారి. ఇందు కోసం పాకిస్థాన్‌లో 7 ఏళ్లు బిచ్చగాడిగా నటిస్తూ కీలక సమాచారాన్ని సేకరించారు. పాకిస్థాన్ అణు కార్యక్రమాన్ని పసిగట్టి భారత్‌కు సమాచారం చేరవేశారు. ఈ సమాచారంతో భారత్ తన జాతీయ భద్రతా వ్యూహాన్ని మార్చుకుంది. దోవల్ వల్ల పాకిస్థాన్ అణు సామర్థ్య పరీక్షలు దాదాపు 15 ఏళ్లు ఆలస్యమయ్యాయి. అజిత్ దోవల్ కాందహార్ హైజాకింగ్ (1999), 46 మంది భారతీయ నర్సులను కాపాడటం వంటి అనేక సున్నితమైన ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటికీ 81 ఏళ్ల వయసులోనూ దేశం కోసం సేవలు అందిస్తు న్నారు. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి జాతీయ భద్రతా సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. ప్రేక్షకులు అసలైన ధురంధరుడు అజిత్ దోవల్ అంటున్నారు. ఆయనను భారత 'జేమ్స్ బాండ్' అని కూడా పిలుస్తుంటారు.

రవీంద్ర కౌశిక్

పోటీలో, శత్రువుల చిత్రహింసలను ఎదుర్కొనే భారత సైనికుడిగా చేసిన నటన భారత నిఘా విభాగం 'రా' అధికారులను ఆకర్షించింది. రవీంద్ర కౌశిక్ భాషా ప్రావీణ్యం, మానసిక దృఢత్వాన్ని గుర్తించిన ఇంటెలిజెన్స్ వర్గాలు, దేశం కోసం ఒక అత్యంత ప్రమాదకరమైన మిషన్‌ను ఆయనకు అప్పగించాయి. రెండేళ్ల కఠిన శిక్షణ తర్వాత రవీంద్ర కౌశిక్ తన గతాన్ని పూర్తిగా చెరిపేసుకున్నారు. ఉర్దూ భాష, ఇస్లామిక్ ఆచారాలు నేర్చుకుని 'నబీ అహ్మద్ షకీర్'గా మారి 23 ఏళ్ల వయసులో పాకిస్థాన్‌లోకి అడుగు పెట్టారు. కరాచీ యూనివర్సిటీలో లా పూర్తి చేసి, పాకిస్థాన్ సైన్యంలో చేరిపోయారు. తన తెలివితేటలతో మిలిటరీ అకౌంట్స్ విభాగంలో మేజర్ స్థాయికి ఎదిగారు. స్థానిక మహిళ అమానత్‌ను వివాహం చేసుకుని ఒక బిడ్డకు తండ్రి కూడా అయ్యారు.

కౌశిక్ 1979 – 1983 మధ్య మన దేశానికి పంపిన సమాచారం అత్యంత విలువైంది. పాకిస్థాన్ సైనిక మోహరింపులు, వ్యూహాలు, రహస్య అణు కేంద్రమైన 'కహూటా'కు సంబంధించిన సమాచారాన్ని భారత్‌కు చేరవేశారు. రవీంద్ర సేవలకు ముగ్ధురాలైన నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఆయనకు 'బ్లాక్ టైగర్' అనే బిరుదును ఇచ్చి గౌరవించారు. ఒక గూఢచారికి అప్పట్లో లభించిన అత్యున్నత గౌరవం అది. దురదృష్టవశాత్తు 1983లో భారత్ పంపిన మరో ఏజెంట్ పొరపాటు పాకిస్థాన్ సైన్యానికి దొరికిపోయాడు. అతని ద్వారా రవీంద్ర కౌశిక్ అసలు నిజం తెలిసిపోయింది. దీంతో పాకిస్థాన్ సైన్యం ఆయనను అరెస్ట్ చేసి సియాల్‌కోట్, కోట్ లఖ్‌పత్ జైళ్లలో ఉంచి దారుణంగా హింసించారు. ఎన్ని చిత్రహింసలు పెట్టినా కౌశిక్ నోరు విప్పలేదు. 16 ఏళ్ల పాటు చీకటి గదుల్లో నరకం అనుభవించిన కౌశిక్, జైలు నుంచి తన కుటుంబానికి రాసిన లేఖలు కన్నీళ్లు తెప్పిస్తాయి.

భారత దేశం కోసం త్యాగాలు చేసే వారికి చివరకు లభించేది ఇదేనా? అని రవీంద్ర కౌశిక్ ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన క్షయ వ్యాధి, గుండె జబ్బుతో బాధపడుతూ 2001 నవంబర్ 21న



పాకిస్థాన్‌లోని మియాన్వాలీ జైలులో రవీంద్ర కౌశిక్ తుదిశ్వాస విడిచారు. అలాంటి అజ్ఞాత గూఢచారులకు 'ధురంధర్' సినిమా గొప్ప నివాళిగా భావించొచ్చు.

పంపారా అని నిలదీస్తున్నారు. ముఖ్యంగా సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాల దగ్గర కనిపించే ప్రతి ఒక్కరినీ అనుమానిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా యాచకుల ఐడెంటిటీ కార్డులను తనిఖీ చేస్తున్నారు.

పాకిస్థాన్ భయానికి ముఖ్య కారణం భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గతంలో గూఢచారిగా పని చేశారు. తన కెరీర్ ఆరంభంలో దాదాపు ఏడేళ్ల పాటు పాకిస్థాన్‌లో ఉన్నారు. దీంతో పాకిస్థాన్ అధికారుల్లో వణుకు మొదలైంది. తమ రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకు భారత్ మళ్లీ ఇలాంటి వ్యూహాన్ని అనుసరిస్తోందా అనే దానిపై అక్కడ ఆందోళనలు మొదలయ్యాయి.

మరోవైపు ధురంధర్ పాకిస్థాన్ కు వ్యతిరేకంగా తీశారంటూ మన దేశంలోని సో కాల్డ్ లౌకికవాదులు చిటపటలాడుతుంటే అక్కడి జనాలు మాత్రం ఈ చిత్రాన్ని తెగ ప్రేమిస్తున్నారు. ఈ చిత్రంలో చూపించిన దృశ్యాలు నిజ జీవితానికి దగ్గరగా ఉన్నాయని వారంటున్నారు. కరాచీలోని ల్యారీ రాజకీయాలు, నేరాలు ఉన్నది ఉన్నట్లుగా చూపించారే తప్ప, తమను చెడుగా చూపలేదని అక్కడి జనం మెచ్చుకుంటున్నారు. సినిమాను మళ్లీ మళ్లీ చూస్తామని చెప్తున్నారు. ఈ అభిప్రాయాలు దేశ గూఢచార సంస్థలకు, పోలీసులకు చెమటలు పట్టిస్తున్నాయి. నిజానికి ధురంధర్ సినిమా పాకిస్థాన్ థియేటర్లలో విడుదల కాలేదు. అయితే ప్రపంచ వ్యాప్తంగా ధురంధర్ రిలీజ్ అయిన ఎనిమిది వారాల తర్వాత జనవరి 30న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ మొదలైంది. దాంతో పాకిస్థానీలు ఆ సినిమాను చూసే అవకాశం ఏర్పడింది. దాంతో అలా వచ్చిన కొన్ని రోజుల్లోనే మిగతా సినిమాలన్నింటినీ దాటేసి అగ్రస్థానానికి ధురంధర్ చేరింది. మరోవైపు ఈ సినిమా పైరసీ సీడీలు కూడా అక్కడ విపరీతంగా అమ్ముతున్నారు. నేనేం కొన్నానో చూడండి అంటూ ఓ యూట్యూబర్ తాను కొన్న సీడీ చూపించాడు.

ధురంధర్ కథాంశం ఏమిటి?

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన రహస్య గూఢచార నేపథ్య చిత్రాలు ధురంధర్, ధురంధర్: ది రివేంజ్. పాకిస్థాన్ లోని ఉగ్రవాద సంస్థల్ని మూలాలతో సహా పెకిలించి.. అంత మొందించేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చేపట్టిన రహస్య ఆపరేషన్ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది.

1999 డిసెంబర్ 30 నాడు జరిగిన భారతీయ విమాన హైజాక్, 2001 డిసెంబర్ 13 నాటి భారత పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడి తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యాన్ని కథాంశంగా తీసుకున్నారు. హైజాక్ చేసిన విమానాన్ని కాందహార్ ఎయిర్‌పోర్ట్ తీసుకెళ్లిన ఉగ్రవాదులు భారత దేశాన్ని కించపరచడం ఇంటెలిజన్స్ బ్యూరో చీఫ్ అజయ్ సన్యాల్ (మాధవన్)కు ఆగ్రహం తెప్పిస్తుంది. అప్పుడే పాకిస్థాన్‌లోకి వెళ్లి అక్కడున్న ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు 'ధురంధర్' అనే మిషన్ పురుడు పోసుకుంటుంది. పార్లమెంటు మీద దాడి ఘటన తర్వాత ధురంధర్ ఆపరేషన్ అమలులో పెడతారు.

పంజాబ్‌లోని జస్కీరత్ సింగ్ రంగీ (రణ్‌వీర్ సింగ్) తన కుటుంబానికి జరిగిన అన్యాయానికి



ప్రతీకారం తీర్చుకుని మరణశిక్ష పడటం, ఆపై భారత గూఢచార సంస్థ రా అతన్ని రిక్రూట్ చేసుకోవడం వంటి సన్నివేశాలు ఎంతో ఉత్కంఠభరితంగా సాగుతాయి. హమ్జా అలీ మజారీ పేరుతో పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన ఆ యువకుడు కరాచీలోని ల్యారీ ప్రాంతంలో అండర్ వరల్డ్ డాన్ రహమాన్ డకాయిట్ (అక్షయ్ ఖన్నా)కు దగ్గరవుతాడు.

ఎస్పీ అస్లాం చౌధురి (సంజయ్ దత్) అరాచకాలు, ఐఎస్ ఐ చీఫ్ మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్) వ్యూహాలు స్థానిక రాజకీయ నాయకుడు జమీల్ జమాలి (రాకేష్ బేడి) ఎత్తగడలు, ఆయన కూతురు యెలినా జమాలి (సారా అర్జున్) హమ్జా అలీతో జరిపే ప్రేమాయణంతో ఆసక్తి రేగుతుంది. వీరందరితో మానసిక యుద్ధం చేస్తూ రహమాన్ డెకాయిట్ హత్య తర్వాత తానే డాన్ అయిపోతాడు హమ్జా. ముఖ్యంగా 26/11 దాడుల తర్వాత హమ్జాలో కలిగిన పరివర్తన, ఉగ్రవాద మూలాలను పెకిలించాలనే అతని సంకల్పం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. తన సొంత దేశం కోసం కన్నతల్లిని, సోదరిని వదులుకుని పరాయి దేశంలో గూఢచారిగా బతకడంలోని బాధను రణవీర్ తన నటనతో పండించారు.

ఇక తాజాగా వచ్చిన ధురంధర్ రెండో భాగం (రివెంజ్)లో హమ్జా విశ్వరూపం కనిపిస్తుంది. ఈ చిత్రం అంతటా 'బడే సాబ్' ఎవరు అనే ఉత్కంఠ కొనసాగుతుంది. దావూద్ ఇబ్రహీం ఇప్పుడు ఎలాంటి పరిస్థితిలో ఉన్నాడో చూపించారు. భారత ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం తర్వాత పెద్దనోట్లను రద్దు చేయడంతో ఉగ్రవాదులకు జరిగిన నష్టం, వారి శిక్షణా శిబిరాలను హమ్జా ధ్వంసం చేయడం ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. చివరకు హమ్జా భారత్ ఏజెంట్ అని తెలిసిన తర్వాత ఏం జరిగింది, ఆయన ఎలా తప్పించుకున్నాడు అనేది క్లైమాక్స్.

దర్శకుడు ఆదిత్యధర్ కథాంశాన్ని రెండు చిత్రాలుగా, పలు చాప్టర్లుగా చూపించారు. ధురంధర్ ఒక్కో భాగం మూడున్నర గంటలకు పైగా రూపొందించినా ప్రేక్షకులకు ఎక్కడా బోర్ కొట్టకపోవడం మరో విశేషం. కాగా కథలో భాగమైన హత్యలు, నరికివేతలు, పేలుళ్లు, రక్తం చిమ్మడం కాస్త ఇబ్బంది కరంగా అనిపించవచ్చు. భారత గూఢచారి రవీంద్ర కౌశిక్ ప్రేరణతో హమ్జా పాత్రను రూపొందించారు. అయితే ధురంధర్ కల్పిత కథ అని దర్శకుడు వివరణ ఇచ్చారు.

క్రికెటర్ కాబోయి డైరెక్టర్

డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యాను అని సినీ పరిశ్రమలో చెప్పుకోవడం వినే ఉంటాం.. జీవితంలో ఏదో సాధించాలనుకుంటే ఇంకో పనిలో సత్తా చాటుకునేవారుంటారు. ధురంధర్ డైరెక్టర్ ఆదిత్య ధర్ అలాంటి వాడే. క్రికెటర్ కావాల్సిన ఇతడు సినీ డైరెక్టర్‌గా పెద్ద హిట్టే కొట్టాడు. కశ్మీర్ పండిట్ కుటుంబానికి చెందిన ఆదిత్య ధర్ క్రికెటర్ మీద మోజుతో ఢిల్లీ అండర్-19 టీమ్ తరఫున ఆడాడు. క్రికెట్‌లోని రాజకీయాల కారణంగా 2002లో భారత అండర్-19 వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కలేదు. దీంతో ఆ ఆటనే పక్కన పెట్టి ఆదిత్య ధర్ రచయిత అవతారం ఎత్తాడు. 2006లో వచ్చిన కాబుల్ ఎక్స్‌ప్రెస్‌కు పాటలు రాశాడు. తర్వాత హోల్ ఏ దిల్, ఆక్రోష్, తేజ్ తదితర చిత్రాలకు పని చేశాడు. అనంతరం సినీ దర్శకునిగా మారాడు. దర్శకునిగా 2019లో తీసిన తొలి చిత్రం 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'తో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగింది. అదే ఏడాది తన సోదరుడితో కలిసి బీ 62 స్టూడియోస్ స్థాపించిన ఆదిత్య ధర్.. నటి యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో నటించిన 'ఆర్టికల్ 370' సినిమాను నిర్మించి, రచయితగానూ పనిచేసి విజయం సాధించాడు. 'ఉరి-ది సర్జికల్ స్ట్రైక్' తీస్తున్నప్పటిలోనే అందులో నటించిన యామీ గౌతమ్‌తో ప్రేమలో పడ్డ ఆదిత్య 2021లో పెళ్లి చేసుకున్నాడు. 2025 డిసెంబరు 5న 'ధురంధర్' విడుదల కాగా, దాని రెండో భాగం 2026 మార్చి 19న రిలీజైంది. మూడు నెలల వ్యవధిలో వచ్చిన ఈ రెండు చిత్రాలు భారతీయ సినీ పరిశ్రమ చరిత్రను తిరగ రాశాయి. ★

భాగం-30

రూసో చెప్పిన తత్త్వం - 2

ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ రాజనీతి తత్త్వవేత్త రూసో. అతడు చెప్పిన రాజనీతి శాస్త్రాన్ని శ్రీకరపాత్రీ స్వామి విశ్లేషిస్తున్నారు. రామరాజ్యమనే దృష్టితో చూసినప్పుడు ఆ సిద్ధాంతంలోని లోటుపాట్లేమిటో వివరించి చెబుతున్నారు.

రూసోను, 'రాజకీయ విప్లవ దేవత' అని రాక్స్పియర్ పిలిచాడు. రూసో వ్యక్తి వాదానికి మద్దతునిస్తూ, పూర్తి అరాచకవాదంతో కూడిన స్వతంత్రతను సమర్థించాడు. నాగరిక సమాజానికి పూర్తి విరోధిగా మారాడు. స్వతంత్రత, నైతికత అనేవాటిని ఆయన సమాజానికి విరోధులుగా పిలిచాడు. దీన్ని ఆధారంగా తీసుకుని, ఫ్రెంచివారు తమ కాలంనాటి సమాజంతో విరోధించారు. వ్యక్తిగత సురక్ష కోసం సంఘర్షించారు. విప్లవం ముగిసిన తరువాత, 'జాతీయ సభ'ను (పార్లమెంట్) ప్రకటించారు. ఈ రకమైన విచారధార తరువాతి తరాల వారికి ప్రేరణగా నిలిచింది. ఎందుకంటే వ్యక్తివాదులు కూడా స్వతంత్రత, దాంతోపాటు సమాజమూ పరస్పరమూ విరోధంగా ఉంటాయని భావించేవారు.

రూసో రచించిన వ్యాసాన్ని వార్కర్, 'వ్యక్తివాదానికి ప్రాణం' అని పిలిచాడు. కానీ అన్యత్ర రూసో నియంతృత్వాన్ని కూడా సమర్థించినట్లుగా కనిపిస్తుంది. 'రాజ్యం లేకుండా ఉండే వ్యక్తులు కీటకాలతో సమానం' అని ముందుగా చెప్పిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. రాజ్యం ద్వారా వ్యక్తులు స్వాతంత్ర్యం పొందడానికి బాధ్యులను చేయడం సమంజసంగా భావించాడు. రాజ్యం ద్వారా నిర్మితమైన నాగరిక ధర్మాలను ఉల్లంఘించే పౌరులకు కఠిన దండన పాలుచేయడం సమంజసమని భావించాడు. అందువల్లనే రూసోను 'వాన్స్', 'వ్యక్తిత్వానికి శత్రువు' అని పిలిచాడు. అదే సందర్భంలో అతడు, 'సామాన్య ఇచ్ఛకు మూలం ప్రజాభిమతం' అని కూడా స్పష్టంగా పేర్కొన్నాడు. అదే పుస్తకంలో అతడు, 'మానవుడు స్వతంత్రునిగానే జన్మించాడు. కానీ అన్నిచోట్లా శృంఖలాలతో బంధింతుడయ్యాడు' అని చెప్పాడు.

ఇంకా అదే పుస్తకంలో మరోచోట, రాజ్య పరిపూర్ణతను గురించి కూడా వర్ణించాడు. ఇంకా 'పూర్ణత్వం ఏదో ఒక దేశంలో మాత్రమే సాధ్యమవుతుంది. అన్నిచోట్లా కాదు' అని రాశాడు. అతడు స్వాతంత్ర్యం అనేది జలం, వాయువుల కంటే కూడా నన్నిహితత్వం కలిగినది. అంటే అందుబాటులో ఉన్నది' అని చెప్పాడు. వ్యక్తిగత సంపత్తి అనేది సమాజం, రాజ్యానికి మంత్రసాని వంటిది అన్నాడు. దారిద్ర్యము, బానిసత్వము అనేవి రాజ్యం, సమాజాలకు పుట్టుకనిచ్చిన తల్లి వంటివన్నాడు. కానీ అతడే మరోచోట వ్యక్తిగత ఆస్తిని మంచి వస్తువుగా పేర్కొన్నాడు. అతడే రచించిన 'ఏమిల్' అనే పుస్తకంలో కూడా 'వ్యక్తిగత సంపత్తి ఆధారమని, న్యాయయుక్తం' అని భావించాడు. ఆ సంపత్తిని సంరక్షించే బాధ్యత రాజ్యానిదే అన్నాడు.

'కార్సికా' అనే పుస్తకంలో వ్యక్తిగత ఆస్తిని అంతం చేయడం సాధ్యం కాదన్నాడు. అవసరం లేదన్నాడు. ఈ విధంగా అతడు కొన్నిచోట్ల సంపదకు శత్రువుగానూ, మరికొన్ని చోట్ల పూజారిగానూ కనిపిస్తాడు. ఇదేరకంగా కొన్నిచోట్ల 'స్వాతంత్ర్యాన్ని విడిచి పెట్టినవాని'గా, మరికొన్నిచోట్ల 'బానిసత్వాన్ని విడిచిపెట్టినవా'నిగా కనిపిస్తాడు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పరిమితులు కలిగిన రాజరికాన్ని సమర్థించేవాడిగా కనిపిస్తాడు. కొన్నిచోట్ల స్వాతంత్ర్యాన్ని పొందాలంటే విద్య ఉండాలన్నాడు. కొన్నిసార్లు విద్య అనేది రాజరికంలో భాగంగా ఉండాలన్నాడు. కొన్నిసార్లు కళలను నిందిస్తాడు... మరికొన్నిచోట్ల ప్రశంసిస్తాడు. 'రూసో జీవితం అస్తవ్యస్తంగా ఉండేది. అలాగే అతడి తత్త్వశాస్త్రం కూడా అస్తవ్యస్తంగా ఉంటుంది' అని చెప్పుకోవడం కూడా ఉంది.

రామరాజ్యమనే దృష్టిలో చూసినప్పుడు నేరగాళ్ల సంపత్తి నేరాలకు కారణమవుతుంది అని చెప్పవచ్చు. అలాగే శిష్టులు, నాగరికులు అయినవారి సంపత్తి ఎల్లవేళలా పరోపకారానికే వినియోగపడుతుంది. వ్యక్తుల ద్వారా సమాజం నిర్మితమవుతుంది. సమాజాల ద్వారా వ్యక్తులు అభివృద్ధి చెందడానికి తగిన అవకాశాలు లభిస్తాయి. అందువల్ల వ్యక్తికి సమాజానికి మధ్య విరోధం ఉండదు. ఆ రెండింటి మధ్య సమన్వయమే ఉచితమైనది. ఎవరూ కూడా సర్వజ్ఞులు కారు. అన్ని విషయాలలోనూ అందరి ఆమోదం, సమ్మతి పొందడం కంటే... ఎవరు ఏ విషయంలో బాగా తెలిసినవారో వారి ఆమోదాన్ని ఆ విషయంలో పొందడం లాభదాయకం.

అందువల్ల పౌరులందరినీ సంఘానికి చెందిన నియమావళిని రూపొందించడంలో భాగస్వాములను చేయడం వ్యర్థం. అయితే పౌరులందరినీ భాగస్వాములను చేయడం ద్వారా రాజ్యం ఈశ్వరీయ సంస్థ అనే అంధవిశ్వాసానికి దూరమవుతారనే నెపంతో కొందరు వీటిని అంగీకరిస్తుంటారు. వారు ఇట్టి నమ్మకాలను అవైజ్ఞానికం అని చెప్పడానికి కూడా ధైర్యం చేస్తుంటారు. కానీ ఒకవేళ విజ్ఞానం అనేపదానికి అర్థం సత్యజ్ఞానం మాత్రమే అయితే, అప్పుడు యుక్తి, తర్కం, అపౌరుషేయాలైన వేదాది శాస్త్రాల ద్వారా నిరూపితమైన ఈశ్వర, ఈశ్వరీయ వ్యవస్థలను అవైజ్ఞానికం అని చెప్పడం కేవలం సాహసం మాత్రమే. రాజనీతి శాస్త్రాల ద్వారా నిజానికి సత్యసిద్ధాంతానికి చెందిన అభివ్యక్తి మాత్రమే జరుగుతుంది. మానవీయ సంస్థలకంటే దైవీ సంస్థలను గురించి తెలుసుకోవడానికి కొంత అధికజ్ఞానం పొందడం అవసరం అవుతుంది.

మధ్యయుగానికి చెందిన యూరోప్ ప్రజలకు ఈ విషయంలో, 'ఈశ్వరునికి ప్రతినిధిత్వాన్ని వహించిన పాలకుడు అవినీతిపరుడైనప్పటికీ గౌరవించి తీరాల్సిందే. ఎందుకంటే పాపులైన ప్రజలను శిక్షించేందుకే ఈశ్వరుడు దుష్ట పాలకులను పంపిస్తుంటాడు' అనే అప్రామాణికం అయిన విశ్వాసం ఉండేది.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

నియోజకవర్గాల స్థితి,

లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలను పునర్విభజించడం, పునర్వ్యవస్థీకరించడం అన్నది అన్ని ప్రజాస్వామ్య దేశాల్లోనూ సాధారణ విషయమే. ప్రజలకు సరైన ప్రాతినిధ్యం లభించేందుకు కనీసం పదేళ్ల కొకసారి నియోజకవర్గాలను పునర్విభజించడం అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాల్లో చట్టబద్ధంగా జరిగిపోతుంటుంది. భారతదేశం వంటి అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో మాత్రం ఈ అత్యవసర కార్యక్రమం చోటు చేసుకుని నాలుగు దశాబ్దాలు కావొస్తోంది. భారత దేశానికి, ఇక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థకి మూలస్తంభాల్లాంటివి నియోజకవర్గాలు. వాటిని రూపొందించడం, మధ్య మధ్య వాటిని పునర్వ్యవస్థీకరించడం అనేది అనివార్యమైన కార్యక్రమం.

ప్రజలు తమకు లోక్‌సభ, శాసనసభల్లో ప్రాతినిధ్యం వహించడానికి పార్టీ అభ్యర్థులనో, స్వతంత్ర అభ్యర్థులనో ఎన్నుకోవడానికి ఆ నియోజక వర్గాలు తోడ్పడతాయి. ప్రజల సంఖ్య పెరుగుదల, తరుగుదలను బట్టి నియోజక వర్గాలను పునర్విభ జించడం, పునర్వ్యవస్థీకరించడం జరుగుతుంటుంది. తదుపరి జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన 2024 ఎన్నికల తర్వాత తప్పకుండా చోటు చేసుకుంటాయని కేంద్ర ప్రభుత్వం గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రకటించింది. నిజానికి, సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతోంది. 2027 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జనాభా గణనీయంగా పెరిగినప్పటికీ, అనేక పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రజలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ పునర్విభజన కార్యక్రమాన్ని చేపట్టింది.

భారీగా వ్యత్యాసాలు

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి భారత రాజ్యాంగం స్పష్టమైన కొన్ని నియమ నిబంధనలను రూపొందించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం ప్రతి రాష్ట్రం నుంచి దాని జనాభా ప్రకారం లోక్‌సభకు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాలలోని నియోజకవర్గాలన్నిటిలో దాదాపు ఒకే సంఖ్యలో జనాభా ఉండాల్సిన అవసరం ఉంది. సహజంగా నియోజకవర్గానికి, నియోజక వర్గానికి మధ్య జనాభా విషయంలో కొద్దో గొప్పో తేడా ఉండడం జరుగుతుంది. ఈ తేడా బాగా ఎక్కువగా ఉన్నప్పుడు ప్రజలందరికీ తర తమ భేదం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవడం సాధ్యం కాదు. సామాజికంగా కొన్ని వర్గాలకు మాత్రమే ప్రాధాన్యం పెరిగే అవకాశం కూడా ఉంటుంది. పదేళ్లకొకసారి జనాభా లెక్కలను సేకరించడం, నియోజకవర్గాలను అందుకు తగ్గట్టుగా పునర్విభజించడం, లోక్‌సభ, శాసనసభ నియోజక వర్గాలకు దామాషా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించడం అనివార్యంగా జరగవలసిందేనని రాజ్యాంగం స్పష్టంగా చెప్పింది. కాగా, ఈ నియోజక వర్గాల పునర్విభజనను 2001 జనాభా లెక్కల వరకు స్తంభింపచేస్తూ 1971లో 42వ రాజ్యాంగ సవరణను

జి.రాజశేఖర్, సీనియర్ జర్నలిస్ట్

తీసుకురావడం జరిగింది. జనాభా నియంత్రణను తు.చ. తప్పక అమలు చేసిన రాష్ట్రాలకు దీనివల్ల ఊరట లభించింది. జనాభా తగ్గిన కారణంగా శాసనసభలోనూ, లోక్‌సభలోనూ తమకు ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని భయపడిన రాష్ట్రాలు ఈ సవరణతో ఊపిరి పీల్చుకున్నాయి. జనాభా మార్పులను నమోదు చేయడానికి మాత్రమేనన్న ట్టుగా 2001లో కొద్దిగా నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అయితే, లోక్‌సభ, శాసనసభ స్థానాల సంఖ్యలో మాత్రం మార్పు తీసుకురాలేదు. సమతుల్యమైన జనాభా అభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతో జనాభా లెక్కలను, నియోజకవర్గాల పునర్విభజనను 2026 వరకు వాయిదా వేస్తూ పోయారు. వీటన్నిటి ఫలితంగా దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఓటుకు విలువ ఎక్కువగా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో ఓటుకు విలువ బాగా తగ్గిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 18 లక్షలు పైబడి ఉండగా, కేరళలో ఒక నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 13 లక్షలు మాత్రమే. అంటే, కేరళకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరగ్గా, ఉత్తరప్రదేశ్‌కు బాగా తగ్గింది. ఇదే రకమైన తేడా ఉత్తర భారతానికి, దక్షిణ భారతానికి మధ్య కూడా కనిపిస్తోంది.

ప్రాతినిధ్యానికి గండి

త్వరలో చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో బాగా తగ్గిపోయే అవకాశం ఉందన్న ఆందోళన ఇప్పటికే ప్రారంభం అయింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా గణనీయంగా పెరగగా, దక్షిణాది రాష్ట్రాల్లో బాగా తగ్గిపోయిందని, దీనివల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం బాగా తగ్గిపోయే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు జరగబోయే నియోజకవర్గ పునర్విభజన కార్యక్రమం ఈ అసమతూకాన్ని సరిదిద్దడమే కాకుండా, రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తిని కూడా కాపాడాల్సి ఉంటుంది.

ఈ పునర్విభజన కార్యక్రమంతో లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యం మధ్య కూడా సమతూకం తీసుకు రావాల్సి ఉంటుంది. అంతేకాదు, పట్టణాలు, గ్రామాల మధ్య కూడా సమతూకం తీసుకురావాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో గ్రామీణ జనాభా కంటే పట్టణ జనాభా విపరీతంగా పెరిగిపోయింది. 1971 తర్వాత జనాభా లెక్కలు, పునర్విభజన కార్యక్రమం స్తంభించి పోయిన కారణంగా రాష్ట్రాల

, గతి మారాల్సిందే!

మధ్య జనాభాపరమైన తేడాలను గుర్తించడం సాధ్యం కాలేదు. వాస్తవానికి, 1971 నుంచి మాత్రమే కాదు, 1991 తర్వాత నుంచి జనాభా విపరీతంగా పెరిగిపోయి, ఈ అసమ తుల్యతలు మరీ పేట్రేగి పోయాయి. ఉదాహరణకు, ఢిల్లీలో ఒక నియోజక వర్గంలో ఓటర్ల సంఖ్య 31 లక్షలు కాగా, చాందినీచౌక్ నియోజక వర్గం ఓటర్ల సంఖ్య 3.76 లక్షలు మాత్రమే. ఈ అసమతూకాలు లోక్‌సభలోనే కాదు, శాసనసభల్లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. శాసనసభల్లో చోటు చేసుకుంటున్న తేడాల ప్రభావం రాజ్యసభ సీట్ల మీద కూడా పడుతోంది. అనేక రాష్ట్రాల్లో, అనేక నియోజక వర్గాల్లో ప్రజలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదు. ఒక ప్రాంతంలో ఉన్న ఓటు విలువ మరొక ప్రాంతంలో కనిపించడం లేదు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ప్రజలకు, ఓటర్లకు సరైన ప్రాతినిధ్యం లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. దేశంలో జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల విభజన చివరి సారిగా 2021లో జరగాల్సి ఉండగా, కోవిడ్ కారణంగా వాయిదా పడడం జరిగింది. ప్రస్తుత జనాభా లెక్కలను, నియోజకవర్గాల విభజనను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే, ఎన్నికల్లో పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ ఓటర్లకే ఓటు విలువ ఎక్కువగా ఉంది.

దెబ్బతింటున్న దామాషా

ప్రతి నియోజకవర్గంలోనూ దాదాపు సరిసమాన సంఖ్యలో ఓటర్లు ఉండాలని రాజ్యాంగం నిర్దేశించింది. పారిశ్రామికీకరణ వల్ల, పట్టణాభివృద్ధి కార్యక్రమాల వల్ల పట్టణాలు, నగరాల్లో జనాభా పెరగడం, పట్టణాలకు వలస కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో జనాభా తగ్గడం వంటి కారణాల వల్ల అసమతౌల్యతలు మరీ పెరిగిపోతున్నాయి. వీటి ప్రభావం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల మీదా, వాటి కార్యకలాపాల మీదా పడుతోంది. అవి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మీదా, రాష్ట్రప్రభుత్వాల మీదా ఆధారపడుతున్నాయి. అవి కొద్దిగా కూడా స్వయం సమృద్ధిని సాధించలేకపోతున్నాయి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రాంత నియోజకవర్గాలను పునర్విభజన చేయాల్సిన అవసరం ఎక్కువగా కనిపిస్తోంది. పట్టణ ప్రాంత ఓటర్ల ఓటుకు విలువనివ్వడం అత్యవసరం అనే విషయాన్ని ప్రభుత్వాలు క్రమంగా గ్రహిస్తున్నాయి. పట్టణాలే కాదు, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నా పట్టణ ప్రాంతాల నియోజకవర్గాల్లో మార్పులు రావాలి.

ప్రాతినిధ్యంలో మార్పు

కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జనాభా లెక్కల సేకరణ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. వచ్చే ఎన్నికల నుంచి మహిళలకు రాజకీయ రంగంలోనూ, ప్రజాప్రాతినిధ్యం లోనూ 33 శాతం రిజర్వేషన్ కల్పించినందువల్ల, వారికి లోక్‌సభ, శాసనసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించాలన్న పక్షంలో తప్పనిసరిగా జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో లోక్‌సభ స్థానాల సంఖ్య 816కు పెరిగే అవకాశం ఉంది. అందులో 273 స్థానాలు మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. కాగా, వాస్తవానికి లోక్‌సభ, రాజ్యసభల్లో కంటే, శాసనసభల్లో ఓటర్లం దరికీ ఎటువంటి తేడా లేకుండా సరైన ప్రాతినిధ్యం లభించాల్సిన అవసరం ఉంది. 1971లో చేపట్టిన 42వ రాజ్యాంగ సవరణ వల్ల లోక్ సభ నియోజక వర్గాల్లోనే కాక, శాసనసభ నియోజకవర్గాల్లోనూ జనాభా గణన స్తంభించి పోయిన విషయాన్ని మరచిపోకూడదు. నియోజక వర్గాల పునర్విభజన అనేది రాజకీయ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తిని పటిష్ఠం చేయడానికి ఉపయోగపడాలి. ★

విపక్షాల నిరసనల మ

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. ఈ సమావేశాలు పది రోజుల పాటు దాదాపు ఏక పక్షంగా కొనసాగాయన్న విమర్శలు, విశ్లేషణలు ఉన్నాయి. ప్రధానంగా అధికార పక్షం తమ అభిప్రాయాలకు గౌరవం ఇవ్వలేదని, సమావేశాలు మొక్కుబడిగా సాగాయని ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. కాగా సమావేశంలో ముఖ్యమైన ద్రవ్య వినిమయ బిల్లు సహా కొన్ని బిల్లులను సభ ఆమోదించింది.

రాష్ట్రశాసనసభ బడ్జెట్ సమావేశాలు మార్చి 16వ తేదీన ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు మార్చి 30వ తేదీన ముగిశాయి. సభ ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపిన వెంటనే సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు చూస్తే.. పదిహేను రోజులలో పది రోజులు సభ నడిచింది. ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలకు, ఆదివారాలకు సెలవులు ప్రకటించారు. అయితే, చివరిరోజుకు ముందు 29వ తేదీ ఆదివారం మాత్రం సభ నడిచింది.

2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను మార్చి 20వ తేదీన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం 10.7 శాతం వృద్ధిరేటు నమోదు చేసిందని పేర్కొన్నారు. ఇది జాతీయ సగటు 8 శాతం కన్నా ఎక్కువ అని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ ప్రజా బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు.

ఈ సమావేశాలు 82 గంటల 47 నిమిషాల పాటు జరిగాయి. సభ్యులు మొత్తంగా 590 ప్రశ్నలు సంధించారు. సభ ముందుకు 11 బిల్లులు రాగా, 10 ఆమోదం పొందాయి. ఒక బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించారు. సమావేశాలు కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్షాలు అన్నట్లుగా సాగాయి. గాంధీ-గాడ్సేల నుంచి ఇందిరాగాంధీ వరకు.. ఎథిక్స్ కమిటీ నుంచి సీబీసీఐడీ వరకు.. సారీల నుంచి సవాళ్ల వరకు అధికార, విపక్షాలు ఢీ అంటే ఢీ అనేలా సమావేశాలు వాడివేడిగా సాగాయి. నిర్మాణాత్మక విధానపరమైన చర్చల కంటే రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఉభయ సభలు వేడెక్కాయి.కాగా 23 నుంచి వివిధ శాఖల పద్దులపై చర్చలు ప్రారంభమైనా, అధికార, ప్రతిపక్షాల మధ్య సమన్వయ లోపం కారణంగా అవి అర్ధవంతంగా జరగలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

తొలిసారి 'మండలి' సభ్యుల సస్పెన్షన్

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ అంశం అత్యంత వివాదాస్పదంగా మారింది. ఉభయ సభలకు హాజరైన ఆ పార్టీకి చెందిన ప్రతినిధులను అందరినీ సభల నుండి బహిష్కరించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖరరావు మాత్రం సభకు హాజరు కాకపోవడంతో బహిష్కరణ వేటు తప్పింది. మార్చి 29న అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ సస్పెండ్ చేయగా, మరునాడు శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు సజావుగా సాగకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పదేపదే అడ్డుపడుతున్నారన్న కారణంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 24 మంది ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. సస్పెండ్ అయిన వారిలో హరీష్ రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, కోవలక్ష్మి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్ రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, మర్రి రాజశేఖర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడులు ఉన్నారు. అలాగే, శాసన మండలి నుంచి సస్పెండ్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల్లో మధుసూదనాచారి, రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవరెడ్డి, సుంకరి రాజు, నవీన్ కుమార్‌రెడ్డి, మధుసూదన్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కోటిరెడ్డి ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్' వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని, అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంత్రి పొంగులేటిని వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉభయ సభల్లో చేసిన నిరసనలతో బహిష్కరణ వేటు పడింది. కాగా, అత్యంత ముఖ్యమైన ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరగాల్సిన సమయంలోనే ఉభయ సభల్లోనూ బీఆర్ఎస్ సభ్యులు లేకుండా పోయారు.

కీలక బిల్లులకు ఆమోదం

ఈ బడ్జెట్ సమావేశాల్లో మొత్తం పదకొండు బిల్లులు ప్రవేశపెట్టగా పది బిల్లులకు ఆమోదం లభించింది. మరో బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపుతూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. వాటిలో... తెలంగాణ ప్లాట్ ఫారమ్ ఆధారిత గిగ్ వర్కర్స్ బిల్లు- 2026 ఉంది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు

ఈ బడ్జెట్ సమావేశాల్లో మొత్తం పదకొండు బిల్లులు ప్రవేశపెట్టగా పది బిల్లులకు ఆమోదం లభించింది. మరో బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపుతూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. వాటిలో... తెలంగాణ ప్లాట్ ఫారమ్ ఆధారిత గిగ్ వర్కర్స్ బిల్లు- 2026 ఉంది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నారు.

ధ్య బడ్జెట్ సమావేశాలు

ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో దాదాపు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నారు. వారందరికీ చట్టపరమైన గుర్తింపు కల్పించడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ప్రతి కార్మికుడికి యూనిక్ ఐడీతో పాటు ఇన్సూరెన్స్, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. అగ్రిగేటర్స్ నుంచి 2 శాతం లెవీతో వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయనున్నారు. బీమా, పెన్షన్, మెటర్నిటీ బెనిఫిట్స్ కూడా కల్పించనున్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఉబర్, ఓలా వంటి ప్లాట్‌ఫామ్‌లు కార్మికులతో తలెత్తే వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెసల్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది.

న్యాయవాదులకు రక్షణ బిల్లు-2026కు కూడా అసెంబ్లీ ఆమోదం తెలిపింది. న్యాయవాదులపై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, వారికి రక్షణ కల్పించేందుకు ఈ బిలును రూపొందించారు. రాష్ట్ర ఉద్యోగుల తల్లిదండ్రుల సంరక్షణ జవాబుదారీ బిల్లు-2026కు కూడా సభ ఆమోదం లభించింది. అత్యంత భావోద్వేగ పూరితంగా చర్చకు వచ్చిన బిల్లు ఇది. మార్చి 29న అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైన తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల జీతం నుండి 15 శాతం లేదా రూ.10,000. ఏది తక్కువైతే అది కోత విధించి తల్లిదండ్రుల అకౌంట్లలో జమ చేస్తారు. ఈ చట్టం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులకు మాత్రమే కాదు.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నామినేటెడ్ సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులకు కూడా వర్తిస్తుంది. ఈ సమావేశాల్లో ఆమోదం పొందిన మరో బిల్లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ రద్దు బిల్లు-2026. రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వం డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా పునర్నిర్మించింది. ఇప్పటి వరకు స్వయంప్రతిపత్తి సంస్థగా ఉన్న దానికి, ఇప్పుడు పూర్తిస్థాయి ప్రభుత్వ విభాగ హోదా లభిస్తుంది. దీంతో నిధుల కేటాయింపులో ప్రాధాన్యత పెరగడంతో పాటు, శస్త్రచికిత్సల సామాగ్రి, మందుల కొనుగోలు వేగంగా జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లు- 2026, పేరాక్వాట్ నిషేధ తీర్మానాలకు కూడా అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

సెలెక్ట్ కమిటీకి హేట్ స్పీచ్ బిల్లు

ఇక, 'హేట్ స్పీచ్' బిల్లును ప్రభుత్వం సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేసింది. ఈ విద్వేషపూరిత ప్రసంగాల నిరోధక బిల్లు (తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026) పై వివిధ వర్గాల నుండి అభ్యంతరాలు రావడంతో దీన్ని మరింత అధ్యయనం కోసం కమిటీకి నివేదించారు.

ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ధనాన్ని ఖర్చు చేసే అధికారం చట్టబద్ధంగా లభించింది. రూ.3.24 లక్షల కోట్ల వ్యయం కోసం శాసనసభ రెండు అప్రోప్రియేషన్ బిల్లులను ఆమో దించింది. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లు. గత సంవత్సరం కంటే ఇది దాదాపు రూ.20,000 కోట్లు అధికం.మార్చి 23 నుండి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరిపి, మార్చి 30న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించారు. బడ్జెట్ సమావేశాల పొడిగింపుపై ప్రతిపక్షాలు పట్టుబట్టినా ఫలితం లేకుండా పోయింది. మొత్తం మీద చూస్తే ఈ సమావేశాల్లో కొన్ని నిజంగా చారిత్రాత్మక చట్టాలు.. అన్ని పార్టీలు మద్దతిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ బిల్లు వంటివి ఆమోదం పొందాయి. కానీ బిల్లు వంటివి ప్రతిపక్ష నిరసనల మధ్య, సరైన చర్చ లేకుండా ఆమోదించడం జరిగిందనే విమర్శలు వచ్చాయి.

వివాదాలు - ప్రభుత్వ నిర్ణయాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బంధువులకు చెందినట్లుగా విపక్షాలు ఆరోపించిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌తో పాటు గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కంపెనీలు చేస్తున్న మైనింగ్‌పై సీబీసీఐడీతో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ వివాదమే చివరికి బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు దారి తీసింది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహారశైలి దుమారం రేపింది. కడియం శ్రీహరి మాట్లాడుతుండగా కౌశిక్ రెడ్డి బెదిరించారని అధికార పక్షం ఆరోపించింది. 'గన్‌తో కాల్చి పడేస్తాన' అనేలా కౌశిక్‌రెడ్డి చేయితో సైగలు చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మండిపడ్డారు. దీంతో, కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని సభా ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేశారు. మూసీనది డీపీఆర్ వివాదం కూడా అసెంబ్లీలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలకు కారణమైంది.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

మతకలహాల ము

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కొందరు దుండగులు మత కలహాల ముసుగులో కూటమి ప్రభుత్వ నాయకులనే లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఈ మూకలు ఒక పథకం ప్రకారం వ్యవహరిస్తున్నాయి. సరిగ్గా నెల రోజుల క్రితం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఒక పాస్టర్ ఏకంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తలకే ఖరీదు కట్టడం సంచలనం సృష్టించింది. ఆ ఘటన మరువక ముందే, శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజుపై మారణాయుధాలతో దాడికి యత్నించడం ప్రకంపనలు సృష్టిస్తోంది.

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం లోని పెదపేట గ్రామంలో ఎంతో పురాతనమైన రామాలయం ఉంది. ఈ చారిత్రక ఆలయానికి సుమారు రెండు ఎకరాల విలువైన భూమి ఉంది. ఆ ఆలయం ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక శాసనసభ్యుడు, శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ఆ గ్రామాన్ని సందర్శించగా, ఆ ఊరిలోని కొందరు భక్తులు ఆయనను కలిసి, ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సరిగ్గా అదే సమయానికి అక్కడికి చేరుకున్న కొందరు వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా గొడవకు దిగారు. ఈ గ్రామంలో హిందువులు ఎవరూ లేరని, అందరూ క్రైస్తవ మతంలోకి మారిపోయారని వాదించారు. చుట్టుపక్కల అంతా క్రైస్తవులు ఉన్నందున ఇక్కడ రామాలయం కట్టడానికి వీల్లేదని దౌర్జన్యంగా మాట్లాడారు. పరిస్థితి చేయి దాటుతుండటంతో కొందరు పెద్దలు కల్పించుకుని రఘురామకృష్ణ రాజును అక్కడి నుంచి పంపించి వేశారు.

శ్రీరామనవమి నాడు పథకం ప్రకారం దాడి

ఉగాది రోజు జరిగిన గొడవను పక్కనపెట్టి, శ్రీరామనవమి పర్వదినాన స్వామివారిని వేసి దర్శించుకోవడానికి రఘురామ కృష్ణరాజు మళ్లీ పెదపేటకు వెళ్లారు. ఆయన రాకను ముందే వసిగట్టిన అల్లరిమూకలు భారీ ఎత్తున గుమిగూడాయి. రామాలయంలో ఎలాంటి పూజలు చేయడానికి వీల్లేదంటూ ఆయనను అడ్డుకున్నాయి. ఆయన ఎంతో భక్తితో శ్రీరాముని మెడలో వేసిన పూలదండను ఒక మహిళ అత్యంత అమానుషంగా లాగేసి బయటకు విసిరేసింది. ఆ వెంటనే ముందస్తు పథకంలో భాగంగా ఆ మూక దాచి ఉంచిన ఇనుప రాడ్లు, కత్తులు, వేకులు కొట్టిన కర్రలతో రఘురామకృష్ణరాజుతో పాటు ఆయన అనుచరులపై దాడికి దిగింది. అప్రమత్తమైన పోలీసులు ఆయనను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ దాడిలో అనిల్ కుమార్, వెజ్జు నాగసాయి అనే ఇద్దరు వ్యక్తులకు శరీరంపై కత్తిపోటు, తలలో మేకులు దిగడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పడంతో పోలీసులు గుంపును చెల్లాచెదురు చేశారు. గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో పాల్గొన్న 57 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

వితండవాదనల వెనుక అసలు కుట్ర

గ్రామంలో హిందువులు లేరని, అందువల్ల ఆలయం ఉండకూడదని గొడవ చేసిన వారి వాదనలో ఎలాంటి అర్థం లేదు. అక్కడ కొత్తగా గుడి కట్టడం లేదు.. పురాతన ఆలయాన్ని బాగు చేస్తున్నారు. ఒక మతం వారు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఇతర మతాల ప్రార్థనా మందిరాలు ఉండకూడదనే వితండవాదనను అంగీకరిస్తే, భారతదేశంలో మైనారిటీలకు చెందిన చర్చిలు, మసీదులు ఎన్నో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడ గమనించాల్సిన మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే...తాము మతం మారామని గర్వంగా చెబుతున్న వారంతా ప్రభుత్వ రికార్డులలో హిందువుల పేరుతోనే చెలామణి అవుతున్నారు. హిందూ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ పథకాలను అనుభవిస్తున్నారు. ఈ దాడి వెనుక అసలు కారణం మతం కాదు. ఆక్రమణ. రామాలయానికి చెందిన రెండు ఎకరాల భూమిని ఒక పాస్టర్ కబ్జా చేశాడని, ఆలయాన్ని అభివృద్ధి చేస్తే ఆ భూమిని తిరిగి ఇచ్చేయాల్సి వస్తుందనే భయంతోనే అతడు ఇలాంటి మూకలను ఉసిగొల్పినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఒక ఉన్నత స్థాయి పోలీసు అధికారి హస్తం దాడి వెనుక ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కూడా హిందూ సర్టిఫికెట్‌తో ఉద్యోగం సంపాదించి, బయట మాత్రం క్రైస్తవ సంఘాలను, చర్చిలను నిర్వహిస్తున్నాడు. గతంలో రఘురామకృష్ణరాజును అక్రమంగా అరెస్టు చేసి తీవ్రంగా హింసించిన చరిత్ర అతడికి ఉంది. అతడే ఈ దాడులను ప్రోత్సహిస్తున్నాడని, ఉగాది రోజున హెచ్చరించిన వైనం ఈ కుట్రను మరింత బలవరుస్తోంది. అతడు బహిరంగంగా బెదిరింపు వీడియోలు వదలడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

'ఘర్ వాపసీ' భయంతోనే ఉన్మాదం

గతంలో వివిధ ప్రలోభాలకు గురై మతం మారిన వారిలో చాలామంది ఇప్పుడు వాస్తవాలను గ్రహిస్తున్నారు. తాము మోసపోయామని తెలుసుకుని తిరిగి మాతృ మతంలోకి (ఘర్ వాపసీ) రావడానికి ఆసక్తి చూపుతున్నారు. కానీ పాస్టర్లు వారిని బెదిరిస్తూ అడ్డుకుంటున్నారు. ఇటీవలి కాలంలో హిందూ సంఘాలు చురుగ్గా పనిచేస్తూ మత మార్పిడులను గట్టిగా నిలువరిస్తున్నాయి. సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను ప్రజల్లోకి తీసుకువెళుతున్నాయి. దీంతో సొంత గూటికి చేరేవారి సంఖ్య పెరుగుతోంది. ఘర్ వాపసీలు ఇలాగే పెరిగితే తమ ఆదాయానికి, చర్చిల నిర్వహణకు తీవ్ర ఆటంకం

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

...సుగులో దాడులు

కలుగుతుందని కొందరు పాస్టర్లు భయాందోళనలు చెందుతున్నారు. ఆ కడుపుమంటతోనే ధర్మం గురించి ప్రశ్నించే హిందువులపైన దాడులను ప్రోత్సహిస్తు న్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజులను లక్ష్యంగా చేసుకోవ డానికి ప్రధాన కారణం ఇదేనని తెలుస్తోంది.

ప్రభుత్వ కఠిన హెచ్చరికలు

ఆకివీడు దారుణ ఘటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర స్థాయిలో ఖండించారు. ఆలయ పునరుద్ధరణ కోసం వెళ్లిన ఉప సభాపతిపైన ఆయుధాలతో దాడి చేయడం గర్హనీయమని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరెన్ని కుట్రలు చేసినా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అద్భుతమైన ఆలయ నిర్మాణం తథ్యం

ఈ పరిణామాల నేపథ్యంలో రఘురామకృష్ణ రాజు సంచలన ప్రకటన చేశారు. ప్రముఖ హిందూ సంస్థల పర్యవేక్షణలో, స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి నేతృత్వంలో ఆకివీడు రామాలయాన్ని అత్యంత భవ్యంగా పునర్నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఆగమ శాస్త్రం ప్రకారం, పూర్తిగా కృష్ణ శిలతో, కనీసం ఎనిమిది వందల సంవత్సరాల పాటు చెక్కుచెదర కుండా ఉండేలా ఈ ఆలయ నిర్మాణం త్వరలో చేపడతామని స్పష్టం చేశారు.

ఇది వివాదాస్పద స్థలం కాదు

ఈ దాడిని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది వివాదాస్పద స్థలం కాదని, అక్కడ ఎప్పటి నుంచో రాముడి విగ్రహాలు ఉన్నాయని స్పష్టం చేశారు. మతం మారిన వ్యక్తులు గుడి నిర్మాణాన్ని అడ్డుకోవడం విచిత్రంగా ఉందన్నారు. మతం మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవని సాక్షాత్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ మార్పిడి నుంచి వారు బయటకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా మతం మారినంత మాత్రాన వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాల సంస్కృతి, ప్రాముఖ్యత ఏమాత్రం చెరిగిపోవని తేల్చి చెప్పారు. స్థానిక హిందువుల కోరిక మేరకు విశ్వహిందూ పరిషత్ సహకారంతో ఆ ఆతలయాన్ని అభివృద్ధి చేసి తీరుతామని, ఈ పవిత్ర కార్యంలో ప్రతి ఒక్కరూ కలసి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ★

నివాళి

ఏఎస్ఆర్ ప్రసాద్ – స్మృత్యంజలి

అన్నాప్రగడ శివరామప్రసాద్ (ASR ప్రసాద్) గుంటూరు జిల్లా కారుమంచిలో, 1955లో జన్మించారు. 2025, డిసెంబర్ 7న స్వర్గస్తు లయ్యారు.

ఆంధ్రప్రభలో జర్నలిస్ట్‌గా వీరి రచనలు, వీరి విషయ వివరణ, విశ్లేషణలను గమనించిన పి.వేణుగోపాల్‌రెడ్డి సమాజకార్యంలో మీ అవసరముంది అనగానే సిద్ధం అంటూ భాగ్యనగరానికి వారి వెంట వచ్చేసారు. కుటుంబమంతా నందిగామలోనే ఉండేది. ఆ తరువాత జనసందేశ్‌లో, జాగృతిలో వారి ప్రస్థానం సాగింది.

బాల్యం నుంచి స్వయంసేవక్‌గా ఉంటూ.. అత్యున్నత గుణసంపదని ఎలా పొందవచ్చో తన జీవనం ద్వారా నిరూపించారు. బాల్యంలోనే పితృవియోగంతో కుటుంబ బాధ్యతనంతా తలకెత్తుకోవలసి వచ్చింది. అయినా అధైర్యపడలేదు. చూసిన ప్రతి పనీ నేర్చుకోవాలనే తృష్ణ వీరిని అనేక విషయాలు నేర్చుకునేలా చేసిందని చెప్పవచ్చు. మేదరి బుట్టలు అల్లడం దగ్గరి నుంచి హోమియో వైద్యం చేయడం వరకు ఎన్నో విషయాల పట్ల అద్భుత ప్రతిభ కలిగి ఉండేవారు.

ఇంట్లో నాయనమ్మ, తల్లి, అక్క, ఇద్దరు చెల్లెళ్లు.. వీరితో పాటు ఇతర బంధువులు.. ఇలా వ్యక్తిగత జీవితం ఎలా ఉన్నా సమాజ కార్యంలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. పరనింద అసలే లేదు.

కారుమంచి నుంచి నందిగామ వచ్చి అక్కడ సేల్స్ టాక్స్ ఆఫీసర్ దగ్గర అకౌంటెంట్‌గా పని నేర్చుకుని ఆడిటర్‌గా వృత్తి నిర్వహణ చేసేవారు. ఆ తరువాత ఆంధ్రప్రభలో రిపోర్టర్‌గా పనిచేస్తున్నప్పటికీ ప్రవృత్తి మాత్రం ఎల్లప్పుడూ సమాజకార్యమే. హోమియోవైద్యం నేర్చుకుని అనేక మందికి ఉచిత వైద్యం చేసేవారు. ప్రతి ఆదివారం ఏకలవ్య ఫౌండేషన్‌తో కలిసి ఆదిలాబాద్‌లోని వనవాసి క్షేత్రంలో ఉచిత వైద్యసేవలందించడానికి వెళ్లేవారు.

పుస్తక పఠనం వీరి దైనందిన జీవితంలో భాగం. అద్భుత మేధో సంపత్తి వీరి సొత్తు. విషయ విశ్లేషణ చేయడంలో వీరి ప్రతిభ అమోఘం.

1981లో వివాహమయిన తరువాత 1992లో కుటుంబాన్ని కూడా భాగ్యనగరానికి తీసుకొని వచ్చారు. మానవతా విలువలు నేర్పిస్తూ మమ్మల్ని పెంచారు అంటారు వారి అమ్మాయి. ఎట్టి పరిస్థితిలోను ఎవరి దగ్గరా చేయి చాచక పోవడం, ఆత్మాభిమానాన్ని చెదరనీయకపోవడం, మనకు ఉన్న దాంట్లో నలుగురికి పెట్టడం, దాంట్లో ఆనందాన్ని పొందడం.. నాన్నగారు మాకు ఇచ్చిన సంపద అని పిల్లలు చెప్తూ వచ్చారు.

ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు వారి సంతానం.

వారి ధర్మపత్ని కాన్సర్ బారిన పడి 2015లో మరణించారు.

ప్రస్తుతం భాగ్యనగర్‌లోని నాగోల్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో చిన్న కుమారుడితో కలిసి ఉండేవారు. కొంతకాలం జాగృతి సంపాదక వర్గంలో పనిచేశారు. వారికి ఉన్న తాత్విక చింతనయే వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా తన విధి నిర్వహణలోను, కర్తవ్య నిర్వహణలోను సమర్థవంతంగా సాగి పోవడానికి సహాయపడింది. ★

సేవాభావనలో

ప్రతినిత్యం ప్రజాసేవలో సేవాభావంతో తరించే సంస్థ సేవాభారతి అని తెలగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రశంసించారు. భాగ్యనగర్ కోఠీలో వైఎమ్ఐఎస్ భవనంలో 'రక్తనిధి'కేంద్రాన్ని ఆయన మార్చి 29న ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఇంతటి అధునాతన పరికరాలతో కూడిన రక్త నిధి కేంద్రాన్ని మొదటిసారిగా

ప్రసంగిస్తున్న గవర్నర్.. వైదికపై డి. దుర్గారెడ్డి,

తాను హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు గవర్నర్ నిధి ద్వారా సేవాభారతి కార్యక్రమాలకు సహకరించేవాడినని గవర్నర్ శుక్లాగుర్తు చేసుకున్నారు. 'వ్యక్తి బాగుంటే దేశం బాగుంటుంది' అనే సూత్రంతో పెడదారి పడుతున్న యువతలో మార్పునకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.యువతకు మత్తుపదార్థాల అలవాటు నుంచి విముక్తి కలిగించేలా ఉద్యమాన్ని ప్రారంభించానని, ఆ ఉద్యమం క్రమంగా గ్రామస్థాయి వరకు వెళ్లిందని తెలిపారు. అలా అది వేగం పుంజుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం, ఇతర రాజకీయ పక్షాలు దానిని ముందుకు తీసుకెళ్లడానికి విశేష కృషి చేశాయని గవర్నర్ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సేవాకార్య క్రమాల పట్ల విశేషంగా దృష్టి సారిస్తున్నారని చెప్పారు. ఎంపీలుగా మీ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారా?అంటూ వారికి దిశానిర్దేవం చేస్తున్నారని, పాలనా వ్యవహారాలతో తీరికలేకుండా ఉంటూ కూడా ఈ రకంగా ఆలోచించి ఎంపీలకు మార్గదర్శనం చేయడం గొప్ప విషయంగా భావించాలని అన్నారు.

ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సదస్యులు సుహాస్‌రావు హీరేమఠ్ ప్రసంగిస్తూ, రక్తం వ్యక్తి జీవనానికి చాలా అవసరమైనదని, రక్తదాతలో కర్తవ్యభావన, స్వీకరించేవారిలో కృతజ్ఞతాభావం ఉంటాయని అన్నారు. అయితే ఈ 'రక్త కేంద్రం' ఈ రెండు గుణాలు కలిగి ఉండడం విశేషం అని అన్నారు. రక్తదానం ద్వారా సంస్కారం కూడా నిర్మాణమవుతుందని అంటూ కొన్నినెలల క్రితం పూణేలో చోటుచేసుకున్న సంఘటనను ఉదహరించారు. రహదారి ప్రమాదంలో గాయపడిన యువకుడికి అరుదైన గ్రూప్ రక్తం అవసరకమైంది. ఆస్పత్రి యాజమాన్యం సూచన మేరకు రోగి తండ్రితో వాహనంలో వెళ్లి రక్తదానం చేసి తిరుగు ప్రయాణమయ్యారు. ఇంటికి కొంత దూరంలో వాహనం ఆపించి నడచి వెళతానని ఆ దాత చెప్పాడు. ఇంటి సమీపంలో జనం గుమికూడి ఉండడాన్ని గమనించిన రోగి తండ్రి విషయాన్ని ఆరా తీయగా, రక్తదాత కుమారుడు మరణించాడని తెలిసింది. కన్నీటి పర్యంతమైన ఆయన 'ఈ స్థితిలో మీరు ఎలా వచ్చారు' అని అడిగారు. 'నా కుమారుడు మరణించాడు. తిరిగిరాడు కదా? కాని ఆపదలో ఉన్న యువకుడి ప్రాణం కాపాడడానికి నా రక్తం ఉపయోగపడుతుందని తెలిసినపుడు అంతకన్నా మంచి పని ఏముంటుందని భావించి, మీరు పిలిచన వెంటనే వచ్చాను' అని సమాధానమిచ్చారని సుహాస్ రావు గుర్తు చేశారు.

రక్తదానం చర్య మానవత పెంపునకు ఎలా దారితీసిందో మరో సంఘటలను వివరించారు. ముంబైలో చిరువ్యాపారాలు చేసుకొనే ముగ్గురు యువకులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ ఆ విధిలో అల్లమూకగా తయారైనారు. ముంబైలోనే ఒక వ్యక్తి తన భార్యకు అత్యవసరంగా రక్తం అవసరమై ఆ యువకులను సంప్రదించగా, రక్తం ఇవ్వడానికి వాళ్లు ముందుకు వచ్చారు. రక్తదానం చేయడం అదే వారికి తొలిసారి. తన భార్య ప్రాణాలను కాపాడిన ఆ యువకులకు ఆమె భర్త కంటతడితో పాదాభివందనం చేశాడు. దాంతో తాము ఒక మంచి పని చేశామనే భావన వారిలో కలిగింది. అప్పటి నుండి ఆదర్శ జీవితం గడపడమే కాదు, వారిలో ఒకరు ప్రస్తుతం ముంబైలో ఏ ఆస్పత్రి యాజమాన్యమైనా

సేవాభారతి

చూశానని ఆనందం వ్యక్తం చేశాను. ఇది కేవలం చికిత్స కేంద్రం కాదని, మానవతా సేవ మందిరమని కొనియాడారు. జీవితాన్ని దేశసేవకు అంకితం చేసిన డాక్టర్ హెడ్గేవార్ పేరు మీద దీనిని ఏర్పాటు చేయడం అంటే డాక్టర్జీ జీవితాన్ని చరితార్థం చేసినట్లే అని భావం వ్యక్తం చేశారు.ఈ కేంద్ర ఏర్పాటులో చొరవ చూపిన సేవాభారతికి శుభాకాంక్షలు తెలిపారు.

బి.సుందర్‌రెడ్డి, సునీల్ సప్రే, డా. సతీష్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, సుహాస్‌రావు, శ్యాంకుమార్, విజయభారతి

రక్తం కోసం అతనిని సంప్రదించే టంత స్థాయికి ఎదిగారని వివరించారు. 'జీవిస్తూ జీవిస్తూ రక్తదానం.. పోతూ పోతూ నేత్రదానం' అనే లోకోక్తి నిజం కావాలని, ఈ రక్తం కేంద్రం నిరంతరం సేవలు కొనసాగించేలా సేవాభారతి, సంఘం సంయుక్తంగా యోజన చేస్తాయని సుహాస్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

అఖిల భారతీయ ధర్మజాగరణ సహ సంయోజక్ ఏలె శ్యాంకుమార్ యంగ్‌మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ (వైఐఎంఐఎస్) లక్ష్యాలను వివరించారు. ఈ భవనంలో గ్రంథాలయం, వైద్యసేవ, యోగా తరగతులు, రక్తం కేంద్రం, ట్యూషన్‌లు జరుగుతుంటా యని, వీటితోపాటు పేద బస్తీలలో బాలసంస్కార కేంద్రాలు, కిశోరివికాస కేంద్రాలు నిర్వహిస్తున్నదని వివరించారు. వైద్యసేవలో వైద్యుని రుసుముతోపాటు మందులు కూడా ఉచితంగా పంపిణి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడి వచ్చిన వారు రోగులకు అవసరమైన రక్తం కోసం ఇబ్బందిపడడాన్ని తాను భాగ్యనగర్‌లో జిల్లా ప్రచారక్‌గా ఉన్న సమయంలో గమనించినట్లు చెప్పారు. భాగ్యనగర్‌లో పెద్ద రక్త కేంద్రం ఏర్పాటు చేయాలన్న నాటి సంకల్పం ఈనాటికి నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ భద్రత సలహా మండలి సభ్యులు, డాక్టర్ హెడ్గేవార్ బ్లడ్ సెంటర్ అధ్యక్షులు డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, అనేకమంది దాతల సహకారంతో ఏర్పా టైన ఈ బ్లడ్ సెంటర్ బాగా వృద్ధి చెందాలని అన్నారు.

రాష్ట్రీయ సేవాభారతి అధ్యక్షులు సునీల్ సప్రే ప్రసంగిస్తూ హిందూ చింతనలోనే సేవాభావం ఉందని అన్నారు. అష్టాదశ పురాణాలను రచించిన వ్యాసభగవానుడు వాటి సారాంశాన్ని **'పరోప కారాయ పుణ్యాయ - పాపాయ పరపీడనం'** అని తెలిపారన్నారు. బలంగా ఉన్నవాడే మనగలడు అనేది మన సిద్ధాంతం కాదని, బలంగా ఉన్నవాడు కూడా బలహీనుల గురించి పట్టించుకోవాలనేది మన భారతీయత అన్నారు. **'క్రియాసిద్ధిః సత్వేభవతి మహతాం న ఉపకరణే'** అన్న ప్రకారంగా, క్రియాసిద్ధి అనే సంకల్పంతో రాష్ట్రీయ సేవాభారతి దేశమంతటా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఉదాహరణకు 'వైభవశ్రీ పేరుతో- మహిళల ఆర్థిక ఉన్నతి కొరకు తమిళనాడులో విశేషంగా పనిచేస్తోంది. ఈశాన్య రాష్ట్రాలలో ధన్వంతరియాత్ర పేరుతో గత 25 సంవత్సరాలుగా వనవాసులకు వైద్యసౌకర్యాలను అందిస్తోంది. మహారాష్ట్రలో జనకల్యాణ సమితి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది' అని వివరించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల కమీషన్ చైర్మన్ విజయభారతి, సేవాభారతి అధ్యక్షులు దుర్గారెడ్డి, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి, క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కాచంద్రశేఖర్, ప్రాంత సేవాభారతి కన్వీనర్ వాసు, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి ప్రబల, ప్రాంత సేవాప్రముఖ్ శివశంకర్, బ్లడ్ సెంటర్ ప్రధాన కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మడపల్లె.. నతవాడి మహారాజులవారి రాజప్రాసాదం..

ఉదయం కొలువుకు సిద్ధమయ్యాడు మహారాజు ఒక్కమల్ల రుద్ర మహారాజు. ఆయన రాజోచిత అలంకరణ పూర్తి అయ్యాక భర్తకు వృద్ధ ముత్తయిదువు అయిన పరిచారిక చేత దిష్టి తీశాక.. పరిచారికలంతా అంతరంగిక మందిరం నుంచి వెళ్లిపోయాక.. భర్త ఉద్వేగంగా ఆమెను దగ్గరకు హత్తుకోగా బిడియపడుతూ ఇబ్బంది పడుతున్నట్లు లబ్జుగా కదులుతూ అందమైన కనుదోయిని అష్టవంకరలు తిప్పుతూ, ''అబ్బ వదలండి..'' అంటోంది గారంగా ఆయన పట్టమహిషి. ఆయన తమకంగా ఆమెను మరింతగా తనవైపు గుంజుకుని తన అచంచల ప్రేమ కామ విశ్వాసాలు ప్రకటించ సాగాడు.

అప్పుడే మందిరం వాకిట వాద్యకారులు తమ పంచ వాద్యాలను శ్రుతి చేసుకుంటున్న శబ్దాలు అంతఃపురం లోపలికి వినబడ్డాయి. ఇద్దరూ విడివడి ఆత్మీయంగా చేయిచేయి పుచ్చుకుని బయటకు వచ్చారు. అంతఃపుర ప్రతిహారీ, పరిచారికలు వంగి ఆయనకు వీడ్కోలు పలుకగా అంతఃపురం వెలుపల ద్వారం వద్ద వేచి ఉన్న ఆయన అంతరంగిక నియోగి, అంగరక్షకులు వంగి నమస్కరించగా ఆయన ముందుకు కదిలాడు. అంగరక్షకులు పరివేష్టించాక వారి మధ్యగా నిలబడి వెనుదిరికి తననే చూస్తోన్న పట్టమహిషికి రాజసపు వీడ్కోలు పలికి ముందుకు నడిచాడు. పంచవాద్యకారులు, స్తోత్రపాఠకులు ఆయనకు నమస్కరించి ఆయనకు మరింత ముందు కదలుతుండగా రాచరిక బృందం కోటప్రాంగణంని సభామందిరంలో ప్రవేశించింది.

ఎంత మనోహరంగా కన్నులపండువగా ఉన్నదీ దృశ్యం!!

ఈ దృశ్యం కాకతీయరాజ్యపు సామంతరాజ్యం నతవాడి రాజధాని మడపల్లె రాజప్రాసాదం వద్ద నిత్యమూ కనిపించే దృశ్యం. మడపల్లెలోనే కాదు ప్రతి సామంతరాజ్య రాజప్రాసాదంలో ప్రతి ఉదయం రాచరిక కొలువు ఇలాగే ప్రారంభం అవుతోంది. ఇప్పుడు నతవాడి రాజ్యానికి ఇబ్బందులు, కష్టాలు ఏమీ లేవు. కేవలం అనుమకొండలోని సామంత రాజ్యసహకార నియోగానికి తెలియచెబితే చాలు. ఆ ఇబ్బంది కానీ కష్టం కాని రోజుల వ్యవధిలో పరిష్కారమౌతాయి.

* * *

అదే సమయంలో అదే నతవాడి రాజ్యంలో రుద్రేశ్వర దేవాలయం..

ఆ గుడి వద్ద వల్లకీలు, గుర్రబ్బళ్లు, ఎడ్ల బళ్లు.. రహదారి కనిపించకుండా నిండి ఉన్నాయి. ఆ గుడివద్ద అడుక్కుంటున్న కుంటివాడిప్పుడు కాస్త వొళ్లు చేశాడు. వాడిప్పుడు కేవలం గుడి వద్ద అడుక్కుని తిని అక్కడే మూడు అంకె వేసి ముడుచుకు పడుకోవడం లేదు. ఇప్పుడు వాడికో భార్య ఉంది. ఆమె ఇప్పుడు ఓ చంకలో పిల్లవాడిని పెట్టుకుని నెలలు నిండిన గర్భాన్ని అలవోకగా లాగుతూ నెత్తిన నీళ్లకుండలను పెట్టుకుని చెరువు నుండి వయ్యారంగా నడిచివెళుతోంది. ముష్టివాడు అలవాటైన యాచన చేస్తూ దూరంగా సాగిపోతున్న భార్యను చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నాడు.

లోపల పూజారిగారికున్న హోదా గౌరవ మర్యాదలు సహజంగా ఆ దేవుడికి కూడా లేవు. కాని సదరు పూజారి గారు లిప్తకోమాటు 'అంతా ఆ భగవంతుడి దయ.. మన ప్రాప్తం' అంటుంటాడు. ఆయన భార్య ఆరగారగా వెచ్చ వెచ్చని చెరకు పానకం.. మధ్యే మధ్యే చల్లచల్లని మజ్జిగ తెచ్చి భర్తకు అందిస్తోంది. భక్తుల కోలాహలం మధ్య ఆ భగవంతుడు చిన్మయానంద చిరునవ్వులు చిందిస్తున్నాడు.

ఇది కేవలం నతవాడి రాజ్యంలోని మడపల్లె దేవాలయంలోనే కాదు.. ముదిగొండలో.. సబ్బినాడులో.. పానగల్లులో.. కొణిదెనలో.. నెల్లూరులో.. వెలనాడులో.. కాకతీయ సామంతుల రాజ్యాలన్నిటా నగరాలలో నగర సంస్కృతీ.. గ్రామాలలో సహజ సౌందర్యం.. నిబ్బరంగా ప్రశాంతంగా కాకతీయ సామంత రాజ్యాలన్నిటా ఒకే సాంస్కృతిక జీవనం వెల్లివిరుస్తోంది.

గతంలో అత్యున్నత పాలకుడు మహారాజుకు ఓ మారుమూల గ్రామవాసులతో ఏమాత్రం దగ్గరితనం లేదు.

సాధారణ సమాజంపై మహారాజుల పని కేవలం పన్నులు వేసి వసూలు చేసుకోవడం. అందులో కొంత భాగం సాధారణ పాలనకు కేటాయిస్తారు కాబట్టి ఆ కొద్ది మొత్తంలో గ్రామ సమయశెట్టి ఆధ్వర్యంలో అందరికి వలసిన సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు.

అయితే ఇప్పుడు గణపతిదేవునిపాలనలో రాచరికపాలనా విధానం మారిపోయింది. నేరుగా మహారాజుగారే ఎప్పటికప్పుడు తగిన ఆదేశాలు, ఆజ్ఞలు జారీ చేస్తూ.. కాకతీయ పాలనా రాజ్యంలోనే కాదు.. ప్రతి మహాసామంత, సామంత రాజ్యంలోని ప్రతి గ్రామంలో కూడా శాంతియుత సహజీవనం, సమస్త వస్తుసేవలు అందుబాటులో ఉండేలా.. ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోయేలా పర్యవేక్షిస్తున్నారు.

శిక్షల తీవ్రత తగ్గించమని గ్రామ న్యాయాధికారులకు శాసనం చేశాడు. ముఖ్యంగా గ్రామబహిష్కరణ అనే శిక్షనే తొలగించాడు. తక్కువ సొమ్ము చెల్లించాలనే శిక్ష చాలా వాటికి విధించడం వల్ల ఆయా నేరస్థులు కష్టపడి సంపాదించి

గణపతిదేవుడు

30

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

మత్తి భానుమూర్తి

గ్రామ కచేరికి చెల్లిస్తున్నారు. వారి కుటుంబం గ్రామంలోనే ఉంటోంది. నేరస్థుడు తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో మరింత గౌరవంగా బతకడానికి యత్నిస్తున్నాడు.

ఇప్పుడు రహదారుల వెంట వెళ్లేవారికి దొంగల బెడద తగ్గిపోయింది. అంతేకాదు. ప్రతి రహదారి వెంట దట్టమైన అరణ్యాలున్నచోట,అడవి ప్రారంభమయ్యేచోట రక్షకభట శిబిరాలు ఏర్పాటు చేశాడు. రక్షకభటులు బాటసారులను కొందరిని జమ చేసి వెంట వెళ్లి అడవి దాటించి వస్తారు.వర్తక బిడారులు ప్రశాంతంగా సాగిపోతున్నాయి. రహదారులను ఎప్పటికప్పుడు బాగుచేయడానికి రహదారుల నియోగాన్ని రాజధానిలో ఏర్పరచాడు. ఏ రహదారి పాడైనా ఆ గ్రామ సమయశెట్టి తక్షణమే రాజధానికి ఎరుకపరచాలి. సదరు నియోగం వెనువెంటనే దానిని బాగుచేయాలి. ఇవి కేవలం కాకతీయ రాజ్యంలోనే కాదు. అన్ని సామంత రాజ్యాలలో అమలౌతున్నాయి.

* * *

కొమరవోలు గ్రామం.

ఉదయం మొదటి జాము చివరికి వస్తోంది.

పొద్దుపొద్దున్నే గ్రామంలో అశేష ప్రజ (మూడు గ్రామాలకు కలిపి ఒక న్యాయసభ) న్యాయసభ పెట్టారు. గ్రామ సమయం వారి చావిడి వద్ద న్యాయ మూర్తులు ముగ్గురు సమావేశమయ్యారు. గ్రామ సమయం తలారి ఉప్పలయ ముగ్గురికి కూర్చోవ డానికి బల్లలు వేశాడు. గ్రామ గావుండ సంబరసు, సమయ సెట్టి అబ్బరశెట్టి, కరణీడు నన్నెప్రెగ్గడ కూడా హాజరయ్యారు.

ఊరు మహిళలు ఫిర్యాదు చేశారు. పాలు అమ్ముకునే అంకెలయపై అభియోగం.

"చెప్పండమ్మా.. ఏవిటి మీ అభియోగం?" న్యాయాధికారి పరమం భట్టు ప్రశ్నించాడు.

డెబ్భైఏళ్ల భట్టుగారి పెద్ద బాన పొట్ట మీద విబూది అడ్డ గీతలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. న్యాయశాస్త్రంలో తానొక మహామేధావినని ఆయన భావిస్తున్నట్లు ఆయన ముఖ కవళికలు చెబుతున్నాయి.

ఓ యువతి ముందుకొచ్చింది. ఆమె ముఖం తడికట్టెలు కాలుతున్నట్లు కంపు, పొగ, ముసురు.. "అదుగో ఆ పాలు తీసుకు పోయేవాడు మా ముగ్గులన్ని గేదెలతో తొక్కిస్తున్నాడు. సంక్రాంతి పండుగంతా మేము ముగ్గులు వెయ్యడం.. వాడు తొక్కించుకుంటూ పోవడం.. ఇది పెద్ద తప్పు. పండుగపూట వేసిన ముగ్గులు అంటే ఆ సంక్రాంతి లక్ష్మికి పూజ చేసినట్లు. అలాంటి ముగ్గుల్ని తొక్కించడమంటే ఎంత అపరాధం.. వాడికి గ్రామ బహిష్కరణ శిక్ష విధించండి."

ఆమె మాటలు వింటూ చల్లగాలికి మాగన్నుగా తల ఊపుతున్న న్యాయమూర్తులకు ఆమె ఆఖరి మాట విని చిర్రెత్తుకొచ్చింది.

"వాడికి ఏ శిక్ష వేయాలో నువ్వు మాకు చెబుతావా.. ఏయ్..??!" అన్నాడందులో ఒకడు. బానపొట్ట భట్టు గారికి కూడా అరికాలి మంట నెత్తి కెక్కింది. ఇంత న్యాయశాస్త్రం అంతా బట్టీ పట్టిన తను చెప్పాల్సిన తీర్పును ఈ పిల్ల చెప్పడం ఏవిటి? బానపొట్ట మొత్తం కదిలిపోయేలా ఆయన కదిలిపోయాడు.

"అది చెప్పాల్సింది మేము.." అన్నాడు కుతకుత లాడిపోతూ.

"సరే సరే.. ఏవిరా గొల్లబ్బి.. ఏవిటి కావాలని ఆడపిల్లల ముగ్గులు తొక్కిస్తున్నావటా.. ఆయ్?!"

నిలబడ్డ చోటునుండే నేలను తాకి నెత్తి నోరు బాదుకున్నాడు గొల్ల అంకెలయ.

"అయ్యి గేదేలండి. మన మాట ఇనవండి. మొత్తంగా మొత్తం యాభె గేదేలండి. బాట నిండిపోతాయండే. మరి ముగ్గులు తొక్కక ఎట్టా పోతాయండే.. పెద్దోరు తమరికి చెప్పలేనండే.."

అప్పుడే గ్రామ గావుండ భట్టుగారి చెవిలో గొణిగాడు, "స్వామీ.. గ్రామ బహిష్కరణ మాత్రం విధించకండి. పైన గణపతిదేవ మహారాజులుంగారి ఆజ్ఞ. అది తప్ప అని. కాబట్టి చిత్తగించవలెను."

ఇది ఆయనకు తెలుసు. మరో ఊళ్లో గ్రామ బహిష్కరణ విధిస్తే.. ఊరు ఊరంతా తిరగబడింది. ఏదో న్యాయమూర్తివి అని చెబితే అన్నిటికి ఇదే శిక్షా అని..

"సరే సరే.. నేన్జూసుకుంటాలే.." అన్నాడు శబ్దం రాకుండా.

"దీనికి సరైనశిక్ష గ్రామ బహిష్కరణ కానీ అంకెలయ తప్పు తక్కువ.. గేదెల తప్పు ఎక్కువ.. కాబట్టి గేదెలకు గ్రామ బహిష్కరణ విధిస్తూ తీర్పు చెప్పడమైంది.."

తీర్పు చెప్పాడు కానీ మర్నాటి నుండి భట్టుగారి ఇంటికి పాలు పోసేవాడు లేడు.

ఏది ఏమైనా గ్రామ బహిష్కరణ శిక్షలు రాజ్యాలన్నిటా తగ్గిపోయాయి. అప్పటివరకు కనిపించని శాంతి రాజ్య రహదారుల్లో కనపడింది. బాటసారులు దారిదోపిడి భయం లేకుండా యథేచ్ఛగా తిరగసాగారు. ముఖ్యంగా వర్తక బిడారులు స్వేచ్ఛగా తిరగడంవల్ల ప్రజలకు అనేక వస్తువులు సమయానికి తగిన ధరల్లో దొరకసాగాయి.

శెట్టిలకు వర్తకం ప్రశాంతంగా జరిగితే.. ప్రజలకు మంచి వస్తువులు తక్కువ ధరల్లో దొరుకుతున్నాయి.

సుఖ జీవనానికి శాంతి భద్రతలు అప్పుడూ.. ఇప్పుడూ.. ఎప్పుడూ ముఖ్యమే!

* * *

పంజులురు గ్రామం, ముదిగొండ రాజ్యం..

పంజులురు గ్రామంలో జరగనున్న సంతకు ముక్కోటిశెట్టి బిడారు వెళుతోంది. అప్పటికి చీకటి దట్టంగా కమ్ముకుని దారి కనబడటంలేదు. కాని బిడారులోని వంద ఎడ్లబళ్లు మెల్లగా వెళుతున్నాయి. రహదారి కూడా కొత్తగా నిర్మించినట్లు దిట్టంగా ఉంది. బళ్ల గాలు మరింత ప్రత్యేకంగా గట్టిపరచినట్లు బండి చక్రాలు ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా సునాయాసంగా కదులుతున్నాయి. ఎడ్లు కూడా

చులాగ్గా బండి లాగుతున్నాయి. బిడారు అంతా ఆ చీకట్లో కూడా ఉత్సాహంగా సరదా సరదాగా ఉంది. వెనుక, ముందు బళ్లు తోలుతున్న పెరికలు చెప్పుకుంటున్న ముచ్చట్లు, పాడుతున్న కూనిరాగాలు, పగలబడి వినబడుతున్న నవ్వులు.. బూతులు..

ఉన్నట్లుండి రహదారి ప్రక్కనున్నదట్టమైన అడవుల నుండి దారి దోపిడీదారులు హఠాత్తుగా గుంపులు గుంపులుగా బిడారుపై వచ్చిపడ్డారు. ప్రశాంతంగా సాగుతున్న బిడారు నుండి బళ్లవాళ్లు బిత్తరపోయి, దొంగలు .. దోపిడీగాళ్లు.. రక్షించండి అంటూ అరవసాగారు. అయితే అది కేవలం కొన్ని లిప్తల కాలమే.

కాసేపటికి ఆ దారిదోపిడీగాళ్లు హాహాకారాలు చేస్తుండటం.. వారి శరీరాల నుంచి చిమ్మిన రక్తం ఆ దారంతా, బళ్లమీదా, ఎద్దుల మీదా చిమ్మి భయోత్పాతం కలిగిస్తోంది.

ముందు వచ్చిన దుండగులు హాహాకారాలు చేస్తుంటే వెనుకనున్న దుండగులు వెనుదిరిగి అడవిలోకి పరుగులు పెట్టసాగారు.

కారణం అన్ని బళ్లకూ రక్షణ భటులను ఏర్పాటు చేసింది గణపతిదేవుని రక్షణ నియోగం.

* * *

కాకతీయరాజ్యంలో వినూత్న పాలనా వ్యవస్థ ఏర్పాటయ్యింది.

సాధారణంగా బిడారు నిర్వహిస్తోన్న సమయ సెట్టికి ఎప్పుడూ పని చేసే పెరికవారు, మున్నూరు వారు ఉంటారు. చిన్నబిడారు నిర్వహించే సెట్టికి మున్నూరు వారిని రక్షణగా పెట్టుకునే స్తోమత ఉండదు. అయితే కాకతీయ మహామండలేశ్వరుడు గణపతిదేవుడు తన రాజ్యంతోపాటు తన సామంతుల, మహాసామంతుల రాజ్యాల్లో కూడా ప్రజాసమస్యలపై ఆయా మండలేశ్వరులు, 'నాడు' అధిపతులు, గ్రామరట్టలు.. ప్రజాసంక్షేమం కోసం తీసుకోవాల్సిన కొన్ని విధివిధానాలను నిర్దేశించి ఖచ్చితంగా అమలు చేయవలసినదిగా శాసించాడు. ఈ పద్ధతి ఇంతకు ముందు ఎక్కడా లేదు. ఎవ్వరూ వినలేదు.. ఏ పండితుడు తానూ చదివినట్లు చెప్పలేదు. సాధారణంగా మహారాజులు రాజ్యరక్షణ తమ ప్రధాన విధిగా.. అంటే ఎప్పుడూ ఎవ్వడో మన మీద దాడి చేయబోతున్నా డని.. లేదా మనం ఎవడి మీదకో యుద్ధానికి వెళ్లబోతున్నామన్న వార్తలు వ్యాపింపజేస్తుండటమే సాధారణంగా సమాజానికి తెలుసు.

రాజులు శ్రద్ధగా నిర్వహించే రెండవ కార్యక్రమం పన్నులు విధించి నిర్బంధంగా వసూలు చేయడం!!

ఈ రెండూ తప్ప మిగిలిన అన్ని సామాజిక సమస్యలు గ్రామరట్టలకు, సమయసెట్టిలకు, మహాజనులకు వదిలేసినట్లు.. ప్రత్యేకంగా చెప్పకపోయినా.. రాజాస్థానం నుండి ఇలాంటి వాటికి

రాజపాలన అంటే రక్షణ, పన్నులు మాత్రమే అని సాధారణ ప్రజల అభిప్రాయం. అనుభవసారం కూడా. ఇక తమ సమస్యలన్నీ స్థానిక సమయాలు, మహాజనులు, గ్రామ న్యాయబృందాల ద్వారా పరిష్కారం చేసుకుంటారు. అలాంటిది ఇప్పుడు ఇలా గణపతిదేవుడు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించడం నాడుల (జిల్లా) స్థాయి అధికారులను, గ్రామరట్టలను అమితాశ్చర్యానికి గురిచేసింది. వాటిని అమలు చేస్తుంటే సాధారణ ప్రజలే కాదు పాలకవర్గాలు, మహాజనులు, సమయసెట్టిలు.. అందరూ ఆనందంతో పొంగిపోతున్నారు.

స్పందన ఉండదు.

బాటలు బాగుండకపోతే రాజుగారికి ఫిర్యాదు చేస్తే ఏమీ ప్రయోజనం ఉండదు. పైపెచ్చు చేసిన వాడిని చితక్కొడతారు. అంతా స్థానిక పరిపాలకులే నిర్ణయించుకుని తమ తమ ప్రాంత సమస్యలను పరిష్కరించుకుంటారు.

అందుకు అయ్యే ఖర్చు గ్రామపన్నుల వసూలు నుంచి మినహాయించుకుని రాజ ఖజానాకు పంపుతారు.

అందుకు రాజ అధికార నియోగాలు అంగీకరిస్తాయి.

రాజపాలన అంటే రక్షణ, పన్నులు మాత్రమే అని సాధారణ ప్రజల అభిప్రాయం. అనుభవసారం కూడా. ఇక తమ సమస్యలన్నీ స్థానిక సమయాలు, మహాజనులు, గ్రామ న్యాయబృందాల ద్వారా పరిష్కారం చేసుకుంటారు. అలాంటిది ఇప్పుడు ఇలా గణపతిదేవుడు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించడం నాడుల (జిల్లా) స్థాయి అధికారులను, గ్రామరట్టలను అమితాశ్చర్యానికి గురిచేసింది. వాటిని అమలు చేస్తుంటే సాధారణ ప్రజలే కాదు పాలకవర్గాలు, మహాజనులు, సమయసెట్టిలు.. అందరూ ఆనందంతో పొంగిపోతున్నారు.

అందులో మొదటిది బాటలను ఎప్పటికప్పుడు బాగుచేసుకోవడం.. చేసుకు తీరాలని మహారాజుల శాసనం. అందుకు అయ్యే ఖర్చు పన్నుల నుంచి మినహాయింపు. అలాగే వీధి దీపాలు.. బాట పక్క మంచినీటి బావుల తవ్వకం. వాటివద్ద శుభ్రమైన వాతావరణం, దారి పక్క సత్రాలు.. గతంలో మహారాజ, కులీనవర్గాలకు మాత్రమే రాత్రి బస చేయడానికి సత్రాలు ఉన్నాయి. ఇప్పుడు సాధారణ ప్రజలు ఊర్లోకి వెళ్లి ఎవరినైనా బ్రతిమిలాడుకుని వారి అరుగులపై పడుకుని ఉదయాన్నే లేచి తిరిగి తమ ప్రయాణాలను కొనసాగిస్తారు. ఇకపై రహదారి ప్రక్కన సత్రాలు ఏర్పాటు చేసుకోవాలి.

ప్రతి చిన్నతప్పుకు గ్రామ బహిష్కరణ శిక్షగా వేయడం తగ్గించాలని కూడా గ్రామ పాలకవర్గాలకు హితవు. "అది హితవు కాదు.. శాసనం." అన్నాడో గ్రామరట్ట. తన అధికారాలు మహారాజులు లాక్కుంటున్నారని అతగాడి ఏడుపు. కానీ అందువల్ల తన శత్రువులు తగ్గారని కూడా లోలోన సంతోషించాడు సదరు గ్రామరట్ట. శిక్ష వేసిన గ్రామరట్టను లేదా గ్రామన్యాయాధికారిని సదరు గ్రామ బహిష్కృతుడు ఎప్పుడో ఒకప్పుడు దారి కాచి కాలో చెయ్యో నరికేయడం లేదా చంపివేయడం సర్వ సాధారణం. ఆ సమస్య ఇప్పుడు పరిష్కారం దిశగా పయనిస్తోంది.

గణపతిదేవుని ఆదేశ శాసనాలు ఆయా రాజ్యాలలో ప్రకంపనలు పుట్టిస్తున్నాయి.

సాధారణ ప్రజలేకాదు.. వేధావులు, మహాజనులు, ఉపాధ్యాయులు, సమయ సెట్టిలు, వణిజులు, వృత్తుల వాళ్లు.. అందరూ చర్చించుకుంటూ ఆశ్చర్యపోయి ఆనంద పడుతున్నారు. ఇది రాజపాలన కాదు ప్రజాపాలన అంటున్నారు.

అయితే ఈ మహారాజ ఆస్థాన శాసనాలను, ఆజ్ఞలను అంగీకరించని వర్గాలు కూడా ఉన్నాయి.

ముఖ్యంగా కొందరు.. సమాజ హితానికి మతమే ముఖ్యమని నమ్మే వర్గాలు.

'ఇది దైవ సంబంధిత.. మా మతాచారాలలో సాంస్కృతిక అంశాలలో పాలకులు జోరబడటమే..' అంటున్నారు కొందరు మహాజన వర్గాలు.

సాధారణంగా పండితులు లేదా బ్రాహ్మణులు మూడు వర్గాలుగా ఉంటారు. అందరూ తప్పక అక్షరాభ్యాసం చేసి బాల్యం నుంచే విద్యలోకి ప్రవేశిస్తారు. అందులో మహామేధావులు ఒక వర్గం, మతావేశ పరులు ఒక వర్గం. మిగిలినవారు సాధారణ ఉపాధ్యాయులు, పురోహితులు, గ్రామమహాజన సంఘ సభ్యులుగా కొనసాగుతున్నవారు. ఈ మూడు వర్గాలలో అత్యంత బలవంతులు ఈ మతావేశ పరులు. వీళ్లే ఆ కాలానికి ప్రచలితమౌతున్న మతాచారాలను తీవ్రంగా అనుసరించే వర్గం. ప్రస్తుతం వీరిలో శైవ తీవ్రవాదులు, వైష్ణవ తీవ్రవాదులు, బసవణ్ణ భక్తులు, బౌద్ధ తీవ్రవాదులు, జైన తీవ్రవాదులు.. కూడా ఉంటారు. వర్తమాన సదాచార మతాచారాలలో ఎవరు జోక్యం చేసుకున్నా వీళ్లు అంగీకరించరు. తమ మతంపై, తమ ఆచారాలపై, తమ దైవంపై దాడిగా భావించి తీవ్రంగా స్పందిస్తారు. వీళ్లు మహారాజులను కూడా ఎదిరించడానికి జంకరు. కారణం వీరికి అమాయక

మూఢభక్తులతో ఉన్న విస్తృత సంబంధ బాంధవ్యాలు. ఈ తరహా సంప్రదాయవాదులు భారతీయ రాజ్యాలలో అనాదిగా ఉన్నారు. ఇందులో వైదిక మతవాదులు ప్రస్తుత కాలానికి సమర్థంగా తమ వైదికమత విశ్వాసాలను నిర్వహిస్తున్నారు. ఇతర మతవాదుల ప్రాబల్యం సమాజంలో తగ్గిపోయింది. ఈ వైదిక మతవాదులు చెప్పినట్లు చావమంటే చచ్చేవాళ్లు, మంటల్లో దూకమంటే దూకేవాళ్లు కోకొల్లలుగా ఉన్నారు.

గణపతిదేవుడు సామాన్య ప్రజల జీవితాలను నాశనం చేసే వామాచార, మంత్ర తంత్ర పూజలు పూర్తిగా నిషేధిస్తూ శాసనం చేశాడు. అది ఎంతో మంది మంత్ర తంత్ర మహాపండితులను నివ్వెర పరచింది. ముదిగొండ రాజ్యంలోని మతాచార పండితులను మరీ కృంగదీసింది. సమాజాన్ని సజావుగా నడిపించే సదాచారాలను మహారాజులు అడ్డుకోవడం తీవ్రమైన దోషంగా ఆ వర్గాలు కుమిలిపోతున్నాయి.

ఇలాంటివి ఏదో గుట్టుగా జరుపుకుంటున్నా అక్కడికి వచ్చి ఆ క్రతువును పాడు చేసే డిండిమ అతి పెద్ద దుర్మార్గుడు! శత్రువు!!

సదరు వైదిక ప్రముఖులంతా మహారాజు నాగతి భూపతి వద్దకు వెళ్లి తమ అసంతృప్తి తెలియజేశారు. ఆయనకు అప్పటికే డిండిమపై అనేక ఫిర్యాదులు అందడంతో అతనికి మరణశిక్ష విధించాడు. అయినా అతని దండ నాయకులు డిండిమను బంధించలేక పోయారు. తర్వాత గణపతిదేవుడు ముదిగొండ మహారాజు నాగతి భూపాలుని బంధించి అనుమ కొండలో దారుణంగా అవమానించి అతని రాజ్యాన్ని కాకతీయ సామ్రాజ్యంలో కలిపేసుకుని.. తిరిగి అతన్ని ముదిగొండ సింహాసనంపై సామంతుడిగా కూర్చుండబెట్టాడు. ఇవన్నీ తెలుసుకున్న మంత్ర తంత్ర వామాచార పరాయణులకు ఇప్పుడు గణపతి దేవుడు కూడా శత్రువు అయ్యాడు.

ఈ వర్గానికి నాయకుడు శంకణభట్టు. 'దెయ్యం మాయం' పూజల నిర్వహణలో రాజ్య ప్రసిద్ధి పొందినవాడు.

ఏమీ చెయ్యాలో తోచక సతమతమౌతున్న సమయంలోనే వరదగూడెం గ్రామంలో ఎవరో మహిళకు దెయ్యం పట్టింది అని తెలిసి అక్కడ దెయ్యాలను పారద్రోలే మంత్ర తంత్ర విధి 'దెయ్యం మాయం' పూజ నిర్వహించడానికి సిద్ధమయ్యారు శంకణభట్టు అతని శిష్యబృందం.

వరదగూడెంలో సైనికవీరుడు జరుగులప్ప మరణించాడు. అతనికి ముగ్గురు భార్యలు. అందులో సోమిదమ్మను జరుగులప్ప దెయ్యమై పట్టుకుని వదలడం లేదని.. అతని ఇతర భార్యలు.. ఆ గ్రామంలోని శంకణభట్టు శిష్యుల ద్వారా ఆయనకు తెలియబరచి ఆ దెయ్యాన్ని వదిలించాలని కోరారు. అందుకు తగిన పారితోషికం భారీగానే ముట్టజెబు తామని విన్నవించుకున్నారు.

ఈ విషయం మరో కంటికి తెలియకూడదని షరతు పెట్టి దెయ్యాన్ని వదిలించడానికి తాను ఫలానా రోజు వస్తానని 'దెయ్యం మాయం' పూజకు తగిన ముహూర్తం పెట్టి పంపించాడు శంకణభట్టు. ఆ కుటుంబానికి పూర్తి సహకారం అందించవలసినదిగా తన శిష్యబృందాన్ని ఆదేశించాడు. ఆయన పూజలంటే ఇష్టపడే శిష్యులు ఊరూరా ఉన్నారు. వారంతా ఆయన తదుపరి పూజ నిర్వహించబోయే గ్రామంపై వాలతారు. నిశ్శబ్దంగా సదరు గ్రామస్తులు ఒక్కరొక్కరిని కలుస్తూ శంకణభట్టు నిర్వహించబోయే 'దెయ్యం మాయం' పూజకు ఒప్పిస్తూ ఊరందరి నుంచి పూజకు మద్దతు సాధిస్తారు.

అది తప్పకుండా అమావాస్య రోజు ఉంటుంది. కారణం అమావాస్య అంటే సామాన్యులకు అర్థం పర్థంలేని భయం. సహజంగా గ్రామోద్యోగులను ముందే లొంగదీసుకుంటారు. ఆ రాత్రి వీధి దీపాలు వెలిగించకుండా గ్రామోద్యోగులు సహకరిస్తారు.

ప్రతి దుర్మార్గం వెనుకా అనేకానేక కుట్రకోణాలు ఉంటాయి.

చనిపోయిన జరుగులప్పకు ముగ్గురు భార్యలు. సహజంగా మూడవ భార్యపై ఓ పిసరు మోజు ఎక్కువ. అదే మిగిలిన ఇద్దరిని ఐక్యం చేస్తుంది. మొదటగా మురిపాల సవతిపై శత్రుత్వం మొదలవు తుంది. భర్త, ఆమె.. ఓ లిప్తకాలం కలసి కనపడినా వీళ్లిద్దరికి కోపాగ్ని మరింత ప్రజ్వరిల్లుతుంటుంది. అది పెరిగి పెరిగి భర్తపై కూడా శత్రుత్వం పుడుతుంది. ఇక్కడ భర్తను కడతేర్చే స్థాయికి ఆ క్రోధం ఎదుగుతుంది. ఆయన చనిపోయాడు. వీళ్లిద్దరూ అతనికి మందు పెట్టి చంపినా ఆశ్చర్య పోరాదు. సదరు చచ్చిన భర్త ఇంట్లోని బంగారమంతా మూడో సవతికి ఇచ్చి చచ్చాడని అన్యోన్య సవతుల అనుమానం.. ఆరోపణ. వారి పుట్టింటి వారికి సహజంగా ఈ ఆరోపణలో నిజం కనిపిస్తుంది. ఇప్పటికి ఆ మూడో సవతి సోమిదమ్మ సహగమనం చేస్తుందని.. ఆమెను మంటల్లో త్రోసి ఆనందించాలని ఇద్దరూ తలపోశారు. కాని ఆమె సహగమనం చెయ్యకుండా ఆమె పుట్టింటివారు అడ్డుకున్నారు. ఆమె ఇప్పటికి భర్తను మర్చిపోలేక గుక్కపట్టి ఏడుస్తోంది. తిండి తినకుండా మూలానపడి రోదిస్తోంది. ఆమె అంటే తీవ్రమైన ప్రేమ ఉన్న భర్త ఆమెకు వదలలేక దెయ్యమై పట్టుకున్నాడని,అందుకే ఆమె ఇప్పటికి మెతుకు ముట్టకుండా.. కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తోందని నిర్ణయించి.. ప్రకటించి ఊరూ వాడా ప్రచారం చేశారు. శంకణభట్టును సంప్రదించారు.

దెయ్యాన్ని వదిలించడం కాదు సోమిదమ్మనే వదిలిస్తాడని తోడికోడళ్లు ఇద్దరూ గట్టిగా నమ్మారు. ఎందుకైనా మంచిదని ముందే ఆయన శిష్యుడొకరికి తమ కోరిక తెలియజెప్పి భట్టుగారికి సంభావనలు ఘనంగానే ముట్ట జెబుతామని సూచన కూడా చేశారు. అయితే భర్త సోమిదమ్మకు బోలెడు బంగారం ఇచ్చాడని ఆమె దానిని ఎక్కడ దాచిందో తెలియడం లేదని.. 'దెయ్యం మాయం' పూజా సమయంలో ఆ బంగారం గురించిన సమాచారం రాబట్టాలని వినమ్రంగా కోరారు.

పూజ వెనుక జరగాల్సిన ఏర్పాట్లు అన్ని అయ్యాక దెయ్యాన్ని వదిలించడానికి శంకణభట్టు ముహూర్తం నిర్ణయించి, నిర్ణయించిన సమయానికి ముందే చిమ్మచీకటిలో శిష్య ప్రశిష్యులతో వరదగూడెం చేరుకున్నాడు.

(సశేషం)

యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి ఒకవైపు, దేశంలో చమురు, గ్యాస్‌కు ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు నెలకొన్న తరుణంలో భారత్ సహా రష్యా, చైనా, ఇరాక్, పాకిస్తాన్‌లు హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రవాణాకు అనుమతిస్తామని ఇరాన్ ప్రకటించినా, జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే మాటపై ఎంతవరకు నిలబడుతుందో తెలియడం లేదు. ఎందుకంటే ఇరాన్ ఇప్పుడు హోర్ముజ్ జలసంధిపై మరింత పట్టు బిగిస్తోంది. తనకు పూర్తి మద్దతుగా ఉన్న చైనాకు చెందిన రెండు నౌకలను కూడా మార్చి 27న ఈ జలసంధి గుండా ప్రయాణించకుండా అడ్డుకుంది. సీఎస్‌సీఎల్ ఇండియన్ ఓషన్, సీఎస్‌సీఎల్ ఆర్కిటిక్ ఓషన్ అనే పేరుగల ఈ రెండు నౌకలు చైనాకు చెందిన సీఓఎస్‌సీఓ సంస్థకు చెందినవి. ఈ రెండు నౌకలు పర్షియన్ గల్ఫ్‌ను దాటడానికి యత్నించగా ఇరాన్ బలవంతంగా వెనక్కు మరలించడం తాజా పరిణామం. చైనా పతాకాలున్నప్పటికీ ఇరాన్ వాటిని అనుమతించక పోవడం గమనార్హం.

భారత్ వైపు

యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వం వహిస్తామని పాకిస్తాన్ చెబుతున్న వేళ, మార్చి 25న కరాచీకి వెళుతున్న పాక్ చమురు నౌక 'సెలెన్'ను హోర్ముజ్ జలసంధినుంచి వెనక్కు పంపేసింది. తర్వాత రెండు రోజులకు హోర్ముజ్ జలసంధిని దాటుతున్న ఆ దేశ చమురు నౌకపై ఇరాన్ దాడిచేసి ధ్వంసం చేసింది. దుబాయ్–అబుదాబీ సముద్ర తీరంలో ఈ దాడి జరిగినట్టు తెలుస్తోంది. అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయకుండానే ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ ఫీజు వసూలు చేయడమే కాదు, ఈ చెల్లింపు వ్యవస్థను పార్లమెంట్ ఆమోదం ద్వారా అధికారికం చేయాలని ప్రయత్ని స్తోంది. హోర్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటా మని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనే ఇరాన్ వైఖరిలో మార్పునకు కారణమని వేరే చెప్పాల్సిన పనిలేదు.

ఇంటర్నెట్ కేబుళ్లు తెంచే యోచన

సముద్రగర్భంలోని ఇంటర్నెట్ కేబుళ్లను తెంచేసే ఆలోచనలో ఇరాన్ ఉన్నట్టు వస్తున్న వార్తలు మరింత కలవరం కలిగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ డేటా రవాణా 95 నుంచి 97శాతం వరకు సముద్రగర్భం గుండా జరుగుతోంది. ఎర్ర సముద్రం, హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే కేబుళ్లు ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాలను అనుసంధా నిస్తున్నాయి. ఇరాన్ తాజా హెచ్చరికలతో ఈ కేబుళ్లకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని నిపుణులు భయపడుతున్నారు. ఇది ఇరాన్ అనుసరిస్తున్న "గ్రే జోన్ వార్ ఫేర్"గా పేర్కొంటున్నారు. దీని వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోవడం ఖాయం! గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కేబుల్ ప్రాజెక్టుల విషయంలో ఆందోళన చెందుతున్నాయి. "2 ఆఫ్రికా పర్ల్స్" వంటి భారీ ప్రాజెక్టుల పనులు ఇప్పటికే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. టాటా కమ్యూనికేషన్స్, ఎయిర్‌టెల్ వంటి సంస్థలతో చర్చలు జరిపి ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం సూచించడం తాజా పరిణామం.

పరస్పర షరతులు

దేశీయంగా, అంతర్జాతీయంగా ఒత్తిళ్లు తీవ్రం కావడం, అనవసర యుద్ధం అమెరికా నెత్తిన రుద్దారంటూ దేశ ప్రజల్లో వ్యక్తమవుతున్న అసహనం, దారుణంగా పడిపోతున్న రేటింగ్ నేపథ్యంలో, ఈ యుద్ధం నుంచి తన 'అహం' దెబ్బతినని రీతిలో బయటపడాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇందుకోసం ఆయన 15 ప్రతిపాదనలను ముందుకు తెచ్చారు. ఇందుకు ప్రతిగా ఇరాన్ ఎనిమిది షరతులు విధించింది. ఇక్కడ పరస్పర ప్రతిపాదనలను మోసుకెళ్లే ఒక వార్తాహరుడి పాత్రను పాకిస్తాన్ పోషించింది అంతే! మధ్యవర్తిత్వం అంటే సంఘర్షణలో ఉన్న అన్ని పార్టీలతో చర్చలు జరపగలగడం. కానీ పాకిస్తాన్‌ను తన దరిదాపుల్లోకి కూడా ఇజ్రాయెల్ రానీయదు. అమెరికా చెప్పినట్లు తాను వినాలి తప్ప, డోనాల్డ్ ట్రంప్‌కు చెప్పగలుగు తుందా? అంటే ఇక్కడ పాకిస్తాన్ తన బాస్ అమెరికా తరపున ఒక దళారిగా వ్యవహరిస్తున్నదనేది అక్షరసత్యం. దీన్ని మధ్యవర్తిత్వమని ఎలా అనగలం? కనీసం దీన్ని ఎంతమాత్రం ఆలోచించకుండా మనకన్నా చిన్నదేశమైన పాకిస్తాన్ యుద్ధం ముగింపునకు ముందుకొచ్చిందని, కానీ మనదేశం నోరు మెదపలేదని విమర్శించడం వెనుక ఔచిత్యం విపక్ష నేతలకే తెలియాలి!

పాక్ అగమ్యగోచరం

అసలు పాకిస్తాన్ పరిస్థితేంటో అర్థం కావడం లేదు. ఒకపక్క ఇరాన్–యుఎస్/ఇజ్రాయెల్ యుద్ధంలో మధ్యవర్తిత్వం వహిస్తున్నానని రొమ్ములు విరుచుకొని ముందుకెళుతున్న పాక్‌కు శరాఘాతం వంటి సంఘటనలు ఎదురవుతున్నాయి. ఇరాన్‌లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయం సమీపంలో క్షిపణులతో దాడులు జరపడం ద్వారా ఇజ్రాయెల్ గట్టి హెచ్చరిక చేసింది. ఇక ఏ అమెరికా అయితే చంకనెక్కించుకుందో, అక్కడి కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో లష్కరే తొయ్యబా, జైషే మహ మ్మద్ వంటి ఉగ్రసంస్థలు పాక్ కేంద్రంగా పనిచేస్తున్నాయని, భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ఇవి పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ సంస్థలు దేశీయంగా, అంతర్జాతీయంగా, కొన్ని ఆఫ్ఘన్‌కు సంబంధించి మరికొన్ని భారత్–కశ్మీర్ లక్ష్యంగా పనిచేస్తున్నాయని పేర్కొంది. టీటీపీ (తెహ్రీక్ ఏ తాలిబన్) దేశంలో అత్యంత ప్రమాదకర ఉగ్రవాద సంస్థగా రూపొందిందని వివరించింది. అంతకు ముందు తులసీ గబార్డ్ నేతృత్వంలోని కమిటీ, భవిష్యత్తులో అమెరికాకు పాకిస్తాన్‌వల్ల అణు ప్రమాదం ఉందని హెచ్చరించడం గమనార్హం.

జె.డి.వాన్స్ ఆగ్రహం

ఇరాన్‌పై విజయం విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తమను తప్పుదోవ పట్టించారని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ కోపంతో ఉన్నారు. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్‌కాల్ సంభాషణ అంశాన్ని ఒక వార్తాసంస్థ బయటపెట్టిన నేపథ్యంలో ఇది బయటకు వచ్చింది. ఇరాన్‌లో ప్రభుత్వం కుప్పకూలడంతో యుద్ధం త్వరగా ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని వేసిన అంచనాలు తప్పని మండిపడ్డట్టు కూడా తెలుస్తోంది. ఒకవైపు

ఏదో విధంగా ఈ యుద్ధం నుంచి బయటపడాలని యు.ఎస్. ప్రయత్నిస్తుంటే, ఇరాన్ అసలు చర్చల ప్రసక్తేలేదని తేల్చిచెప్పడం, మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్‌లు తమ దాడులను కొనసాగిస్తుండటం చూస్తుంటే, ఈ యుద్ధం ముగింపు డోనాల్డ్ ట్రంప్ చేతుల్లో లేదని, పరిస్థితులు చేయిదాటి పోయాయన్నది సుస్పష్టం. ఇదే సమయంలో ఇజ్రాయెల్, జె.డి.వాన్స్‌ను బలహీనపరచేందుకు పావులు కదుపుతోంది. ఇప్పటికే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ విషయంలో ట్రంప్, వాన్స్‌ల మధ్య స్వల్ప

ఇరాన్ చూపు

విభేదాలున్నట్లు స్పష్టమైంది. దీనికితోడు అమెరికా శాంతి ప్రతిపాదనలను ఇజ్రాయెల్ అంగీకరించడంలేదు. ఇరాన్ అంతు చూడాల్సిందేనన్న పట్టుదలతో బెంజమిన్ నెతన్యాహు తన ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేసుకుంటూ ముందుకెళుతున్నారు. ఒకవేళ ఇజ్రాయెల్ శాంతికి అంగీకరించకపోతే, యు.ఎస్.లో శక్తిమంతమైన యూదుల లాబీ, దేశ నాయకత్వాన్ని యుద్ధంవైపునకే మొగ్గుచూపేలా చేస్తుంది. అందువల్ల ఈ యుద్ధంలో డోనాల్డ్ ట్రంప్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక చందంగా మారింది. ఏతావాతా చెప్పొచ్చేదేమంటే యుద్ధం ముగింపు కేవలం ఇజ్రాయెల్ చేతిలో ఉన్నదనేది సుస్పష్టం. ఒకవైపు హోర్మూజ్ జలసంధి సమస్య కొనసాగుతుండగానే ఇజ్రాయెల్ నిశ్శబ్దంగా తాను చేయాలనుకుంటున్న పనులు కానిచేస్తున్నది. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్‌పై జరిపిన దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ నౌకాదళాధిపతి అలీరెజా టాంగ్సిరీ మరణిం చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. యు.ఎస్. ఒకవైపు ఐదురోజుల యుద్ధ విరామం ప్రకటించినప్పటికీ, రెండోవైపు ఇరాన్-ఇజ్రాయెల్‌ల మధ్య పరస్పర దాడులు కొనసాగుతుండటాన్ని చూస్తే, ఈ యుద్ధంపై యు.ఎస్.కు నియంత్రణ లేదన్నది స్పష్టమైంది. ఇప్పుడు ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హూతీలు కూడా రంగంలోకి దిగారు. వారికి మద్దతుగా హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ నిలుస్తోంది. ఎర్ర సముద్రంలో ఏటా కనీసం లక్షకోట్ల వాణిజ్యం జరిగే కీలకమైన బాబ్ ఎల్ మందెబ్ జలసంధిని హూతీలు మూసేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ప్రపంచ దేశాలు మరింత ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోక తప్పదు.అమెరికా తమ గగన తలాలను ఉపయోగించుకోవడానికి అనుమతించడానికి వీల్లేదని ఇరాన్ హుకుం జారీచేయడంతో గల్ఫ్ దేశాలు బిక్కుబిక్కు మంటున్నాయి. తమకు తాగునీటి ఆధారమైన డీసాలినేషన్ కేంద్రాలపై ఇరాన్ దాడులకు పాల్పడితే పరిస్థితేంటన్న భయం వాటిని వెంటాడుతోంది. కువైట్ ప్రాంతంలో 90% తాగునీరు ఇదే. మార్చి నెల మొదట్లో బహ్రెయిన్ దేశంలోని 'డీసాలినేషన్' ప్లాంట్‌పై ఇరాక్ దాడి చేయడంతో అది కొంతమేర దెబ్బతిన్నది.

యుద్ధం వల్ల ఏర్పడిన ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో అర్జెంటీనా మనదేశానికి గ్యాస్ సరఫరా చేయడానికి ముందుకొచ్చింది. 2024కు ముందు మనకు అర్జెంటీనా నుంచి గ్యాస్ దిగుమతి ఉండేది కాదు. కానీ 2025లో ప్రభుత్వ చొరవతో 22వేల టన్నుల గ్యాస్ మనకు సరఫరా చేసింది. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే ఇది 50వేల టన్నులకు చేరింది. మార్చి 5న 11వేల టన్నుల గ్యాస్‌తో ఆ దేశ నౌక మనదేశానికి చేరుకుంది. అర్జెంటీనా మనకు 20వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌కు దీర్ఘకాలం పాటు గ్యాస్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని అర్జెంటీనా రాయబారి మారియానో అగస్టిన్ కాసియోనో ప్రకటించారు. ఖర్చులు భారమైనా సంక్లిష్ట స్థితినుంచి బయటపడేందుకు ప్రభుత్వం అర్జెంటీనా గ్యాస్‌కు ఆమోదం తెలిపింది. ఇరాన్ నుంచి కూడా నెలరోజుల పాటు చమురు కొనుగోలుకు అమెరికా అనుమతి ఇవ్వడంతో ఇరాన్‌నుంచి చైనాకు వెళుతున్న ఎల్‌పీజీ ట్యాంకర్ అరోరాను మంగళూరు పోర్టుకు మళ్లించారు. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయిన మన చమురు నౌకల తరలింపుతో పాటు, ఖాళీ కార్గోలను నింపే పని జరుగుతోంది. అమెరికా, జపాన్, ద.కొరియా, పాకిస్తాన్, బాంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో పెట్రోల్ ధరలు పెరిగినా మనదేశంలో స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతేకాదు కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ పన్నును తగ్గించడంతో లీటరుకు రూ. 10 ధర తగ్గింది. గల్ఫ్ దేశాలనుంచే కాకుండా మొత్తం 41 దేశాలనుంచి చమురు, గ్యాస్‌ను మనదేశం కొనుగోలు చేస్తోంది. వచ్చేనెల డెలివరీలకోసం మనదేశ చమురు కంపెనీలు రష్యానుంచి 60మిలియన్ బ్యారళ్ల చమురుకు ఆర్డర్లు ఇచ్చాయి. ఫిబ్రవరి నెలలో చేసిన కొనుగోళ్లకంటే ఇవి ఎక్కువ. వెనెజులా నుంచి ఏప్రిల్ నెలలో ఏకంగా 20లక్షల బ్యారళ్ల చమురు కొనుగోలు చేసింది. 2020 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో ఆ దేశం నుంచి చమురు కొనడం ఇదే ప్రథమం. ఇటీవల భారత్‌కు చెందిన అధికార్ల బృందం టెహ్రాన్‌కు వెళ్లి అక్కడి అధికార్లతో రసాయన ఎరువుల సరఫరాపై జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ఇరాన్ ప్రకటనతో సౌదీ అరేబియా, ఖతార్ దేశాలనుంచి రసాయన ఎరువులు ఎటువంటి ఆటంకం లేకుండా మనదేశానికి చేరగలవు. ఇది వచ్చే ఖరీఫ్ సీజన్‌కు గొప్ప ఊరట.

భారత్ విశ్వసనీయ భాగస్వామి

హోర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ తమకు అత్యంత విశ్వసనీయ భాగస్వామి అని ఇరాన్ ప్రకటించడం విశేషం. ఈవిధం గా ఇరాన్ ఇప్పటి వరకు చైనా, రష్యాలకు అనుకూల దౌత్య వైఖరినుంచి, బహుళ దౌత్య విధానానికి మారుతున్నట్టు స్పష్టమవుతోంది. చబ్బహార్ పోర్టు నిర్వహణపై మరో పదేళ్లపాటు ఒప్పందాన్ని పొడిగించడం, ఇరాన్‌పై పశ్చిమ దేశాల ఆంక్షలను సమర్థించకపోవడం వంటి అంశాలు మనదేశాన్ని విశ్వసించడానికి ప్రధాన కారణాలు. ఇరాన్‌కు దన్నుగా జమ్ము-కశ్మీర్ ప్రజలు నగదు మొదలుకొని పలురకాల మానవతా సహాయాన్ని విరాళాల రూపంలో సేకరించి పంపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ తాను ప్రయోగిస్తున్న క్షిపణులపై "థాంక్యూ పీపుల్ ఆఫ్ ఇండియా" అంటూ రాసి మరీ ఇజ్రాయెల్‌పై ప్రయోగిస్తూ కృతజ్ఞతలు తెలుపుతోంది. ఇరాన్ మీడియాతో పాటు ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ కూడా ఈ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది.

జమలాపురపు విఠల్‌రావు

సీనియర్ జర్నలిస్ట్

రణంతో వాతావరణ కాలుష్యం

ఈ ఆధునిక యుగంలో యుద్ధం చేయడానికి అనేక కారణాలు ఉండొచ్చు. యుద్ధంలో గెలిచిన వారికి అనేక ప్రయోజనాలు లభించొచ్చు. కాని యుద్ధం మాత్రం ప్రాణనష్టానికి, వాతావరణ కాలుష్యానికి ప్రధాన హేతువనేది నిర్వివాదాంశం.

ఎందుకంటే ఇప్పుడు జరిగే యుద్ధాలన్నీ అతి శక్తివంతమైన పేలుడు రసాయనాలను(ఎనర్జిటిక్ మెటీరియల్స్) ఉపయోగించి చేసేవే. వీటి ప్రయోగం ద్వారా సమీప వాతావరణంలో రసాయనాలతో కూడిన వాయు కాలుష్యం, ధ్వని కాలుష్యం, నీటి కాలుష్యం, తీవ్ర ఉష్ణోగ్రతలు, లోహారజనుతో కాలుష్యం, రేడియో ధార్మిక కాలుష్యం, జీవ రసాయన కాలుష్యం లాంటివి ఏర్పడతాయి. అంతేకాక భూమిమీద మానవ మనుగడకు, అవసరాలకు ఉపయోగించే ఇంధనాలు, లోహాలు, రబ్బర్, ప్లాస్టిక్, ఆయిల్, సిమెంట్ మొదలైన వస్తువులు యుద్ధంలో నాశనమై, వాటిలోంచి వెలువడే అత్యంత విషపూరిత పదార్థాలు వాతావరణాన్ని కొన్ని దశాబ్దాలవరకు ప్రభావితం చేస్తాయి. కాబట్టి యుద్ధ ప్రయోజనాలతో పాటు ఈ కాలుష్య పరిమాణాలను లెక్క కట్టి జరిగే నష్టాన్ని బేరీజు వేసుకుంటే యుద్ధాలను చేపట్టక పోవడమే మంచిదనిపిస్తుంది.

యుద్ధ తంత్రాలను, యుద్ధంలో వాడే అస్త్ర, శస్త్ర సామాగ్రిని అనాదినుంచీ పరిశీలిస్తే ఒకప్పుడు సైనికులు చిన్న, చిన్న బాంబులను ఉపయోగిస్తూ, ప్రత్యర్థిని భయభ్రాంతులకు గురిచేస్తూ, ప్రత్యర్థి భూమిని ఆక్రమిస్తూ, లోపలికి చొచ్చుకుని వెళ్లి ఆక్రమించేవారు. ఇది ల్యాండ్ వార్ – భూమిపై జరిగే యుద్ధం. ఇందులో సైనిక బలం ఎక్కువగా ఉండి, రసాయన ఆయుధాల ఉపయోగం పరిమితంగా ఉండేది. దీన్నే కన్వెంషనల్ వార్ ఫేర్–సంప్రదాయ యుద్ధం అనే వారు. అందుకే ఆ యుద్ధాలలో వాతావరణ కాలుష్యం తక్కువగా ఉండేది. ఆధునిక యుగంలో ముఖ్యంగా 20, 21 శతాబ్దాలలో శాస్త్ర, సాంకేతికతలు (సైన్స్ & టెక్నాలజీ) విపరీతంగా అభివృద్ధి చెంది, పరిశోధనలు ద్వారా తీవ్ర విధ్వంసకర ఆయుధాలతో (వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్) ఎక్కువ ఆస్తి, ప్రాణ నష్టాలతోపాటు, వాతావరణ కాలుష్యం జరుగుతోంది. దీనిని మోడరన్ వార్ ఫేర్–ఆధునిక యుద్ధం అంటాము. తద్వారా యుద్ధాలు మానవాళి మనుగడకు గొడ్డలి పెట్టులాగా పరిణమిస్తున్నాయి. ప్రస్తుతం క్షిపణులు, డ్రోన్ల యుగం. ఇదివరకు యుద్ధాలు ప్రధానంగా రెండు దేశాలమధ్య జరిగితే ఇప్పుడు అనేక దేశాల కూటముల మధ్య జరుగుతున్నాయి. దీనివల్ల ఒక యుద్ధంలో అనేక దేశాలు అంటే అధిక భూభాగం ప్రభావితమౌతోంది. ఉపయోగించే ఆయుధాల సంఖ్య కూడా ఎన్నో రెట్లు అధికంగా ఉంటోంది. తత్ఫలితంగా జరిగే ఆస్తి, ప్రాణ నష్టాలు కూడా ఎక్కువే. అయితే గమనించవలసిన విషయం ఏమిటంటే ఆయుధ సామాగ్రి తయారీలో పర్యావరణ కాలుష్యం మితంగానే ఉంటుంది కానీ ఆయుధాలను పేల్చినప్పుడు కాలుష్యం మాత్రం విపరీతంగా ఉంటుంది.

యుద్ధం పేలుళ్ల వల్ల కలిగే వాయు కాలుష్యం, నేల, నీటిలోకి చేరే విషపూరిత రసాయనాలు, సైనిక ఇంధన వినియోగం వల్ల వెలువడే భారీ కర్బన ఉద్గారాలద్వారా తీవ్రమైన, దీర్ఘకాలిక పర్యావరణ నష్టం కలుగుతుంది. మౌలిక సదుపాయాల విధ్వంసం తరచుగా పారిశ్రామిక వ్యర్థాలు, వ్యర్థ సంక్షోభాలకు దారితీస్తుంది, అదే సమయంలో మందుపాతరలు, పేలని ఆయుధాలు, పారవేసిన మందుగుండు సామగ్రి దశాబ్దాల పాటు భూమిని, సముద్రాలను కలుషితం చేస్తూ, శాశ్వత ఆరోగ్య ప్రమాదాలను, పర్యావరణ వ్యవస్థకు నష్టాన్ని కలిగిస్తాయి.

రక్షణ రంగంలో పరిశోధన-అభివృద్ధి:

యుద్ధ పరికరాలను, రక్షణ సామాగ్రిని రూపొందించడంలో ప్రముఖ దేశాలన్నీ విపరీతమైన

యుద్ధం

(త్రిలధార)

అదిగదిగో హార్మజ్‌లో
హనుమంతుని తోక
తైలనౌక మంటలలో
నరమేధం కేక, ట్రంపరితనం రాక
క్రూషేదుల జీహాదుల
క్రూర రక్తచరిత్ర
అనాదిగా ధరిత్రిలో
ఆహవ విషపాత్ర
ఇంత జరిగినా కూడా
ఇంకా మేం నమ్మాలా?
నల్లట్టల గ్రంథంలో
కల్లబొల్లి సువార్తలను
ఆత్మహత్య మహాపాపమని
తెలియదు పాపం
పెద్దన్నల గద్దబుద్ధి
ప్రపంచానికే శాపం
అక్షువారిలో రగిలిన
అవని మొహంజోదారి
కుక్కతోక నరజాతిని దాటించదు గోదారి.

(ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికాల మధ్య ప్రాచ్యంలో పోరు సందర్భంగా)

ప్రొ. ముదిగొండ శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు

లక్ష్యాలతో, వివరీతంగా ఖర్చుచేస్తూ పరిశోధనలు తీవ్రతరం చేసాయి. ముఖ్యంగా క్షిపణులు, డ్రోన్‌లు, ఐరన్ డోమ్స్-గగనతల రక్షణ వ్యవస్థలు, ఇంటర్ సెప్టార్స్-శత్రు క్షిపణులు, డ్రోన్, విమానాలకు అవరోధకాలు, జలాంతర్గాములు, మాక్ 10 కి మించిన వేగంతో వెళ్లే యుద్ధ విమానాలు, క్లస్టర్ బాంబర్‌లు, ఏకకాలంలో అనేక క్షిపణులను ప్రయోగించే వాహక వ్యవస్థలు, భూగర్భ అణు పరీక్షలు, క్షిపణి పరీక్షలు, ఇతర ఖండాలలోనూ సైనిక స్థావరాల ఏర్పాటు, సాగర విన్యాసాలు, సముద్రాలలో విపరీతమైన యుద్ధ సామాగ్రి మొహరింపు, ఆయుధాల ఉత్పాదక సామర్థ్యం పెంపు వంటి విషయాల్లో అగ్రరాజ్యాలు పెద్ద ఎత్తున పరిశోధనలు చేస్తున్నాయి. రణరంగంలో పోటీ తత్వాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. దీనివల్ల ఖర్చు, నష్టాలు, పర్యావరణ విఘాతం తప్ప మానవాళికి నిజమైన లాభమేదీ లేదని తెలిసికూడా ఈ రంగంలో విపరీతమైన పోటీ నానాటికి పెరుగుతోంది. సనాతన ధర్మం పునాదిగా ఉన్న మన భారత దేశంతో పాటు బహుకొద్ది దేశాలు మాత్రమే యుద్ధం కేవలం అనివార్యమైతే తప్ప చేయకూడదనే ఆలోచనతో ఉంటే చాలా దేశాలు కారణాలు వెతుకుతూ యుద్ధానికి ఉవ్విళ్లూరుతున్న ఈ తరుణంలో అనవసర యుద్ధ కాంక్షలు తగ్గించుకోవడం ఎంతైనా అవసరం.

ఐక్యరాజ్యసమితి మార్గదర్శకాలు

ఐక్యరాజ్యసమితి-ఐరాస 2022లో యుద్ధాలవల్ల జరిగే విధ్వంసాలను విశదీకరిస్తూ ఒక ప్రతిని విడుదల చేసింది. యుద్ధం పర్యావరణానికి నష్టం కలిగించకుండా ఉండడానికి 27 మార్గదర్శకాలను సూచించింది. అయితే ఈ మార్గదర్శకాలను యుద్ధాలు చేసే దేశాలు, కూటములు ఏమేరకు ఖాతరు చేస్తున్నాయి, పాటిస్తున్నాయి అన్నది విశదంగా పరిశీలించి నివేదికలు పొందుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యుద్ధవిరమణ - శాంతి పునరుద్ధరణ

యుద్ధ విరమణ నిజంగా అనుకున్న శాంతిని తెస్తుందా? ఇది సందేహాస్పదమే. ఎందుకంటే యుద్ధమే జరగకూడదు కాని జరిగితే దానివల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. యుద్ధ విరమణ జరిగినా మానవాళికి నిజమైన సుఖ శాంతులుండవు. యుద్ధ విరమణ వల్ల ఒక తాత్కాలిక ఘర్షణ ముగుస్తుంది కాని అది అంతటితో అది ఆగిపోదు. ఇది మరో శాశ్వత ఘర్షణకు దారితీస్తుంది. అదే వాతావరణ కాలుష్య ఘర్షణ. దీన్నే ఎన్విరాన్మెంటల్ కాన్‌ఫ్లిక్ట్ అని అంటారు. యుద్ధమంటే దేశాల మధ్య ఘర్షణ. ఇది కొంత కాలం మాత్రమే ఉండొచ్చు.. కాని దానివల్ల ఉత్పన్నమయ్యే ఎన్విరాన్మెంటల్ కాన్‌ఫ్లిక్ట్ మాత్రం తరతరాలుగా మానవాళిని పట్టి పీడిస్తుంది. కాబట్టి యుద్ధం అనివార్యమైతే అది వాతావరణం కాలుష్యం కాకుండా ప్రత్యర్థి మూల శక్తి, యుక్తులు అంటే ప్రత్యర్థి ముఖ్య ప్రణాళికలు జరిగే స్థావరాలు, కేంద్రాలు మాత్రమే నిర్వీర్యం చేయాలి. సామాన్యులకు ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగకుండా ఉండాలి. యుద్ధానంతరం జన జీవనం అస్తవ్యస్తం కాకుండా చూడాలి. అదే అసలు సిసలైన రణ నీతి అవ్వాలి. ఆ రోజు కోసం యావత్ మానవాళి ఎదురు చూస్తోందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

"సర్వేజనాః సుఖినోభవంతు" ★

ఎనిమిది దుష్ప్రభావాలు

యుద్ధాలలో ఉపయోగించే యుద్ధ సామాగ్రి (ammunition) వల్ల ముఖ్యంగా 8 రకాలైన ప్రదూషకాలు (pollutants) ప్రకృతి / వాతావరణంలోకి విడుదలవుతాయి.

1. యుద్ధంలో ఉపయోగించే రసాయనిక పేలుడు పదార్థాలవల్ల జరిగే ఏర్పడే రసాయన కాలుష్య కారకాలు (కెమికల్ పొల్యూటెంట్స్). వీటివల్ల కర్బన ఉద్గారాలు, నైట్రోజన్ ఆక్సైడ్‌లు, సల్ఫర్ డయాక్సైడ్ వంటి విష వాయువులు విడుదలై, ఆమ్ల వర్షాలు, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతాయి. క్షిపణుల వల్ల అల్యూమినియం ఆక్సైడ్, బ్లాక్ కార్బన్, క్లోరిన్ వాయువులు వంటి కాలుష్య కారకాలు విడుదలవుతాయి. ఇవి ఓజోన్ పొరను దెబ్బతీస్తాయి.

2. యుద్ధ పరికరాల్లో ఉపయోగించే ఖనిజ/దాతు/లోహ/ లోహ మిశ్రమ కాలుష్య కారకాలు (మెటలర్జికల్ పొల్యూటెంట్స్). ఖనిజ, భార లోహల అవశేషాలు చాలాకాలం భూమిలో ఉండిపోయి భూమి సహజత్వాన్ని, భూగర్భ జలాలను అంతులేని పరిమాణాల్లో దెబ్బతీస్తాయి.

3. పేలుళ్ల వల్ల భూమిమీద జరిగిన విధ్వంసం వల్ల కాంక్రీట్, రాళ్లు, ఇసుక రేణువులు ఇంకా అనేక రకాలైన భవన నిర్మాణ పదార్థ సంబంధ కాలుష్యం (కన్‌స్ట్రక్షన్ పొల్యూటెంట్స్)

4. చమురు / ఇంధన స్థావరాల విధ్వంసం ద్వారా భూమిమీద, నీటిలో, సముద్రంలో కాలుష్యం (చమురు ద్వారా నీటి కాలుష్యం)

5. పేలుళ్ల వల్ల ఉత్పత్తి అయ్యే విపరీత శబ్దాల వల్ల, ప్రకంపనలవల్ల విడుదలయ్యే శబ్ద కాలుష్యం (సౌండ్ పొల్యూషన్)

6. అణు కేంద్రాల పేలుడు ద్వారా విడుదలై చిరకాలం దుష్ప్రభావం చూపే రేడియో దార్మికత

7. జీవరసాయనాలు యుద్ధంలో వాడితే జీవసంబంధమైన కాలుష్యం (బయాలజికల్ పొల్యూషన్)

8. ఇప్పుడు కొత్తగా డర్టీ బాంబులు వస్తున్నాయంటున్నారు. వీటివల్ల వర్ణించడానికి/గుర్తుపట్టడానికి సాధ్యం కాని కాలుష్యాలు వాతావరణంలోకి విడుదలయ్యి చిరకాలం ఉండే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పులకు సైనిక ఘర్షణలు గణనీయంగా దోహదపడతాయి, ప్రపంచవ్యాప్త గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో సుమారు 5.5% సైనిక రంగం కారణంగానే వెలువడుతున్నాయని గణాంకాలు తెలియ చేస్తున్నాయి.

వైద్యవదాన్య...



ఆమెకి నిండు నూరేళ్లు.

ఆమె చూపిన మహోదాత్త ఉదారతకు అందరి జేజేలు.

పేరుకు తగిన తీరు, తీరుకు దీటైన పేరు- లక్ష్మీబాయి. ఎంతగానో పేరొందిన వైద్య చికిత్స నిపుణురాలిగా స్వరాష్ట్రం ఒడిశాతోపాటు దేశంలోని అనేకానేక ఇతర ప్రాంతాల వైద్యులెందరికో తెలుసు.

సాక్షాత్తు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక అభినందనలందుకున్న డాక్టర్ కె.లక్ష్మీబాయి అద్భుత వనిత. తన జీవితకాల పొదుపు మొత్తం, సొంత నివాస గృహాన్ని విక్రయిస్తే వచ్చిన ధనం అంతటినీ మహిళారోగ్యం కోసమే కేటాయించారు.

వృత్తి జీవితానికి పరిపూర్ణంగా అంకితమయ్యారు. కుటుంబ బాధ్యతల భావ ప్రభావంతో వైద్యసేవకు దూరంగా ఉండాల్సి వస్తుందేమోనని వివాహమే వద్దనుకున్నారు. రోజులో 24 గంటలూ డాక్టర్‌గానే!

గతేడాది డిసెంబరు ఐదున ఆమెకి శత వసంతోత్సవం. అదే క్రమంలో వచ్చే ఏప్రిల్ తొలివారంలోపలే మరో వందరోజులు. శతాయుష్కురాలు, శతాధిక ఆయుష్కురాలు, మహోదార గుణసంపన్నురాలు. క్యాన్సర్ బాధితుల చికిత్సల గురించి దరిదాపు రూ.మూడున్నర కోట్లు విరాళమివ్వడం ఎంతైనా చరిత్రాత్మకం!

రాష్ట్రపతి ప్రశంసించినట్లు- దానమయి లక్ష్మీబాయి!

దానం అంటే త్యాగం, మహత్తరం, మహోన్నతం.

పేరు కోసం కాదు, ప్రచారం కోసమైతే అసలే కాదు. రికార్డు సృష్టించాలన్న ఆలోచనా అసలే ఉండదు. జీవితాన్ని సార్థకం చేసుకుందామన్న సంకల్ప బలమే దానగుణాన్ని పెంచి పోషిస్తుంది. దానసంపద. అది పుష్కలంగా ఉంది లక్ష్మీబాయిలో.

ఆమె సొంత ఊరు కటక్. పుట్టింది 1926లో. పురాతన బారాబతి కోటకు ప్రసిద్ధి కటక్ నగరం. సహస్రాధిక సంవత్సరాల చరిత్ర. మిలీనియం సిటీ.

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌తో కలిసి జంటనగరాల్లో ఒకటి కటక్. స్వరాజ్య ఆశ్రమం, స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నం అక్కడే. విలక్షణత సంతరించుకున్న కటక్‌లోని వైద్యకళాశాలలో లక్ష్మీబాయి చదివారు. కాలేజీ పూర్తిపేరు శ్రీరామచంద్ర భంజా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్. పొడి అక్షరాల్లో ఎస్.సి.బి. ప్రతిష్ఠాత్మకత నిండిన ప్రభుత్వ సంబంధ వైద్యసంస్థ.

నేషనల్ మెడికల్ కమిషన్ గుర్తింపు అందుకున్న కటక్ కళాశాలలో తొలి బ్యాచ్ విద్యార్థిని ఆమె. వ్యాధి పీడితులకు ఉచిత వైద్య సేవలు, అత్యవసర చికిత్సలు, సూపర్ స్పెషాలిటీ సేవాపరంపరలు అందించే వైద్యాలయం తనది. అందులో విద్య, ప్రయోగ, పరిశోధన ఫలాలను అందిపుచ్చుకున్నారు. అందులోనే బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ చేశారు.

ఎంబీబీఎస్ తర్వాత మద్రాసు మెడికల్ కాలేజీలో ఎండీ చేశారు లక్ష్మీబాయి. ఆ వైద్యాలయం మన దేశంలోనే కాకుండా మొత్తం ఆసియా ఖండంలోనే పురాతన ప్రసిద్ధ సంస్థ. ఎంఎంసీగా జగద్ విఖ్యాతం. అనుబంధ విభాగాల సంఖ్య ఇరవైకి పైగా ఉంటుంది.

కటక్, మద్రాసులలో చదివినంతకాలమూ నిరంతరంగా పరిశ్రమించారు లక్ష్మి. మహిళా డాక్టరుగా నిరంతర సేవలందించాలని, జీవితమంతటినీ అందుకే అంకితం చేయాలనీ ఆ రోజుల్లోనే స్థిర నిశ్చయానికి వచ్చారు.

స్త్రీల ఆరోగ్య సమస్యల గురించే ఎప్పుడూ ఆలోచిస్తుండేవారు. పలు వ్యాధుల గమనింపు, నిర్ధారణ, చికిత్స అనంతర జాగ్రత్తలపరంగా అధ్యాపకులు, శస్త్ర చికిత్సల నిపుణులతో చర్చిస్తుండేవారు.

ప్రధానంగా వనితలు ఎదుర్కొనే క్యాన్సర్‌కి సంబంధించి. జీవన శైలి బాగుంటే సమస్యను సమర్థంగా నివారించుకోవచ్చు. శరీర బరువు నియంత్రణ, క్రమం తప్పకుండా నిత్యమూ వ్యాయామం చేస్తుండటం, ప్రత్యేకించి పోషక ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్తుండేవారామె.

వైద్యసంబంధ ముందస్తు సూచనలు, సకాల హెచ్చరికలతో అప్రమత్తం చేయడమన్నది ఆమె అలవాటుగా మారింది. నివాసలో ఉన్నా, వైద్యాలయంలో పనిచేస్తున్నా, ఎక్కడ ఏ పనిలో నిమగ్నమైనా- స్త్రీల ఆరోగ్య పరిరక్షణవైపే తన చూపు.

తరచుగా జ్వరం, ఉన్నపళంగా బరువు తగ్గడం, విపరీతంగా అలసటరావడం, శరీరంలో అనూహ్య మార్పులు, ఏవైనా గాయాలు తగిలి ఎంతకీ మానని స్థితి, ఇతరత్రా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సత్వర జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్‌గా లక్ష్మీబాయి రోజూ చెప్తుంటారు ఇప్పటికీ. క్యాన్సర్ వ్యాధి వచ్చాక నివారించడం కన్నా, నిరోధించడం పైనే దృష్టి

ధన్యజీవన

సారించాలన్నది ఆమె నినాదం, విధానం.

'ఆరోగ్యమస్తు' అనడం ఊతపదంగా మారింది.

అది 1950. అంటే ఇప్పటికీ 75 సంవత్సరాల కిందటి సంగతి.

వైద్యవిద్య ఉన్నత స్థాయికి రాగానే, సుందర్‌గఢ్‌లోని ప్రభుత్వ వైద్యశాలకు ఆమె నియమితులయ్యారు.

పరిశ్రమల కేంద్రంగా సుందర్‌గఢ్ ప్రతీతి. వేడిమి, చల్లదనం రెండూ విపరీతంగా ఉండే ప్రాంతం. వైద్యపరమైన సదవగాహన అక్కడి ప్రజలకి మరింత కలిగేలా ఎన్నో విధాలుగా కృషి సాగించారామె.

జీవనయానంలో భాగంగా పలు వైద్యకళాశాలల్లో బోధనలు సాగించారు. వివిధ ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తూ, ఎక్కడ తాను ఉన్నా అక్కడ ప్రాంతీయుల్లో వైద్య అవగాహన పెంపొందేలా చేశారు. అందుకు అనువుగా ఎన్ని సదస్సులు నిర్వహించారో, శిబిరాలు ఏర్పాటుచేశారో, ఉచితంగా వైద్యచికిత్సలూ సేవలూ ఎన్ని కొనసాగించారో లెక్కే లేదు. నిత్యమూ సేవల నిర్వహణలోనే నిమగ్నమైన అంకితభావం ఆమెది.

బరంపురంలో ఉన్న విఖ్యాత ప్రభుత్వ వైద్యసంస్థ ఎంకేసీజీ. మహారాజా కృష్ణచంద్ర గజపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్.

'అందరి ఆరోగ్యమే జాతికి సౌభాగ్యం' అనేది ఆ సంస్థ లక్ష్యం. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోనిది. వైద్యబోధన, శిక్షణ, పరిశోధన, పేషెంట్ కేర్ రంగాల్లో పేరు పొందిన బరంపురం వైద్య సంస్థకీ డాక్టర్ లక్ష్మీబాయి సేవలు విశేషంగా అందాయి.

ప్రసూతి, గైనకాలజీ విభాగం అధిపతిగా ఆమె అందించినవన్నీ నిరుపమాన సేవలు. పరిశోధన కృషిలో భాగంగా దేశ విదేశాల్లోని వైద్య నిలయాలను సందర్శించారు. అనేకమంది వైద్య నిపుణులతో పరిచయాలు పెంచుకున్నారు. చికిత్సల్లో సలహాలు ఇచ్చారు, అందుకున్నారు కూడా. మహిళా వైద్యురాలిగా తనదైన శైలిని కనబరిచి, ఎందరెందరికో అభిమానపాత్రురాలయ్యారు.

వైద్యం, సమాజం... ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంటుందనీ, ఉందనీ గట్టిగా నమ్మిన ఆమె వివిధ సందర్భాల్లో వ్యక్తపరచిన ప్రగాఢ అభిప్రాయాలు ఇవి :

1. భారతీయ వైద్య వ్యవస్థలో కీలకపాత్ర మహిళా వైద్యులదే.

2. లేడీడాక్టర్ వృత్తి అనేది ఒక ఉపాధి మాత్రమే కాదు, అదొక నిబద్ధత. మానవతాసహిత బాధ్యత.

3 వైద్యరంగంలోకి ప్రవేశించడం, స్థానం పొందడం, నిలబెట్టుకోవడం మన దేశంలో స్త్రీలకు అంత సులభమేమీ కాదు. అయినా పలువురు మహిళా వైద్యులు అంతర్జాతీయ ఖ్యాతినీ అందుకుంటున్నారంటే... అదంతా వనితా ప్రతిభకు ప్రతీక.

4. వనితావైద్యుల ప్రాతినిధ్యం దేశంలో ఎంతగానో పెరిగింది.

జాతీయ స్థాయిలో పనిచేస్తున్న వైద్యమండలి నివేదిక ప్రకారం చూసినా అండర్ గ్రాడ్యుయేట్ (మెడికల్) కోర్సుల్లోని వారిలో సగంమంది వైద్య విద్యార్థినులే! అలాగే ప్రభుత్వ వైద్యశాలల్లో ఉద్యోగ / వృత్తి విధులు నిర్వర్తిస్తున్న స్త్రీల ప్రాతినిధ్యం గడచిన రెండు దశాబ్దాల్లో రెట్టింపు అయింది. ఇది శుభసూచిక.

5. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి నివేదికలూ, అధ్యయన అంశాలూ మహిళావైద్యులు ప్రాధాన్యాన్ని వెల్లడిస్తున్నాయి.

ఉద్యోగ విరమణ చేశాక, డాక్టర్ లక్ష్మీబాయి సేవలు ఎంతో విస్తృతమయ్యాయి. సమాజంలో వైద్యసేవల విస్తరణకు ఒక ఉద్యమాన్నే నడిపారామె. జాతీయంగా 'భారత జ్యోతి' పురస్కారాన్ని స్వీకరించారు. అంతర్జాతీయంగా ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డును కైవసం చేసుకున్నారు. 'బెస్ట్ సిటిజన్' అనిపించుకున్నారు. ప్రతిష్ఠాత్మక పురస్కృతిని అందుకున్నారు.

వైద్యం గురించే వృత్తిపరంగా పరితపించే డాక్టర్ లక్ష్మీబాయి తన సంపాదన అంతటినీ విరాళరూపంలో 'ఎయిమ్స్'కి సమర్పించారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ – భువనేశ్వర్‌కి ఆమె అందించిన మొత్తం కోట్ల రూపాయల్లో! ఆ నిధి అంతటినీ గైనకాలజీ వైద్య ప్రక్రియ పురోగతికి కేటాయించాలన్నారు. అంతేకాదు...

స్త్రీలలో క్యాన్సర్ నిరోధానికి అత్యధునాతన చికిత్స అత్యవసరం. అందుకే మరికొన్ని లక్షల రూపాయల మొత్తాన్ని బరంపురంలోని గైనకాలజీ చికిత్సల సొసైటీకి డాక్టర్ లక్ష్మీబాయి ప్రకటించారు. అందించారు.

తనకంటూ ఏమీ మిగుల్చుకోలేదు. ఇంటిని సైతం విక్రయించగా వచ్చిన మొత్తాన్ని విరాళమిచ్చిన త్యాగమయి. ఆ భారీ వదాన్యతకు స్పందించిన ప్రభుత్వం ఆమెను ధన్యచరితగా కొనియాడింది.

'అసలు మీ ఆలోచనే అద్భుతం. వనితాశక్తి సంపన్నతకు ఇదే సంకేతం. ఆరోగ్యభాగ్యం అందరికీ అందించాలన్న ప్రభుత్వాల నిరంతర కృషికి అన్ని విధాలుగానూ వెన్నుదన్నుగా నిలుస్తోంది మీ వదాన్య స్వభావం. సమాజసేవకు నిర్వచనం మీతోనే ప్రకటితం అయింది. ఇదీ సాధికారత. ఇదే సేవా తత్పరత, అంటూ డాక్టర్ లక్ష్మీబాయికి ఆత్మీయ సందేశం పంపించారు భారత రాష్ట్రపతి.

ఈనాటికీ అక్షరాక్షర సాక్ష్యాలే ఈ అన్నీ. ధన్యజీవని డాక్టర్ లక్ష్మి.

జంధ్యాల శరత్‌బాబు

సీనియర్ జర్నలిస్ట్



దక్షిణ భారతంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన టిప్పు సుల్తాన్ 4వ మైసూర్ యుద్ధంలో మరణించాడు. దానితో దక్షిణ భారతాన్ని బ్రిటిష్ వారు వెల్లస్లీ ఆధ్వర్యంలో సైన్య సహకార పద్ధతికి ఒప్పించారు. దానిలో భాగంగా హైదరాబాద్‌లోని బ్రిటిష్ రాజప్రతినిధి పాట్రిక్ నిజాం ఆలీఖాన్‌తో సైనిక ఒడంబడిక చేసుకున్నాడు. ఆ కారణంగా ఏటా బ్రిటన్‌కు రూ. 24 లక్షలు ఇవ్వడానికి సైన్యానికి అయ్యే ఖర్చులు భరించడానికి ఒప్పించాడు. అందువల్ల సంస్థానాల సొమ్ములన్నీ బ్రిటిష్ వారికే దక్కాయి.

దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలు కరవ య్యాయి. ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం క్షేత్రంలో ఆంధ్ర శ్రీ మహావిష్ణు దేవాలయం ఎంతో పేరు ప్రఖ్యాతులున్న దేవళం. ఆ స్వామిని కూడా పూర్తిగా పస్తు పెట్టారు. దీనిని చూసిన కాసుల పురుషోత్తమ కవికి కోపం వచ్చింది. దేవుడికి ఉత్సవాలు లేక వెలవెల పోతున్న వైనం చూసి కవి గారి మనస్సు కలత చెందింది. ఆ బాధను ఎవరి ముందు వెళ్లగక్కితే ఎవరు ఊరుకుంటారు. అందుకే ఆ తిట్టేదేదో ఆయన్నే (భగవంతుని) తిడదాం అని ప్రారంభిం చారు. అందుకు వ్యాజస్తుతి అలంకారం బాగా అక్కరకు వచ్చింది.

ఇది తెలుగు సాహిత్యంలో ఒక విలక్షణమైన రచన. చారిత్రక పౌరాణికాది అనేక నేపథ్యాలు తెలిస్తే గాని అర్థం కాదు. దీనికి తోడు ఈ శతకానికి ఒక చారిత్రక అవశ్యకతా ఉంది. "చిత్ర చిత్ర ప్రభావ దాక్షిణ్య భావహత విమత జీవ, శ్రీకాకుళాంధ్ర దేవ!" అని మకుటముతో ఈ శతకాన్ని రాశాడు కవి.

అలు నిర్వాహకురాలు భూదేవియై యఖిల భారకుడను ఖ్యాతి దెచ్చె /నిష్ట సంపన్నురాలిందర భార్యయై కామితార్థుడన్న ఘనత దెచ్చె

కమల గర్భుండు సృష్టికర్త తనూజుడై బహుకు టుంబీకుడన్న ప్రతిభదెచ్చె /ఆంధ్రు బిడ్డలు దెచ్చు ప్రఖ్యాతిలే / మొదటి నుండియు నీవు దామోదరుడవె

(26వ పద్యము)

నీకంటూ స్వయంప్రతిభ లేకనే గదా నీవు నీ ఇల్లాండ్రు మీద, సంతానం మీద ఆధారపడవలసి వచ్చెను. భూదేవి నీ భార్య అగుట వలన అఖిల భారకుడని, లక్ష్మి నీ భార్య అగుట చేత అష్టైశ్వర్య ములకు నిలయుడవని, బ్రహ్మ కొడుకు కావడం చేత బహు కుటుంబీకుడని, గంగ నీ పుత్రిక యైనందున పతిత పావనుడని బిరుదుగాంచావు. మొదటి నుండియు నీవు దామోదరుడవే.

ఇంగ్లీషు వారికి స్వయంప్రతిభ లేకనే ఇక్కడి భూభాగాన్నీ, సంపదనూ, మానవ సంపదతో ఇక్కడి ప్రజలను పరిపాలిస్తున్నారు. ఇక్కడి గంగను ఉపయోగించుకొని పతిత పావనులనే బిరుదు గాంచారు. మొదటి నుండీ నీవు దామోదరుడవే తుంటరి వానివే ఇది నీ గొప్పతనం కాదు, నీవు సంపాదించిన దోచుకున్న దేశం (భారతదేశం) గొప్పతనం.

కృష్ణాజిల్లా ఘంటసాల మండలానికి చెందిన గ్రామం శ్రీకాకుళం. మచిలీపట్నానికి 39 కి.మీ.ల దూరంలో ఉంది. ఇక్కడ ఆంధ్ర మహావిష్ణు మందిరం ఉంది. ఇక్కడి ప్రముఖుల్లో శ్రీకాసుల పురుషోత్తమ కవి ఒకరు. శ్రీకాకుళ ఆంధ్ర విష్ణు శతకం పేరులో 108 పద్యాలు రాశారు. ఈ గ్రామాన్ని శ్రీకృష్ణ దేవరాయలు దర్శించి స్వామి వారికి అనేక కానుకలు సమర్పించినట్లు అక్కడి శాసనం ద్వారా తెలుస్తుంది. తాను రాసిన ఆముక్తమాల్యాద కథకు ప్రేరణ ఈ ఆంధ్ర విష్ణు దేవాలయాల్లోనే కలిగినట్లుగా తన గ్రంథంలో రాసుకున్నారు.

"యిష్ట దేవతా ప్రార్థనంబు జేసి మున్నే కళింగ దేశ విజగేషా మనీషం దండెత్తిపోయి విజయ వాటిం గొన్ని వాసరంబు లుండి శ్రీకాకుళనికేతనుండగు నాంధ్ర మధుమధను సేవింపబోయి హరివాస రోపవాసం బచ్చట గావింపనప్పుణ్య రాత్ర చతుర్థ యామంబున"

"గ్రంథకర్త నిద్రించుచుండగా స్వప్నమందు నల్లని శరీరచ్ఛాయ గలిగి, తామర రేకులం దిరస్కరించేడు కన్నులు గలిగి, యురంబునం గేస్తుభ మాణిక్యంబు గలిగి, తన పార్శ్వమందు నిలిచి లక్ష్మీదేవి యొక చేత కమలంబును, రెండవ చేత దన హస్తంబు నుంగీలించి యుండ జిఱు నగవుల యందే తన సం గలదయ దెలియు చుండ నా యాంధ్రవల్లభ స్వామి కనుపడి పలికెను".

"నేనును పూలదండలను దొలుత దానే ధరించి పిమ్మట యవి నాకు సమర్పించిన చిన్నది యగు చూడికుడుత్త నాంచారని యెడ పొలతియు శ్రీరంగ మందు బెండ్లాడిన కథను చెప్పుమనియును, గుర్తు జేసియున్నారు". అలా శ్రీకాకుళంలో ఆముక్త మాల్యాద (విష్ణు చిత్తీయం) అనే గ్రంథానికి అంకురార్పణ ఇచ్చటనే జరిగింది. ఆ విధంగా వెలుగొందుచున్న గొప్ప జనావాసం శ్రీకాకుళం. "ఆంధ్ర కౌముది" ప్రకారము ఆంధ్ర విష్ణువు శ్రీకాకుళమును పాలించిన చంద్రుని కుమారుడు. ఆర్య మంజుశ్రీ మూల కల్పమను బౌద్ధ గ్రంథము ప్రకారము చంద్రుని రాజధాని శ్రీకాకుళము ప్రాచీన కాలమున కృష్ణానది ఒడ్డున ఉన్నట్లు తెలుస్తోంది.

తెలుగదెల నన్న దేశంబు దెలుగేను
దెలుగు వల్లభుండ దెలు గొకండ
యెల్ల నృపులు గొలువ నెఱుగ బాసాడి
దేశ భాషలందు దెలుగు లెస్స

(రాయలవారికి ఈ పద్యము కలలో చెప్పినదే).

ఆముక్త మాల్యద

శ్రీకాకుళము భక్తలోక చింతామణి
శ్రీకాకుళము సుకృతారకరంబు
శ్రీకాకుళము ధరా లోక వైకుంఠంబు
శ్రీకాకుళము మర్త్య సేవితంబు
శ్రీకాకుళము వేదసిద్ధాంత మహిమంబు
శ్రీకాకుళము హతక్యాకులంబు
శ్రీకాకుళము మహాక్షేత్రావతంనంబు
శ్రీకాకుళము సర్వసిద్ధికరము

తెలియ శ్రీకాకుళంబు నీ దివ్యదేశ మాంధ్ర నాయక నీవె శ్రీహరివి నిజము.

శ్రీకాకుళ క్షేత్రం భూలోక వైకుంఠమై వెలసినది. గొప్ప పుణ్యక్షేత్రము, వేదములకు నెలవై విలసిల్లిన పుణ్య క్షేత్రము, అంటూ కవి శ్రీకాకుళం గొప్పతనాన్ని తన పద్యంలో వర్ణించారు.

వట్టి గొల్లది రోట గట్ట నోపిన నీకు రోసంబులే దన్న నీనుగలదె? జార చోరాది చేష్టల బ్రవర్తిల్లు నీ కపకీర్తి యన్న భయంబుగలదె? భార్యచే దన్నులు బడ్డవానికి నీకు లజ్జ లేదని యన్న లాగవంబె?

కుండుంటు లేదని కొసరి మెక్కిన నీకు హీనత లెంచిననూన్యా మగునె?

కోరి దాసులు నిన్నెంత దూరుచున్న
బందమున్నదె నీ కిసుమంతయైన (ప-41)

నీకు రోసము, సిగ్గు, పౌరుషము, పట్టుదల లేవా? నీ నిజభక్తులు నిన్ను దూషించిన మిన్నకు న్నావు. యశోద రోటికి కట్టి వేసినా రోషపడలేదు. దొంగ తనాలకు పాల్పడిన అపఖ్యాతికి కుంగలేదు. నీ ప్రియసతి తన్నులకు సిగ్గుపడలేదు. ఏమి నీ మాయ.

ఈ పద్యం ప్రధానంగా భారతీయుల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రత్యేకంగా రానినట్లు కనిపిస్తున్నది.

భువన మోహన కృష్ణమూర్తివి నీవేని ....

ర చైతన్యదీప్తి
ోత్తమ కవి



..... నీదు మహిమను జూపవలదె? (ప-91)

నిజంగా నీవు మహిమ గల దేవుడవే అయితే నీ మహిమ భక్తులకు, ప్రజలకు ఈ క్షేత్రమందు చూపించు. శ్రీకృష్ణ, బలరామ, నృసింహులు నీ అవతారములే అయితే ఆ మహిమలు చూపు దేవా అంటూ ప్రార్థించారు కవి.

అబ్బుకోగలెవో కాయక్లేశ మొనరించు దేవాసురులటుండ దివ్యరమను / దోచుకోగలవో చేసాచి లోకములోని బలి మహాదాత వైభవములెల్ల

రాదీయ గలవొ సత్రాజిత్తుడీకున్న మాణిన్య మంతకమొక మమత గొల్చి / నాటించగలవో సన్నక సన్ననె వనంబు పెట్టు ప్రూన్వెకలించి పెరటిలోన

దెచ్చుకొనవేమి వస్త్రాన్న దీప ధూప గంధ తాంబూలములకైన గడనదెలిసె (ప-18)

స్వామీ నీకు సొంత సంపాదన లేదు, సామర్థ్యం లేదు. దేవాసుర సముద్ర మథన వేళ అయాచితంగా లక్ష్మిని పొందావు. దేహి అని బలిని అర్థించి భూమ్యాకాశాలు ఆక్రమించావు. సత్రాజిత్తు భామతో పాటు శ్యమంతకమణి ఇచ్చాడు. ఇంద్రుడు అంగీకరించి పారిజాతమును నీ పెరటి చెట్టుగా ఇచ్చాడు. వీటిలో నీ సామర్థ్యం ఎక్కడయా స్వామి. వ్యాపారం కోసం దేహి యని అర్థించి భూమ్యాకాశాలను ఆక్రమించాడు (బ్రిటిష్‌వారు). భారత్‌లోని సంస్థానాధిపతులు వారిలోవారు కలహించుకోగా సంపాదన పొందాడు. ఇక్కడి బంగారం అంతా దోచుకుపోయాడు. ఇక్కడి అడవులపై హక్కులు పొందాడు. ఇలా అన్ని రంగాలను దోచుకోగలిగాడు.

కల్లరుల్గాని వ్రేపల్లె వారందరు హర్షింప.... నీ పొంకములు సాగునేమి యచట? (30 ప)

వ్రేపల్లె వాసులు అమాయకులై నిన్ను నమ్మి కొలిచారు, మధురా పురవాసులు సమ్మతించి గౌరవించి, నిన్ను పెద్దను చేశారు. ద్వారకా జనులు నిను కొలుచుటతో అక్కడ కొలువు తీరావు. అమాయకులే నిన్ను నమ్ముదురయ్యా ప్రభూ.

ఇక్కడి ప్రజలు అమాయకులు గనుక వ్రేపల్లె, ద్వారక, మధురా వారి సంపదను దోచుకున్నావు. అమాయకులే నిన్ను నమ్ముదురయ్యా,

"నాగలి రొకలన్నకు..... తీర్పవలె గాని మఱియెందు తీర్చగలదె" (36 ప)

నీవు బహు నేర్పరివి. అన్నదమ్ముల మధ్య చాలా భేదము కల్పించినావు. నాగలి, రోకలి అన్నకిచ్చి నీవు శంఖు, చక్రం ధరించావు, నీవు గరుడధ్వజం ధరించి అన్నకి తాళధ్వజము కల్పించావు, విలువైన వస్త్రములు నీకు, పనికిరాని వస్త్రములు అన్నకు. అన్నను మత్తులో ముంచి నీవేమో పాలు వెన్న దొంగవలె మెక్కినావు. బ్రిటిష్ వారి పాలనలో అన్న భారతీయులు కాగా, తమ్ముడు బ్రిటిష్ వారు.

గోవింద! ముచి కుంద సేవిత పాదార విందా! నిత్యానంద విష్వతుంద" (34 ప్ర)

ముచికుందుడు చాలా పరాక్రమవంతుడు. మాంధాత కుమారుడైన ముచికుందుని యుద్ధంలో గెలవడం కష్టమని దేవ దానవులకు తెలుసు. త్రేతాయుగంలో పుట్టిన ముచికుందుడు ద్వాపర యుగం వరకూ ఉన్నాడు. దేవ దానవుల యుద్ధంలో ముచికుందుడు దేవతలకు సాయం చేయడం ద్వారా వారు గెలిచారు. దానికి కృతజ్ఞతగా దేవతలు వరం కోరుకోమన్నారు. ముచికుందుడు నాకు బాగా అలసటగా ఉంది నిద్రపోవడానికి మంచి ప్రదేశం చూపమనగా వారు చూపారు. అయితే దేవతలు అతడు నిద్ర కోరుకుంటున్నాడుగాన వానికి నిద్రాభంగం చేస్తే వాడి తల వేయి ముక్కలవుతుందని వరం ఇచ్చారు. యుగాలు మారినా ముచికుందుడు నిద్రావస్తలోనే ఉన్నాడు. ఈ వరం కారణంగా ద్వాపరయుగంలో కాలయవనుడు అనే అసురుని మరణానికి కారణం అయ్యాడు. కాలయవనుడికి యాదవుల చేతిలో ఓడిపోను అనే వరం పొంది ముందు జాగ్రత్తలో ఉన్నాడు.

బలరామకృష్ణుల చేతిలో ఓడిపోయిన జరాసంధుడు, కాలయవనుడితో కలిసి మధురపై దండెత్తేవాడు. యాదవులను సంహరిస్తూ ఉండే వాడు. కాలయవనుడి బాధ భరించలేక యాదవులు మధురలో ఉండటం శ్రేయస్కరం కాదని "ద్వారక" నిర్మాణానికి ఆదేశించాడు కృష్ణుడు. అది జరుగుతూ ఉండగా కృష్ణుడు ఆయుధాలు లేకుండా కాలయవనుడు దగ్గరకు వెళ్లగా అతడు కత్తి చూశాడు. దానికి భయపడి కృష్ణుడు పరుగులంకించు కుని ముచికుందుడు నిద్రపోయే గుహవరకు పరుగెత్తాడు. కాలయవనుడు అతడ్ని వెంబడించి కృష్ణుడు దూరిన గుహలోనికి దూరగా అక్కడ ఒక వ్యక్తి నిద్రపోతూ కనిపించాడు. ఆ వ్యక్తిని గట్టిగా కాలితో తన్నాడు. కాలయవనుడు. ముచికుందుడు కళ్లు తెరిచాడు. కాలయవనుడు భస్మం అయ్యాడు. ఇటువంటి శక్తులను ఇప్పుడు బ్రిటిష్ వారిపై ఎందుకు వాడడం లేదని కవి అడుగుతాడు.

మానుష్య హార్యక్ష మార్తాండ సోమాక్ష, త్రిభువనాధ్యక్ష, కౌంతేయ పక్షి / విలాస మంజుల భరహాస శ్రీహరిన్నివాస, కౌసేయ వాస

(ఆంధ్రనాయక శతకం 3 ప)

నీవు నరుడిగా కాకుండా నారసింహా అవతారంగా వచ్చి ఈ భారతదేశాన్ని పాలిస్తున్నవారి భరతం పట్టమని, కౌంతేయ పక్ష అంటే కౌంతేయ పక్షం వహించి పాండవులను గెలిపించావు. గజేంద్రుడ్ని రక్షించిన విష్ణుమూర్తిలా వచ్చి బ్రిటిష్ వారిని భారతదేశం నుండి తరిమేయాలని కోరుకుంటున్నాడు కవి.

మూలం:

1. అముక్త మాల్యద సవ్యాఖానము, శ్రీకృష్ణ దేవరాయలు పేజి. 2. శ్రీమదాంధ్ర నాయక శతకము: కాసుల పురుషోత్తమ కవి. 3. Battles of the Honourable East India Company by M.S. Naravane

డా. కొశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

ఆర్ఎస్ఎస్ 100

విద్యాభార

ఆర్ఎస్ఎస్ ఆదర్శాలతో ప్రేరణ పొందిన విద్యా విభాగమైన విద్యాభారతి తరతరాలుగా భారతీయ విలువలు, సంస్కృతి, నడవడికలో నిష్ణాతులైన విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్-ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన నాటి నుండి, గ్రామీణ భారత్‌ను చైతన్యపరచడానికి విద్యే అత్యంత ప్రభావవంతమైన మార్గమని గుర్తించింది. సేవ, సంస్కారం ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలను చైతన్య పరచాలని నిర్ణయించుకుంది. విద్యా భారతి సంస్థలు, ముఖ్యంగా సరస్వతీ శిశుమందిరాలు, విద్యా మందిరాలు, సరైన ప్రభుత్వ పాఠశాలలు లేని ప్రాంతాలలోని లోపాలను సరిచేస్తూ, తక్కువ ఖర్చుతో కూడిన, సమాజ ఆధారిత విద్యను అందించాయి. విశ్వాసం, సేవ ఆధారంగా గ్రామీణ భారత్‌లో ఒక సామాజిక, సాంస్కృతిక ఉనికిని పెంపొందించింది. విద్యాభారతి, సాంస్కృతిక విలువలను సమకాలీన విద్యతో మేళవించడానికి కట్టుబడి ఉన్న, భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వేతర పాఠశాలల నెట్‌వర్క్‌లలో ఒకటిగా ఉంది. ఇది 1977లో అధికారికంగా ఏర్పడి నప్పటికీ, దీని కార్యకలాపాలు 1952లో ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో మొదటి సరస్వతీ శిశుమందిరం స్థాపనతో ప్రారంభ మయ్యాయి. విద్యా భారతి "వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం" అనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి ఒక నిదర్శనం. విద్యాభారతి అఖిల్ భారతీయ శిక్షా సంస్థాన్- (వీబీఏబీఎస్ఎస్) సంస్థాగత ప్రధాన కార్యాలయం లక్నోలో ఉంది. ఇది మేధోపరంగా నిష్ణాతులుగా, నైతికంగా దృఢంగా, ఆధ్యాత్మికంగా ప్రబుద్ధులైన విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలలను పర్యవేక్షిస్తుంది. విద్యాభారతి విద్య "భారతీయీకరణ, జాతీయీకరణ, ఆధ్యాత్మికీకరణ"ను ప్రోత్సహిస్తుంది. 2024-25 నాటికి 12,000కు పైగా విద్యాసంస్థలతో, 35 లక్షలకు పైగా విద్యార్థు లకు సేవలందిస్తున్న ఇది, భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ పాఠశాలల నెట్‌వర్క్‌లలో ఒకటి.

విద్యాభారతి పాఠశాలల సహకారం

విద్యాభారతి పాఠశాలలు విద్యాబోధన, భారతీయ విలువల సమ్మేళనానికి ప్రసిద్ధి చెందాయి. పార్థ్యప్రణాళికలో రోజువారీ ప్రార్థనలు, దేశభక్తి గీతాలు, యోగా, సంస్కృత బోధన, నిజాయితీ, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతపై దృష్టి సారించిన నైతిక విద్య ఉంటాయి. భారతీయ సంస్కృతి, వారసత్వం పట్ల గౌరవాన్ని పెంపొందించడానికి సాంప్రదాయ పండుగలను జరుపుకుంటారు. ఈ విద్యా వ్యవస్థ సాంస్కృతికంగా దృఢమైన యువతను తీర్చిదిద్దింది. అలాంటి యువత సామాజిక సేవల ద్వారా ఆర్ఎస్ఎస్‌తో తన అనుబంధాన్ని కొనసాగిస్తోంది. ఈ విధంగా, విద్యాభారతి ఆర్ఎస్ఎస్ పట్టణ మేధో పునాదికి, గ్రామీణ సమాజానికి మధ్య వారధిగా పనిచేస్తూ, పాఠశాల విద్యలో జాతీయ చైతన్యాన్ని పెంపొందిస్తుంది. అదేవిధంగా, గిరిజన వర్గాలతో విద్యాభారతి అనుబంధం ఏకల్ విద్యాలయాలు (ఒకే ఉపాధ్యాయుడు ఉండే పాఠశాలలు), సంస్కార కేంద్రాల ద్వారా జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లోని మారుమూల, అటవీ ప్రాంతాలకు విస్తరించింది. ఈ సంస్థలు అక్షరాస్యత, ప్రాథమిక విద్యను అందించడంతో పాటు, స్థానిక ఆచారాలను పరిరక్షిస్తూ జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయి. ఈ విస్తరణ కార్యక్రమం ఆర్ఎస్ఎస్ సామాజిక పునాదిని పట్టణ మధ్యతరగతి నుండి గ్రామీణ, గిరిజన జనాభా వరకు విస్తరించింది. గతంలో ఏకాంతంగా ఉన్న వర్గాలను విస్తృత సాంస్కృతిక, జాతీయ సందర్భానికి అనుసంధానించింది. విద్యాభారతి నుంచి వచ్చిన అనేక మంది గ్రాడ్యుయేట్లు ,స్థానిక వాలంటీర్లు సేవాభారతి, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం, గ్రామ వికాస్ కార్యక్రమాల వంటి ఆర్ఎస్ఎస్-ప్రేరేపిత కార్యక్రమాలకు మద్దతు ఇస్తున్నారు. తద్వారా స్వీయ అస్తిత్వంతో కూడుకున్న సామాజిక నాయకత్వ ఆవృతాన్ని స్థాపిస్తున్నారు. ఈ అనేక కార్యక్రమాలు ఆర్ఎస్ఎస్‌ను గ్రామ అభివృద్ధి, స్వయం సమృద్ధి, నైతిక జీవనానికి అంకితమైన క్షేత్రస్థాయి సంస్థగా నిలబెట్టాయి. ఇటీవల భారత ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల భాగస్వామ్యంతో కొత్తగా 100 సైనిక్ పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ చర్యలో భాగంగా, ఏడు (07) విద్యాభారతి పాఠశాలలను సైనిక్ పాఠశాలలుగా మార్చడానికి ఎంపిక చేశారు.

దేశ పునఃనిర్మాణంలో విద్యాభారతి పాఠశాలల పాత్ర

విద్యాభారతి పాఠశాలలు విద్యాపరమైన కఠినత్వం, సాంస్కృతిక వారసత్వం , నైతిక సూత్రాల కలయిక ద్వారా విద్యార్థులను తీర్చిదిద్ది, భారత దేశ పునఃనిర్మాణానికి గణనీయంగా దోహదపడతున్నాయి. విద్యాభారతి, సరస్వతీ శిశు మందిరాలు , సంస్కార కేంద్రాలు వంటి సంస్థల ద్వారా మేధస్సును, వ్యక్తి నిర్మాణాన్ని పెంపొందించే సంపూర్ణ విద్యను ప్రోత్సహిస్తుంది. ఈ సంస్థలు నిత్య ప్రార్థనలు, యోగా, సంస్కృత విద్య, ప్రాచీన పండుగల స్మరణ ద్వారా భారతీయ సంస్కారాలను (ఆదర్శాలను) ప్రచారం చేస్తూ, విద్యార్థులలో ప్రగాఢమైన దేశభక్తి, క్రమశిక్షణ భావనను పెంపొందిస్తున్నాయి. ఇవి సమకాలీన పాఠశాల విద్యతో పాటు, సేవ, స్వయం సమృద్ధి, సామూహిక శ్రేయస్సు వంటి సూత్రాలను ప్రోత్సహిస్తూ, యువతను సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొనేలా ప్రేరేపిస్తున్నాయి. విద్యా భారతి తన పరిధిని మారుమూల, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తూ, ప్రభుత్వ వనరుల కొరత ఉన్న ప్రదేశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుంది. గిరిజన, అణగారిన వర్గాలను శక్తిమంతం చేయడం ద్వారా, ఇది జాతీయ అభివృద్ధికి అవసరమైన సామాజిక ఐక్యతను,

ఏళ్ల ప్రస్థానంలో
రతి పాత్ర

సమ్మిళిత వృద్ధిని పెంపొందిస్తుంది. స్వయం సేవకులుగా శిక్షణ పొందిన విద్యావేత్తలు, వాలంటీర్లు, పౌర కర్తవ్యాన్ని, జాతీయ చైతన్యాన్ని పెంపొందించే నైతిక నమూనా లుగా నిలుస్తున్నారు. తత్ఫలితంగా, విద్యాభారతి పాఠశాలలు దేశాభివృద్ధికి అంకితమైన బాధ్యతా యుతమైన, సాంస్కృతికంగా పరిణతి చెందిన పౌరులను తీర్చిదిద్దుతున్నాయి.

విద్యావేత్తలు, విమర్శకుల అభిప్రాయాలు

విద్యాభారతి పాఠశాలలు, ఆర్ఎస్ఎస్ గురించి పలువురు విద్యావేత్తలు, పరిశోధకులు, విమర్శకులు రచనలు చేశారు. వాల్టర్ ఆండర్సన్, శ్రీధర్ దామ్లే తమ 'ది బ్రదర్‌హుడ్ ఇన్ సాఫ్రాన్' అనే గ్రంథంలో, విద్యాభారతిని ఆర్ఎస్ఎస్ సామాజిక-సాంస్కృతిక అజెండాకు ఒక కీలకమైన సంస్థాగత విస్తరణగా అభివర్ణించారు. రచయితల ప్రకారం, ఈ పాఠశాలలు ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణ, దేశభక్తి, ధార్మిక విలువలు వంటి సైద్ధాంతిక సూత్రాలను ఒక క్రమబద్ధమైన విద్యా చట్రంగా మారుస్తున్నాయి. క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ రచించిన 'ది హిందూ నేషనలిస్ట్ మూవ్‌మెంట్ అండ్ ఇండియన్ పాలిటిక్స్' అనే గ్రంథం, ఆర్ఎస్ఎస్ విద్యాసంస్థలుగా, హిందూ సాంస్కృతిక చైతన్యానికి వాహకాలుగా పనిచేసే పాఠశాలలను స్థాపించి, విద్య ద్వారా తన ప్రభావాన్ని ఎలా పద్ధతిగా విస్తరించిందో వివరిస్తుంది. తపన్ బసు ('ఖాకీ షార్ట్స్ అండ్ సాఫ్రాన్ ఫ్లాగ్స్'), మీరా నంద ('ప్రొఫెట్స్ ఫేసింగ్ బ్యాక్‌వర్డ్') వంటి ఆర్ఎస్ఎస్ విమర్శకులు కూడా, విద్యాభారతి పాఠ్యప్రణాళిక సాంప్రదాయ విద్యా విషయాలతో పాటు నైతిక, సాంస్కృతిక విద్యను కూడా సమగ్రంగా అందిస్తుందని పేర్కొన్నారు. ఈ రచనలు విద్యార్థులలో వారి నాగరిక వారసత్వంపై అవగాహనను పెంపొందించే ఉద్దేశ్యంతో సంస్కృతం, యోగా, భారతీయ చరిత్ర, నైతిక విద్యపై ఉన్న ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నాయి. దీని మద్దతుదారులు దీనిని విలువ-ఆధారిత విద్యగా భావిస్తుండగా, మరికొందరు దీనిని బోధనలో జాతీయవాద, మత-సాంస్కృతిక గుర్తింపును ఏకీకృతం చేసే ప్రయత్నంగా వ్యాఖ్యానిస్తున్నారు. పూజనీయ రెండవ సర్‌సంఘచాలక్ ఎం.ఎస్. గోల్వాల్కర్ సైద్ధాంతిక గ్రంథాలు, ముఖ్యంగా 'బంచ్ ఆఫ్ థాట్స్', ప్రామాణిక విద్య భారతీయ సంప్రదాయంలో పాతుకుపోయిన నైతిక, ఆధ్యాత్మిక సూత్రాలైన సంస్కారాలను పెంపొందించాలని వాదించడం ద్వారా ఈ దృక్పథానికి పునాది వేశాయి. తదుపరి పూజనీయ సర్‌సంఘచాలక్ బాలసాహెబ్ దేవరస్ "రాష్ట్ర నిర్మాణ్ మే శిక్ష"లో ఈ భావనను విపులంగా వివరించి, విద్యను ఒక జాతీయ బాధ్యతగా పేర్కొన్నారు. ఈ ఆదర్శాలు విద్యాభారతి నమూనాకు నేరుగా ప్రేరణనిచ్చాయి. ఈ నమూనా విద్యను కేవలం విద్యాబోధనగా మాత్రమే కాకుండా, జాతీయ సేవతో కూడిన వ్యక్తిత్వ వికాస సాధనంగా భావిస్తుంది.

టి.ఎన్. మదన్, క్రెయిగ్ జెఫ్రీ నిర్వహించిన పరిశోధన, విద్యాభారతి ద్వంద్వ విధిని నొక్కి చెబుతోంది. వాటిలో మొదటిది గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ప్రాథమిక విద్యను అందించడం, రెండవది జాతీయవాద భావజాలాన్ని ప్రచారం చేయడం. గ్రామీణ ప్రాంతాలలో విద్యాభారతి పాఠశాలల విజయానికి కారణం, అక్షరాస్యతను, సాంస్కృతిక పరిరక్షణను ప్రోత్సహించే, తక్కువ ఖర్చుతో కూడిన, సమాజ ఆధారిత బోధనా విధానమే. విమర్శకులు దీని భావజాల స్వభావంపై చర్చలు జరిపినప్పటికీ, అనధికారిక విద్య, గ్రామీణాభివృద్ధిలో దీని పాత్రను ప్రభుత్వ అంచనాలు అడపాదడపా గుర్తించాయి. జ్యోతిర్మయ శర్మ (టెర్రిఫైయింగ్ విజన్), ప్రేమ కురియన్ (ఎ ప్లేస్ ఎట్ ది మల్టీకల్చరల్ టేబుల్) వంటి ఇతర విమర్శకులు ఆర్ఎస్ఎస్ అనుబంధ పాఠశాలల విస్తృత పరిణామాలను పరిశీలిస్తూ, దానిని ప్రపంచ హిందూ గుర్తింపు ఉద్యమంలో ఒక భాగంగా చిత్రీకరిస్తున్నారు. విద్యాభారతి బోధనా విధానం సారాంశంలో పూర్తిగా స్థానికమైనప్పటికీ, ఉమ్మడి సాంస్కృతిక కథనాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సమాజాలను అనుసంధానించడానికి కూడా పనిచేస్తుందని వారు వాదిస్తున్నారు. అందువల్ల, ఆర్ఎస్ఎస్ ప్రస్థానంలో విద్యాభారతి పాఠశాలల కీలక పాత్రను నిర్ధారిస్తూ, స్వతంత్ర పండితులు, విమర్శకులు ఇద్దరూ వాటి గురించి విస్తృతంగా రాశారని మనం గమనించవచ్చు.

విద్యాభారతి ప్రాథమికంగా 'దేశమే ప్రథమం' అనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం విద్యాపరమైన రూపానికి ప్రతిరూపం. సమకాలీన జ్ఞానాన్ని ఆధ్యాత్మిక వార సత్వంతో అనుసంధానించి, భారతీయ సంస్కృతికి, జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే క్రమశిక్షణ, సేవా దృక్పథం ఉన్న వ్యక్తులను తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. దీని సమర్థకులు దీనిని దేశీయ సూత్రాలపై ఆధారపడిన సమగ్ర విద్యా నమూనాగా పరిగణిస్తుండగా, విమర్శకులు దీనిని భావజాల ప్రబోధానికి ఒక సాధనంగా భావిస్తారు.

ముక్తాయింపు

విద్యాభారతి ప్రాథమికంగా 'దేశమే ప్రథమం' అనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం విద్యాపరమైన రూపానికి ప్రతిరూపం. సమకాలీన జ్ఞానాన్ని ఆధ్యాత్మిక వారసత్వంతో అనుసంధానించి, భారతీయ సంస్కృతికి, జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే క్రమశిక్షణ, సేవా దృక్పథం ఉన్న వ్యక్తులను తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. దీని సమర్థకులు దీనిని దేశీయ సూత్రాలపై ఆధారపడిన సమగ్ర విద్యా నమూనాగా పరిగణిస్తుండగా, విమర్శకులు దీనిని భావజాల ప్రబోధానికి ఒక సాధనంగా భావిస్తారు. ఏదేమైనప్పటికీ, ఈ రెండు దృక్కోణాల నుండి, ఆధునిక భారతదేశంలో విద్యానంబంధ సంభాషణను, సాంస్కృతిక గుర్తింపును సృష్టించడంలో విద్యాభారతి ఒక ముఖ్యమైన ప్రభావంగా కొనసాగుతోంది. అంతేకాకుండా ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థల గ్రామీణ విస్తరణకు విద్యా భారతి పాఠశాలలు కీలకంగా నిలిచాయి. విద్య, సంస్కృతి, సేవలను సమన్వయం చేయడం ద్వారా, అవి గ్రామాలను జాతీయ చైతన్యం, స్వయంసమృద్ధి కేంద్రాలుగా మార్చాయి. రాజకీయ పద్ధతులను అవలంబించకుండా, ఆర్ఎస్ఎస్ ఈ విద్యా సంస్థల ద్వారా గ్రామీణ భారతదేశంతో మమేకమై, దృఢమైన నైతిక సమగ్రత, దేశభక్తి సూత్రాలతో కూడిన యువతను తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం, విద్యా భారతి భారతదేశంలోని 70 శాతానికి పైగా జిల్లాల్లో, ముఖ్యంగా గిరిజన, మారుమూల ప్రాంతాలలో పనిచేస్తూ, "విద్య ద్వారా దేశ నిర్మాణం, విలువలతో విద్య" అనే ఆర్ఎస్ఎస్ శాశ్వత వ్యూహానికి నిదర్శనంగా నిలుస్తోంది. ★

"ఏసును నమ్ముకుంటే జబ్బులు తగ్గిపోతాయ్, డబ్బులొస్తాయ్, ఉద్యోగమొస్తుంది, ఇక్కడ అసలు కులం, వివక్ష అన్న మాటలే వినిపించవు".. అంటూ పేదలు, నిరక్షరాస్యులైన కోటాను కోట్లమందిని హైందవం నుంచి క్రైస్తవంలోకి మతం మార్చేశారు. మతం మారిన వారి పరిస్థితులేమీ మారకున్నా విశ్వాసాలపై దెబ్బకొడుతూ ప్రజల్ని దారుణంగా మోసగిస్తూ ధనార్జనే ధ్యేయంగా దేశంలో అతి పెద్ద క్రైస్తవ మతమార్పిడి మాఫియా నెట్‌వర్క్ దౌర్జన్యాలు సాగిస్తోంది. దురదృష్టకరమైన పరిస్థితి ఏమిటంటే, దురవగాహనతో మతం మారినవారికి అక్కడ ఒరిగిందేమీ లేకపోయినా, నిజమేంటో తెలిసినా సరే, వీరే మరెందరినో హైందవం నుంచి క్రైస్తవంలోకి మతం మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో అతి ముఖ్యమైన కోణం ఏమిటంటే, హిందూ సమాజంలో అనేక కారణాల వల్ల వెనుకబడి, పేదరికంలో ఉన్న దళిత కులాలవారి (ఎస్సీ సామాజిక వర్గం) కోసం భారత రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించి వీరి ఉన్నతికి ఎన్నో అవకాశాలు కల్పించగా, వీరికి సైతం లేనిపోనివి చెప్పి మాయమాటలతో మభ్యపెట్టి క్రైస్తవంలోకి మార్చుతున్నారు. అయితే, 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వులు ఈ విషయంలో స్పష్టమైన నిర్వచనాన్ని ఇచ్చాయి. ఎస్సీలు హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను వీడి మరే మతంలోకి వెళ్లినా షెడ్యూల్డ్ కుల హోదా ఉండదని, ఇలా మారిన తక్షణమే సంపూర్ణంగా ప్రయోజనం కోల్పోతారని, కులధ్రువీకరణ పత్రం ఉన్నా.. చట్టపరమైన రక్షణ దక్కదని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు అని స్పష్టం చేసింది. దీనిని సైతం లెక్క చెయ్యకుండా క్రైస్తవంలోకి మారిన ఎందరో ఎస్సీలు, తమ 'మతమార్పిడి'ని దాచిపెట్టి, అంతకు ముందు పొందిన కులధృవీకరణ పత్రాలతో ఎస్సీ రిజర్వేషన్ సహా అనేక ప్రయోజనాలు పొందుతూ హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన నిజమైన ఎస్సీలకు ద్రోహం చేస్తున్నారు.



మతమార్పి రాజ్యాంగ

భారత సర్వోన్నత న్యాయస్థానం మత మార్పిడిపై మరోసారి చారిత్రక తీర్పును వెలువరించింది. షెడ్యూల్డ్ కులానికి చెందినవారు మతం మారితే ఎస్సీ హోదా తక్షణమే రద్దవుతుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మతం మారినవారు తాము ఎస్సీలమని చెప్పుకోవడం కుదరదని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం వారికి వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది.

గత ఏడాది ఏప్రిల్ 30న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చింతాడ ఆనంద్ Vs అక్కల రామిరెడ్డి కేసులో వెలువరించిన తీర్పును జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం సమర్థించింది. సుప్రీం కోర్టు ఈ తరహా తీర్పు ఇవ్వడం ఇది రెండో సారి. ఈ రెండు తీర్పులు మన దేశంలోని మతమార్పిడి తీవ్రతను, మతం మారినవారి అవకాశవాద ధోరణినీ ఎత్తిచూపాయి. 2021లో తమిళనాడు హైకోర్టు సైతం భారతీయార్ యూనివర్సిటీ ఉద్యోగ నియామకాల విషయంలో ఇదే తరహా తీర్పు ఇచ్చింది.

ఈ స్థితికి ప్రధాన కారణం ప్రభుత్వ వైఖరిలో సంతుష్టీకరణ, పాలన యంత్రాంగంలోని అలసత్వంలోనే ఉంది. క్రైస్తవ మతం పుచ్చుకున్నవారి జనాభా పెరుగుతున్నా.. జనగణనలో ఆ వివరాలు ప్రస్ఫుటం కావడం లేదు. వారంతా ఎస్సీలుగానే చెలామణి అవుతూ..రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బాప్టిజం స్వీకరించిన ఎస్సీలు దళితులుగా కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం, వాటి ఆధారంగా ఉద్యోగాలు పొందడం, నిర్విచక్షణగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. అంతేకాదు, ఎనభయ్యవ దశకంలో 'దళిత క్రైస్తవులు' అనే అసంబద్ధమైన కొత్త కుల వర్గీకరణ సైతం సామాజిక ఆవరణలోకి ప్రవేశించింది.

చింతాడ ఆనంద్ Vs అక్కల రామిరెడ్డి కేసు నేపథ్యం

ఏపీలోని బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో చింతాడ ఆనంద్ అనే వ్యక్తి క్రైస్తవంలోకి మారి పాస్టర్‌గా పనిచేస్తున్నారు. పాస్టర్ చింతాడ ఆనంద్ అక్కల రామిరెడ్డి అనే వ్యక్తిపై 2021లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని 3(1ఆర్), 3(1ఎస్), 3(2వీఏ), ఐపీసీ 341, 506, 323 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆదివారం ప్రార్థనల్లో పాస్టర్ విధులు నిర్వహిస్తుండగా రామిరెడ్డి తనపై దాడిచేసి చంపుతానని బెదిరించారని, కులం పేరుతో తన కుటుంబాన్ని దూషించారని చింతాడ ఆనంద్ ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయి చార్జిషీటు కూడా దాఖలైంది. తనపై కేసును కొట్టివేయాలని కోరుతూ రామిరెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం చట్టవిరుద్ధమని దావా వేశారు.

ఏపీ హైకోర్టు తీర్పు

చింతాడ ఆనంద్ క్రైస్తవంలోకి మారారని, పాస్టర్‌గా పనిచేస్తున్నారని, ఆయన తాను ఎస్సీనని చెప్పుకోవడానికి వీల్లేదని అక్కల రామిరెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హిందూమతాన్ని ఆచరించే వ్యక్తిని తప్ప మరెవరినీ ఎస్సీగా పరిగణించడానికి వీల్లేదని, 1950నాటి రాజ్యాంగ ఉత్తర్వులు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయని తెలిపారు. అయితే ఆనంద్ సహా ఇతర ప్రతివాదులు మాత్రం కేసు దర్యాప్తు పూర్తయిందని, పది మంది సాక్షుల వాంగ్మూలాలతో చార్జిషీటు కూడా వేశారని కోర్టుకు తెలిపారు.

చింతాడ ఆనంద్ హిందూ మాదిగ కులానికి చెందినవారని పిట్టలవానిపాలెం మండల తహశీల్దారు కులధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారని, ఆనంద్‌కు ఎస్సీ, ఎస్టీ చట్టం రక్షణను నిరాకరించలేరని వాదించారు. హైకోర్టు దీనిపై స్పందిస్తూ ఫిర్యాదుదారు ఎస్సీ కులధ్రువీకరణ పత్రం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ కులధ్రువీకరణ పత్రాల జారీ చట్టంలోని ఐదో సెక్షన్ కింద సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సిన అంశమని తెలిపింది.

్ఫూర్తికి ప్రతిబింబం

క్రైస్తవంలోకి మారిన తర్వాత కులధ్రువీకరణ పత్రాన్ని రద్దుచేయనంత మాత్రాన ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ లభించదని తేల్చిచెప్పింది. గత ఏడాది రామిరెడ్డిపై అభియోగాలను కొట్టివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ తీర్పు ఇచ్చారు. హైకోర్టు తీర్పును పాస్టర్ చింతాడ ఆనంద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. కానీ హైకోర్టు తీర్పునే సుప్రీం ధర్మాసనం సమర్థించింది.

సెల్వరాణి కేసులో సుప్రీం కోర్టు తీర్పు

నవంబర్, 2024లో సుప్రీం కోర్టు రిజర్వేషన్ ప్రయోజనాల విషయంలో ఇదే తరహా తీర్పు వెలువరించింది. నిజమైన విశ్వాసం లేకుండా కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందేందుకు మతం మారడం రాజ్యాంగాన్ని మోసగించడమేనని, రిజర్వేషన్ల విధానానికి ఇది విరుద్ధమని, రిజర్వేషన్ల లక్ష్యాన్ని అపహాస్యం చేయడమేనని స్పష్టం చేసింది. సెల్వరాణి తండ్రి హిందువు. తల్లి క్రిష్టియన్. పుట్టిన కొన్నాళ్లకే తల్లిదండ్రులు సెల్వరాణికి బాప్టిజం ఇప్పించారు. పుదుచ్చేరిలో అప్పర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసేందుకు తన తండ్రి కులం ప్రకారం ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయించాలని ఆమె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె వినతిని హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ను విచారించిన జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ నవంబర్ 28, 2024న తీర్పునిచ్చింది.

తమిళనాడు హైకోర్టు తీర్పు

"ఒక ఉద్యోగి నిర్దిష్టంగా ఒక కులానికి కేటాయించిన కోటాలో ఉద్యోగం పొంది, ఆ తర్వాత మతం మారితే ఉద్యోగం నుంచి తొలగించాలి. వారికి ఉద్యోగంలో కొనసాగే హక్కు ఉండదు. అలాగే, అపాయింట్‌మెంట్‌కు ముందు మతం మారిన వారికి కూడా సంబంధిత కులం కోటా వర్తించదు" అంటూ జూన్ 6, 2021న తమిళనాడు హైకోర్టు తీర్పు ఇచ్చింది. భారతీయార్ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమ నియామకాలపై విచారణ సందర్భంగా జస్టిస్ ఆర్.మహదేవన్ ఈ తీర్పు వెలువరించారు. తప్పుడు సమాచారం అందించి ఉద్యోగం పొందినవారిని, అనర్హులను ఎంపిక చేసిన విశ్వవిద్యాలయాల కమిటీలపైనా తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. హిందువులలో భాగమైన దళితులు లేదా గిరిజనులు మతం మారి క్రైస్తవం స్వీకరిస్తే 'ఎస్సీ, ఎస్టీ' హోదా కోల్పోతారు. వారిని క్రైస్తవులు గానే పరిగణించాలి. తమిళనాడులో క్రైస్తవులు 'బీసీ-సీ' కేటగిరీలోకి వస్తారు. ఇలాంటి వారికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించదనీ, ఉద్యోగంలో చేరినప్పుడు ఎస్సీగానే ఉన్నప్పటికీ, ఆ తర్వాత మతం మారాననే వాదన కూడా చెల్లదని మద్రాస్ హైకోర్టు తేల్చి చెప్పింది.

మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ గతేడాది జూన్ నెలలో ఒక ముఖ్యమైన తీర్పును ఇచ్చింది. హిందూ మతం, సిక్కుమతం, లేదా బౌద్ధమతం కాకుండా ఇతర మతాలలోకి మారిన వ్యక్తులు భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు (SC) చెందినవారికి లభించే ప్రయోజనాలు లేదా అధికారాలను పొందలేరని తీర్పు చెప్పింది. మత మార్పిడి తర్వాత ఎస్సీ హోదా కోరడం "రాజ్యాంగాన్ని మోసం చేయడమే" అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా తేరూర్



పట్టణ పంచాయతీ చైర్‌పర్సన్ పదవి నుండి వి.అముదరాణిని కోర్టు అనర్హురాలిగా ప్రకటించింది. ఇది ఎస్సీ–రిజర్వుడు పంచాయతీ పదవి కాగా, ఆమె మతం మారిన కారణంగా ఆ పదవి నుంచి తొలగించారు.

దళిత క్రైస్తవ రిజర్వేషన్లు డిమాండ్ చేసేవారి వాదన

ఏ మతాన్ని అనుసరించాలనేది ప్రతి పౌరుని వ్యక్తిగత ఇష్టమనీ, దీనిని ఒక నిర్దిష్ట కులంలో జన్మించడం వల్ల వచ్చే హక్కులతో ముడిపెట్ట కూడదనేది దళిత క్రిష్టియన్ల వాదన. క్రైస్తవం, ఇస్లాం లేదా బౌద్ధం వంటి మతాలకు మారినప్పటికీ, షెడ్యూల్డ్ కులాల వారు ఇప్పటికీ అణచివేతకు గురవుతున్నారనేది సుదీర్ఘ కాలంగా దళిత క్రైస్తవ రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్నవారి వైఖరి. మతం మారి క్రైస్తవం లేదా ఇస్లాంను స్వీకరించిన వారి జీవితాలను సుప్రీం తీర్పు ప్రమాదంలోకి నెట్టేస్తుందని, ఇకపై వారు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద రక్షణ పొందడం కష్టమవుతుందని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నారు. మత విశ్వాసాలు మార్చుకున్నప్పటికీ, కులపరమైన వెనుకబాటుతనం ఉంటుంది కాబట్టి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయడమే సహేతుకమంటారు దళిత క్రిష్టియన్ హక్కుల కార్యకర్తలు.

కమిషన్ ఏర్పాటు

రాజ్యాంగం ప్రకారం, హిందూ మతం వెలుపల ఉన్న ఏ వ్యక్తినీ షెడ్యూల్డ్ కులాల విభాగం కింద పరిగణించరు. ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి మారిన ఎస్సీ, ఎస్టీలను.. షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలా వద్దా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ ఆధ్వర్యంలో 2022లో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. గత నవంబర్‌లో కమిషన్ గడువును పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

క్రైస్తవ జనాభాపై కొరవడిన స్పష్టత

మతం మార్చుకున్న దళిత, గిరిజన జనాభా విషయంలో ప్రభుత్వాలకు స్పష్టత లేదు. మతం మార్చుకున్నప్పటికీ, వారికి ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో జనగణనలో వారంతా కులాల లెక్కింపులో భాగమవుతున్నారు. ఉదాహరణకు మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలో 19 చర్చిలు, 8మంది క్రైస్తవులు ఉన్నారని ప్రభుత్వ లెక్కలు చెపుతున్నాయి. ఒక గ్రామంలో చర్చి నిర్మాణం జరగాలంటే కనీసం 30 క్రైస్తవ కుటుంబాలు ఉండాలి. మరి, ఇక్కడ 19 చర్చిలకు గాను 8 మంది క్రైస్తవులు ఎలా ఉంటారు? ఇప్పటివరకు ప్రభుత్వం వద్ద క్రైస్తవ జనాభా ఎంతో లెక్కలు లేవనడానికి ఈ ఉదాహరణ చాలు.

భారత ప్రజలకేగాక,యావత్ ప్రపంచానికే గొప్ప మార్గదర్శకునిగా నేటికీ నిలిచిన స్వామి వివేకానంద మతమార్పిడిని తిరస్కరించారు. అమెరికా సహా ఎన్నో క్రైస్తవ దేశాలలో పర్యటించిన స్వామి వివేకానందకు అక్కడి క్రైస్తవులు బ్రహ్మరథం పట్టడమేగాక ఎందరో క్రైస్తవులు హిందూ ధర్మ ఔన్నత్యాన్ని గుర్తించి ఆయనకు శిష్యులై భారతదేశానికి వచ్చేశారు. భారతదేశంలో బడుగు, బలహీన వర్గాల వారి విశ్వాసాన్ని పొందిన మాజీ ఉపప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ సమస్యల పరిష్కారానికి మతమార్పిడి ఏ మాత్రం తోడ్పడదని చాలా స్పష్టంగా చెప్పారు. డాక్టర్ అంబేద్కర్ సైతం క్రైస్తవం, ఇస్లాంలను అంగీకరించలేదు. తెలుగునాట గొప్ప సంఘ సంస్కర్తగా పేరొందిన భాగ్యరెడ్డి వర్మ కూడా దళిత వర్గాలు అన్యమతాల స్వీకరణను ప్రోత్సహించలేదు.

భారతదేశంలోని కాశీ, తిరువణ్ణామలై (అరుణాచలం), పాండిచ్చేరి, తిరుమల, కాంచీపురం, మధుర, ఉజ్జయిని వంటి గొప్ప పుణ్యక్షేత్రాలకు ఎందరెందరో విదేశీ క్రైస్తవులు వచ్చి సనాతన హిందూ ధర్మ విలువలు, ధ్యానం వంటివి నేర్చుకుని తరిస్తుంటారు. ఎవరో కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా చేసే తప్పులను మతానికి అంటగట్టి హిందూ మతంపై దురవగాహన ఏర్పరచుకోవడం సరైనదేనా అని ప్రశ్నించుకోవాలి. ఇదొక్కటే కాదు, పోనీ క్రైస్తవంలో వివక్ష లేదా అని ప్రశ్నిస్తే జవాబు చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. అక్కడ కులం, కులవివక్ష లేవని అంటూనే రెడ్డి క్రైస్తవులని, దళిత క్రైస్తవులనే విభేదాలు, వర్గాలు ఎందుకున్నాయో చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. చర్చిలలో రకరకాల వర్గాల గొడవలు కోర్టులకెక్కాయి, దశమభాగాల కోసం పాస్టర్ల తగవుల వీడియోలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. నివారణే లేదని ఇంగ్లీష్ వైద్యం (క్రైస్తవ దేశాల్లో పుట్టిన అలోపతి) స్పష్టం చేసిన రోగాలను సైతం స్వస్థత కూటములలో తగ్గించేస్తున్నట్టు నటించడం చూస్తున్నాం. ఈ 'స్వస్థత' వైద్యం బారిన పడి ఎందరో మరణించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇవిగాక ప్రేయర్ ఆయిల్ అని, మరొకటని వింటూనే ఉన్నాం. అభివృద్ధి చెందిన క్రైస్తవ దేశాలలో శ్వేతజాతి అహంకారం నడుస్తూ అరాచకాలు కొనసాగుతున్నాయి. మరోవైపు క్రైస్తవ దేశాలైన బురుండి, సూడాన్, కాంగో, నైజీరియా, మలవి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ వంటే ఎన్నో దేశాలు దారుణాతి దారుణ పేదరికంతో జాతుల పోరాటాలతో బాధపడుతున్నాయి. ఇవేవీ ఒకనాడు క్రైస్తవ దేశాలు కాదు. క్రైస్తవంలోకి బలవంతంగా మారిన దేశాలు. పోని క్రైస్తవంలోకి మారిన తర్వాత అక్కడ పరిస్థితులు మారాయా అంటే, మరింత దిగజారడం గమనార్హం. ఇవే పరిస్థితులు ఇస్లాంలోనూ చూడవచ్చు. ఈ పరిణామాలను గమనించి ఛత్తీస్‌గఢ్‌లోని వనవాసీ ప్రజలు మేలుకున్నారు. తమ గ్రామాలలోకి క్రైస్తవ మిషనరీల ప్రవేశాన్ని నిషేధిస్తూ, మతమార్పిడి వ్యతిరేక బోర్డులు పెట్టుకున్నారు. అయితే ఈ బోర్డుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ క్రైస్తవ మిషరీలు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. వనవాసీ క్షేత్రాలు, గ్రామాలలో అక్రమ మతమార్పిడి కార్యక్రమాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ ఆర్ఎస్ఎస్ ప్రేరిత సంస్థ వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ విశేష సేవలు చేస్తోంది. కనుక, ఇకనైనా ప్రజలు వాస్తవాలను తెలుసుకుని సనాతన హిందూ ధర్మ విలువలను గ్రహించి ఏది నిజమో తెలుసుకోవాల్సిన అవసరముంది. ★

ప్రశాంత్ జోషి
సీనియర్ జర్నలిస్ట్

వనవాణి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

వనవాణి మాసపత్రిక ఉగాది 2026 ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ 22 మార్చి 2026 భాగ్యనగర్‌లోని ఏబీవీపీ ప్రాంత కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా డాక్టర్ హెచ్‌కె నాగు, వనవాసి కళ్యాణాశ్రమ అఖిలభారత ఉపాధ్యక్షులు, ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్, వనవాసి కల్యాణ ఆశ్రమం అఖిలభారత ప్రచార ప్రముఖ్ ప్రమోద్ పేట్కర్, ప్రధాన వక్తగా ప్రముఖ జర్నలిస్టు కస్తూరి రాకా సుధాకర్ హాజరయ్యారు.

మొదట వనవాణి పత్రిక ప్రచురణకర్త బోనగిరి రామ్ నారాయణ పత్రిక నివేదికను అందిస్తూ, వనవాసి కళ్యాణ ఆశ్రమం ద్వారా తెలుగులో ప్రచురించబడుతున్న మాసపత్రిక 2012 నుండి ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నది. ఈ పత్రిక 2001లో నాలుగు పేజీలతో విశాఖపట్నం నుండి ప్రారంభమై రామ చంద్రయ్య ప్రయత్నంతో, పాఠకుల ప్రోత్సాహంతో, ప్రకటన కర్తల సహకారంతో ప్రస్తుతం 24 పేజీలతో హైదరాబాదు కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 800 గ్రామాలకు పైగా చేరుతున్నదని తెలిపారు. 2026 వనవాణి ప్రత్యేక సంచిక కాచం రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించబడింది.

హెచ్.కె. నాగు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా జరిగే వివిధ కార్యక్రమాలు అందరికి చేరే విధంగా వనవాణి కృషి చేస్తున్నదని, కొన్ని దేశ వ్యతిరేక శక్తులు గిరిజనులను విభజించి, మతం మార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. వనవాసులను ప్రధాన స్రవంతి నుండి వేరు చేసేందుకు ఓఆర్‌పి (ORP) కోడ్ వంటి కుట్ర కూడా జరుగుతున్నదని వివరిస్తూ మతం మారిన గిరిజనులను గిరిజన జాబితా నుండి తొలగించాలని (డి-లిస్టింగ్), ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని వనవాసి కళ్యాణాశ్రమం చేపట్టిందన్నారు.

ముఖ్య అతిథి కాచం రమేష్ మాట్లాడుతూ గిరిజన క్షేత్రంలో పనిచేయడం కష్టతరమైనదన్నారు. కేవలం జనులను సమీకరించడమే గాక వనవాసి క్షేత్రంలో అనేక రంగాలలో విస్తరించిన పనిని వనవాణి ద్వారా ప్రచారం చేస్తున్నారని ప్రశంసించారు. అనేక అసత్య ప్రచారాలు భ్రమలను, ఆర్య-ద్రవిడ సిద్ధాంతం లాగానే వనవాసుల భారతవాసులు కాదనే ప్రచారం జరుగుతోందన్నారు. వనవాసి కళ్యాణాశ్రమం ద్వారా వనవాణి మాస పత్రికను విరామం లేకుండా నడపటం అభినందించదగిన విషయమంటూ వనవాసి బాలికలు, మహిళలు, యువకులను వ్యసనాలకు బానిసగా మార్చే ప్రయత్నం కొన్ని ప్రాంతాలలో విశేషంగా జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మాన్ని నిలబెట్ట గలిగే క్షేత్రం వనవాసి క్షేత్రమని పేర్కొంటూ గోండు లిపిలోనూ పత్రికను ప్రచురించే ప్రయత్నం చేయ గలగాలని కాచం రమేష్ ఆకాక్షించారు. గోండ్ భాషలోకి అనువదించిన రామాయణం ప్రభావం గోండ్ సమాజంలో చాల ఉన్నదన్నారు.

వనవాసీ కళ్యాణ ఆశ్రమం అఖిలభారత ప్రచార ప్రముఖ్ ప్రమోద్ పేట్కర్ మాట్లాడుతూ దేశంలో వనవాసి కళ్యాణాశ్రమం ద్వారా 15 భాషల్లో పత్రికలు నడుస్తున్నవని తెలిపారు. పత్రిక చదివే వారి సంఖ్య తక్కువగా ఉన్నదంటూ సోషల్ మీడియాలో చాలా మంది ప్రావీణ్యం సంపాదిస్తున్నారని పేర్కొ న్నారు. అయితే, పత్రిక చదవడంలో ఉన్న ఆనందం సోషల్ మీడియాలో లేదని స్పష్టం చేశారు. గిరిజన క్షేత్రంలో కళ్యాణాశ్రమం చేస్తున్న కృషి, శ్రమ విశేషమైనదని తెలియజేస్తూ వనవాసి కళ్యాణాశ్రమం చేస్తున్న పనిని ఎక్కువమంది చదివి ప్రచారం చేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమని తాము రక్షించుకోవడానికి గిరిజన సమాజం ముందుకు వచ్చి దృఢంగా ప్రగతి పథంలో నడవాలని ముగించారు.

ముఖ్య వక్త రాకా సుధాకర్ మాట్లాడుతూ వనవాసుల గురించి తెలుసుకోవాలనుకునేవాళ్లకి, గిరిజనుల పట్ల అభిమానం ఉన్న వాళ్లకి ఈ ప్రత్యేక సంచిక చాల ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా గిరిజన సమాజంపై అధ్యయనానికి ఈ వ్యాసాలు ఉపయోగపడతాయని కొనియాడారు. వనవాసుల ముందున్న సమస్య కేవలం ఒక వనవాసి సమాజానిదే కాదని, యావత్ భారత దేశ సమస్య అని సుధాకర్ స్పష్టం చేశారు. కేవలం ఇది ఐదు అంశాల ఫార్ములా ఆధారంగా నడుస్తున్నదన్నారు. ఈ 5 అంశాల ఫార్ములాతో హిందూ సమాజం నుంచి వనవాసులను వేరు చేయడానికి 250 ఏళ్ల క్రితమే కుట్ర ప్రారంభమైందన్నారు. వీటిలో మొదటిది క్రియేట్ ఏ మైనారిటీ.. గివ్ ఇట్ ఏ నేషనాలిటీ.. మేక్ ఇట్ మిలిటెంట్, డివైడ్ ద కంట్రీ, రూల్ ది వరల్డ్... అని వివరించారు. ఆంగ్లేయులు, వామపక్ష వాదులు 'గిరిజనులు మూలవాసులు భారతీయులు కాదు' అనే దుష్ప్రచారం చాల ఏళ్లుగా చేస్తూనే ఉన్నారంటూ గిరిజన సమాజ దైవారాధన పద్ధతులు, హిందూ సమాజం దైవారాధన పోలికలు తదితర అనేక విషయాల గురించి కూలంకషంగా వివరించారు.

తరువాత తరుణ్ చక్రవర్తి అనువదించిన "వలస పాలనలో జనగణన పరిణామాలు... ప్రత్యేక మతాల కోసం పెరుగుతున్న ఆందోళన" అన్న పుస్తకాన్ని హెచ్.కె. నాగు ఆవిష్కరించారు. రచయిత ఓఆర్‌పి కోడ్‌కు సంబంధించిన విషయాలను చక్కగా వివరించారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులు 200 మంది పాల్గొని ఆవిష్కరణ సభను విజయవంతం కావించారు. ★

కథ

"అమ్మా" అంటూ వచ్చి గదిలో ఉన్న తల్లిని ప్రేమగా చుట్టేశాడు వర్ధన్.

చిరునవ్వు నవ్వి "థాంక్యూ నాన్నా" అన్నది విశాలాక్షి.

"నేను ఏమి చెప్పకముందే అలా అంటున్నా వేమిటమ్మా" అడిగాడు వర్ధన్.

"ప్రతి సంవత్సరము ఈరోజున నువ్వు వచ్చి చెప్పేది మాతృదినోత్సవ శుభాకాంక్షలే కదురా. అందుకే ముందుగానే ధన్యవాదాలు చెప్పాను" విశాలాక్షి మాటల్లో నిర్లిప్తత.

"మా అమ్మ జీనియస్.. హృదయపూర్వక మాతృదినోత్సవ శుభాకాంక్షలు అమ్మా. ఇదిగో నీకు ఇష్టమని సోంపాపడ్ తెచ్చాను" అంటూ తాను తెచ్చిన సోంపాపడ్ తీసి తల్లి నోటికి అందించాడు వర్ధన్.

కొడుకు పెట్టిన స్వీటు తీసుకున్నది విశాలాక్షి.

"అత్తయ్యా..నాకు, ఆయనకు, బాబుకు బాక్సు పెట్టుకున్నాను. మిగిలినవన్నీ టేబుల్ మీద పెట్టాను. మధ్యాహ్నం పెట్టుకు తినండి. మేము సాయంత్రం రావడం ఆలస్యం కావచ్చు..మా కోసం చూడకుండా మీరు తినెయ్యండి. రండి..బాబును దించేసి మనం ఆఫీసులకు వెళదాం" అని బాణంలా వచ్చి తాను చెప్పాల్సినది చెప్పి, బయలుదేరుతున్న కోడలు విశదను అనుసరించాడు కొడుకు వర్ధన్.

విశాలాక్షి పెదవులపై పేలవమైన నవ్వు మెరిసింది.

పుట్టినప్పటినుంచి ఇప్పటివరకు ఆమె జీవిత మేమిటో ఆమెకే అర్థం కావడం లేదు. "బతుకు తున్నాను..నాదొక బతుకటంచు" అన్న చందాన కాలం వెళ్లదీస్తున్నది. ఆమెకు ఊహ తెలిసినప్పటి నుంచి నేటివరకు తన జీవితం ఎన్ని మార్పులకు లోనయిందో తెరమీద బొమ్మల్లా కనుల ముందు కదలాడేసరికి తలంతా దిమ్మెక్కి మంచంమీద వాలిపోయింది. ఇది ఆమెకు క్రొత్తేమి కాదు. అప్పుడప్పుడు ఇలా జరుగుతూనే ఉంటుంది.

* * *

విశాలాక్షికి అన్ని పరీక్షలు నిర్వహించిన డాక్టరుగారు, శారీరకంగా ఆమెలో వయసుతోపాటు వచ్చే బలహీనతలు తప్ప ఎటువంటి వ్యాధులు లేవని, ఆమెది మానసిక రుగ్మతే తప్ప, శారీరక రుగ్మత కాదని ధ్రువీకరించారు. తల్లి అంతగా మధన పడడానికి కారణం అర్థంకాని వర్ధన్ ఆమెను విశద చిన్ననాటి స్నేహితురాలైన మానసిక వైద్యనిపుణురాలు డాక్టర్ వైదేహి దగ్గరకు తీసుకువచ్చాడు.

''వైదేహి.. మా అత్తగారు ఉన్నట్టుండి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోతారు. అరగంటసేపు మనలోకంలోకి రారు. మేము గమనించకపోతే ఒక్కొక్కసారి అయిదారుగంటలైనా అలానే ఉండి పోతారు. మేము ఇద్దరం ఉద్యోగస్థులం కావడంతో ఆమె గురించి మాకు దిగులుగా ఉంటున్నది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా కూడా ఉన్నది" చెప్పింది విశద.

"అవునండి.. ఆమెకు కావలసినవన్ని సమకూరు స్తున్నా, ఆమె ఏదో కోల్పోయినట్లుగా ఉంటున్నది. ఏదైనా అనారోగ్యమేమోనని డాక్టరుకు చూపించి, అన్నిరకాల టెస్టులు చేయించాం. ఆమెకు అనారోగ్యమేది లేదని, మానసికంగా చెప్పలేని బాధతో ఉన్నదని డాక్టర్లు చెప్పారు. మీరైతే తెలిసినవారని, కొంచెం శ్రద్ధచూపి, ఆమె స్థితికి కారణం తెలుసుకోగలరని వచ్చాము. అమ్మను లోపలికి తీసుకు రమ్మంటారా" ప్రాధేయపూర్వకంగా అడిగాడు వర్ధన్.

"చూడు విశద..మీ అత్తగారి గురించి మీరేమి దిగులువడకండి. ఆమె ఎందుకు బాధగా



ఉంటున్నదో, ఎందువలన ఆమెకు అచేతనావస్థ ఏర్పడుతున్నదో కనుక్కుంటాను. మీరు నిశ్చింతగా ఉండండి. ఆమెను ఆసుపత్రిలో కొంతకాలం ఉంచండి. నేనుకూడ కొన్ని పరీక్షలు చేయాలి. ఆమెతో నేను ముఖాముఖి మాట్లాడాలి. మీరు ఇక్కడే ఉంటే ఆమె మనసువిప్పి మాట్లాడలేక పోవచ్చు. అందుకని ఆమెను ఇక్కడ వదిలేసి మీరు వెళ్లండి" అని వైదేహి చెప్పడంతో, విశాలాక్షిని ఆసుపత్రిలో వెళ్లిపోయారు వర్ధన్ దంపతులు.

"యామిని..హాలులో విశాలాక్షిగారు ఉంటారు. ఆమెను తీసుకెళ్లి ప్రయోగశాలలో పరీక్షలు చేయించు. తరువాత పాలు ఇచ్చి కొంచెంసేపు విశ్రాంతి తీసుకోమను. నేను ఇంటికివెళ్లి గంటలో వస్తాను. వచ్చాక ఆమెతో మాట్లాడతాను" అని పరీక్షల జాబితాను రాసి యామినికిచ్చి వెళ్ళింది వైదేహి.

* * *

"అమ్మా.. భోజనం చేశావా?" తల్లి గదిలోకి వచ్చి అడిగింది వైదేహి.

ఎటో శూన్యంలోకి చూస్తున్న రేణుక ఆమెకు సమాధానం చెప్పలేదు. మరల అదేమాట అడిగింది వైదేహి.

"ఆ..తిన్నాను" ఉలిక్కిపడి చెప్పింది రేణుక.

"ఏమిటి అంత పరధ్యానంగా ఉన్నావు"

"ఏమిలేదు"

"పర్వాలేదు చెప్పమ్మా. తోచడంలేదా..టి.వి పెట్టనా?"

"వద్దు"

"మరెందుకలా ఎప్పుడు ఏదో ఆలోచనలో ఉంటావు. ఏదో పోగొట్టుకున్న దానిలా దిగులుగా కనిపిస్తావు"

మాట్లాడలేదు రేణుక.

"పార్వతి నిన్ను బాగానే చూసుకుంటోందా.. ఏమైనా ఇబ్బందిపెడుతోందా"

"బాగానే చూసుకుంటుంది"

"పార్వతి.. ఇలారా"

"వస్తున్నానమ్మా" అంటూ వచ్చింది పనిమనిషి పార్వతి.

"అమ్మకు అన్నీ సమయానికి అందిస్తున్నావు కదా. మధ్యాహ్నం ఆకలనిపిస్తున్నదేమో..స్నాక్స్ చేసిపెట్టు. తోచలేదంటే టి.వి పెట్టు"

"అలాగే అమ్మగారు"

"సరే.. వెళ్లు" అని పార్వతిని పంపి, "సరేనమ్మా.. నేను ఆసుపత్రికి వెళ్లాలి.నీకేదైనా కావాలంటే పార్వతిని అడుగు" అని వెళ్లెబోతూతల్లి ప్రక్కనవున్న డైరీని చూసింది.

"ఏమిటమ్మా ఆ డైరీ?" అడిగింది వైదేహి.

ఆమాట వినగానే గతుక్కుమన్నది రేణుక. డైరీని తలగడ క్రిందకునెడుతూ, "ఏమిలేదే.. అందులో అన్నమయ్య కీర్తనలు రాసి ఉన్నాయి. తోచనప్పుడు అవి చదువుకుంటుంటాను..అంతే" అన్నది తడబడుతూ.

"సరే...నేను వెళ్లొస్తాను" అని వెళ్లింది వైదేహి.


ఆమెకూడ మనిషే
శింగరాజు శ్రీనివాసరావు

కూతురు ఎక్కడ డైరీ చూస్తుందోనని భయపడిన రేణుక, వైదేహి ఆ విషయాన్ని పట్టించుకోకుండా వెళ్లడంతో ఊపిరి పీల్చుకుంది.

డైరీని తెరిచి ఒకసారి చూసుకుని అందులో ఏదో రాసి మరల తలగడ క్రింద పెట్టుకుని పడుకుంది. నిదురకు దూరమైన ఆమె కళ్లు నీటి బిందువులను మోయసాగాయి.

* * *

"మీరు శారీరకంగా చాలా దృఢంగా ఉన్నారని రిపోర్టులు చెబుతున్నాయి. కానీ మీరు అప్పుడప్పుడు ఏదో లోకంలోకి వెళ్లిపోయి స్తబ్దతలో ఉంటూ అచేతనంగా తయారవుతున్నారు. అంటే మానసికంగా మీరేదో చెప్పలేని బాధను అనుభవిస్తున్నారు. అవునా?" విశాలాక్షిని అడిగింది వైదేహి.

మాట్లాడకుండా తలవంచుకుంది విశాలాక్షి.

"మీ కొడుకు, కోడలు వలన మీకు ఏమైనా ఇబ్బంది ఎదురవుతున్నదా?"

"లేదు. వాళ్లు నన్ను బాగానే చూసుకుంటున్నారు"

అందరూ నన్ను వాళ్లకు అనుకూలంగా ఉండాలనుకుంటున్నారు తప్ప, 'నేనుకూడ మనిషినే..' అన్న స్పృహ ఎవరికీ కలగడం లేదు. చిన్నతనంలో తల్లిదండ్రులు వాళ్లకు నచ్చిన రీతిలో ప్రవర్తించారు. పుట్టింటిగౌరవం కోసం తలవంచాను. ఇంటికిదీపం ఇల్లాలని మాయచేసి మెట్టినింటివారు నా కోరికలకు కొరత వేశారు. నన్ను దేవతను చేసి పిల్లలు వాళ్ల అవసరాలు తీర్చుకున్నారు. నాకంటూ గుర్తింపులేక, స్వతంత్రంలేక, ఆశలకు, ఆశయాలకు ఉరివేసి బ్రతుకుతున్నాను.

"మీ భర్తగారిని మర్చిపోలేక పోతున్నారా?"

"నా మీద అంత ప్రేమ ఆయన ఏనాడు చూపించలేదు"

"పోనీ..మీ పిల్లలు మీతో గడపలేక పోతున్నారని బాధపడుతున్నారా?"

"వాళ్ల ఉద్యోగాలతో వాళ్లు సతమతమవుతున్నారు. నాతో గడపలేరని నేనెలా అనుకుంటాను"

"మరి మీ మానసిక అనారోగ్యానికి కారణం ఏమిటి? మీరు లోలోపల దేని గురించైనా బాధపడుతున్నారా.. మొహమాటం లేకుండా చెప్పండి. మనోవేదనకు మందులేదు అంటారు. మీ వేదనకు కారణమేమిటో చెప్పండి. దానికి పరిష్కారం నేను ఆలోచిస్తాను"

"అందరూ నన్ను వాళ్లకు అనుకూలంగా ఉండాలనుకుంటున్నారు తప్ప, 'నేనుకూడ మనిషినే..' అన్న స్పృహ ఎవరికీ కలగడం లేదు. చిన్నతనంలో తల్లిదండ్రులు వాళ్లకు నచ్చిన రీతిలో ప్రవర్తించారు. పుట్టింటిగౌరవం కోసం తలవంచాను. ఇంటికిదీపం ఇల్లాలని మాయచేసి మెట్టినింటివారు నా కోరికలకు కొరత వేశారు. నన్ను దేవతను చేసి పిల్లలు వాళ్ల అవసరాలు తీర్చుకున్నారు. నాకంటూ గుర్తింపులేక, స్వతంత్రంలేక, ఆశలకు, ఆశయాలకు ఉరివేసి బ్రతుకుతున్నాను. నన్ను ఎవరూ ఒక మనిషిగా గుర్తించడం లేదు, నా వ్యక్తిత్వానికి ఎవరూ విలువను ఇవ్వడం లేదు. గదిలో మంచంవేసి, సమయానికి అంత ముద్ద విసిరేసి తమ బాధ్యత నెరవేర్చామనుకుంటున్నారు తప్ప, తల్లికూడ ఒక మనిషేనని, తనకు కొన్ని ఆశలు, ఆలోచనలు ఉంటాయని ఎవరూ అనుకోవడం లేదు. అది తలచుకున్నపుడల్లా మెదడు మొద్దుబారి పోతుంది. తీవ్రమైన మనోవ్యధతో తల బరువెక్కిపోతుంది. నా మూగబాధను అర్థం చేసుకునే వ్యక్తులే లేరని హృదయం బరువెక్కుతుంది" చెప్పి కళ్లు మూసు కుంది విశాలాక్షి. ఆమె కనులనుండి నీటిబిందువొకటి జారి చెక్కిలిని తాకింది.

ఆమె మాటలలో వేదన విన్న తరువాత ఆమె మనోవ్యథ ఏమిటో అర్థమయింది వైదేహికి. విశాలాక్షికి చిన్నతనం నుంచి ఏదో ఒక వ్యాపకం మీద మనసు ఉండి ఉంటుంది. దాన్ని ఆమోదించే వారు లేక మానసికవ్యధను అనుభవిస్తున్నది. ఇక ఎక్కువగా ఆమెను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఆమెను గదిలోకి పంపింది.

* * *

"చూడు విశద.. ఇది చాలామంది మహిళలలో కనిపించే వ్యాధికాని వ్యాధి. ఒక స్త్రీ తల్లిగా మారడం శారీరకమార్పే కాదు..ఒక న్యూరో సైకలాజికల్ పరిణామం. దీనివలన హార్మోనులలో మార్పులు సంభవించడంతో పాటు ప్రసవానంతర డిప్రెషనుకు చాలా మంది తల్లులు గురయ్యే ప్రమాదం ఉంది. దీనివలన పిల్లల పట్ల విపరీతమైన ఆనందం, బంధం, భావోద్వేగాలు ఏర్పడుతాయి. దీనివలన పిల్లలతో విపరీతమైన అటాచ్‌మెంటును పెంచుకోవడం జరుగుతుంది. వీరే మధ్యవయసుకు వచ్చిన తరువాత కుటుంబ భారాన్ని మొత్తం తమపై వేసుకుని, తాము లేనిదే కుటుంబమే లేదనే దశకు చేరుకుంటారు. దీన్నే సంచిత ఒత్తిడి లేదా క్యుములేటివ్ స్ట్రెస్ అంటారు. అప్పుడు వీరు తమతోటి కుటుంబసభ్యుల నుంచి సహకారాన్ని కోరుకుంటారు. అది లభించని పక్షంలో డిప్రెషనుకు లోనవుతారు. అక్కడే కొంత వ్యాధి తీవ్రత అధికమవుతుంది. పిల్లలకు పెళ్లిళ్లయిన తరువాత, వారు వారి జీవితభాగస్వాములతో ఎక్కువకాలం గడవ వలసి వస్తుంది. అప్పుడు వీరిలో ఒంటరితనపు వేదన అధికంకావడంతో పాటు 'ఇక నా అవసరం ఎవరికీ లేదు' అన్న ఆలోచన ఉత్పన్నమవుతుంది. కట్టుకున్న తోడు కాలంచేసి పిల్లల పంచన చేరినపుడు, వారికి గతం గుర్తుకు వచ్చిన పుడల్లా.. 'నేను అందరికీ అన్నీచేశాను. కానీ నా అవసరానికి ఎవరూ రారు. నన్నొక మనిషిగా కూడ గుర్తించరు' అన్న ఆత్మన్యూనత ఎక్కువవుతుంది. 'ఎవరు లేని ఒంటరిని' అన్న భావన పెరిగి అది మానసిక రుగ్మతకు దారితీస్తుంది. అప్పుడు పిల్లలు వారితో ఎక్కువకాలం గడపాలి. వారికి ఇష్టమైన వ్యాపకాన్ని గుర్తించి అటువైపుగా వారిని ప్రోత్సహిస్తూ దానికి అనువైన పరిస్థితులను కల్పించాలి. అప్పుడు వారు కుటుంబ బాధ్యతలవల్ల ఎటువంటి అవకాశాలను కోల్పోయారో, వాటిని ఇప్పుడు అందిపుచ్చుకోవడం వల్ల, ఆ పనిలో నిమగ్నమైపోయి, ఒంటరితనాన్ని పూర్తిగా మర్చిపోయి ఆనందంగా గడపగలుగుతారు. తల్లిని సూపర్ ఉమన్‌గా చూడడమే కాదు, ఆమె కూడా మ నిషేనని గుర్తించి, ఆమెను విమర్శించకుండా, తనకు తానుగా బ్రతికే హక్కు ఆమెకు ఉన్నదనే అవగాహన కల్పించాలి. అప్పుడే వాళ్లు డిప్రెషన్ నుంచి బయట పడి హుషారుగా, ఆరోగ్యంగా ఉండ గలుగుతారు. ఇప్పుడు విశాలాక్షి గారు అదే ఒత్తిడిలో ఉన్నారు. ఆమెకు ఎటువంటి వ్యాపకం ఇష్టమో గుర్తించి, ఆమెను అందులో నిమగ్నమయేలా చూడండి. ఒత్తిడి తగ్గడానికి కొన్ని మందులు రాసిస్తాను, వాడండి. ఆమెతో రోజుకు ఒక గంటసేవయినా గడుపుతూ, ఆమెలోని కోరికలను గుర్తించండి. నీకు తోడుగా మేమున్నామనే భరోసాను ఆమెకు కల్పించండి. నిజం చెప్పాలంటే, ఆమె ఆరోగ్యం మీ చేతులలో.." అని నవ్వింది డాక్టర్ వైదేహి.

"థాంక్యూ వైదేహి. తప్పుమాదే. ఆమెకు తిండి, నిద్ర చాలనుకున్నామే తప్ప, ఆమెలోని మనిషిని గుర్తించలేకపోయాము. మాకళ్లు తెరిపించావు. అత్తయ్యను డిశ్చార్జిచేస్తే మాతోపాటు తీసుకు వెళతాము" అన్నది విశద.

"ధన్యవాదములు డాక్టరుగారు..మా కర్తవ్యాన్ని గుర్తుచేశారు" అని నమస్కరించాడు వర్ధన్.

"డాక్టరుగా అది నా బాధ్యత" అన్నది వైదేహి.

* * *

కారులో ఇంటికి వెళుతున్న వైదేహికి తల్లి రేణుక గుర్తుకు వచ్చింది. బహుశ తన తల్లికూడ ఇటువంటి మానసికరుగ్మతనే అనుభవిస్తున్నదా? అందుకే తనతో ముభావంగా ఉంటున్నదా? ఇంతవరకు ఆమెకు విశాలాక్షి కేసువంటి కేసు తారసపడకపోవడంవల్ల తల్లి విషయంలో అటువంటి ఆలోచన రాలేదు. మనసుపెట్టి ఆలోచిస్తే తల్లిపట్ల తను చూపుతున్న

నిర్లక్ష్యం గుర్తుకురాసాగింది వైదేహికి. అత్తగారి విషయంలో విశద ప్రవర్తనకు, తల్లి విషయంలో తన ప్రవర్తనకు పెద్ద తేడా కనిపించలేదు. ఉదయం ఆసుపత్రికి వెళుతూ, 'అమ్మా..టిఫిను చేశావా. పదకొండింటికి పార్వతి జ్యూసు ఇస్తుంది తాగు. ఆసుపత్రికి వెళ్లొస్తా' అని చెప్పడం, మధ్యాహ్నం 'భోజనం చేశావా' అని, సాయంత్రం వెళ్లగానే అలిసిపోయి పడుకోవడం తప్ప, తను తల్లితో గడుపుతున్న సమయం ఎపుడు?.. తనతీరు గుర్తుకు రాగానే తన తప్పు తెలిసివచ్చి ఆమె కళ్లుచెమర్చాయి. 'పొత్తిళ్ల బిడ్డ పెదవులకు స్తన్యాన్ని అందించి తొలి ఆకలి తీర్చిన తల్లిని, పసిపాదాలు గుండెలపై కాళిందినృత్యం చేస్తుంటే పులకించి పోయిన తల్లిని, వయసుమళ్లిన వేళ ఒక బాధ్యతగా మోస్తున్నామేతప్ప, మనిషిగా చూడడమే లేదు. తప్పు చేస్తున్నాము.. సరిదిద్దుకోలేని తప్పు చేస్తున్నాము. అందరిలా నేను చేస్తున్నాను. దిద్దుకోవాలి.. తప్పును ఇకనైనా దిద్దుకోవాలని' అనుకుంటూ ఇల్లు చేరుకుంది వైదేహి. కారుదిగి నేరుగా తల్లి గదిలోకి వెళ్ళింది. అక్కడ రేణుక లేదు. తలగడ దగ్గర డైరీ కనిపించింది. తెరవ కూడదని అనుకుంటూనే తెరిచి చూసింది. ముత్యాల వంటి అక్షరాలతో చిన్న కవితలు కనిపించాయి.

"వార్ధక్యము వరము కాదు.. శాపము కాదు
వైరాగ్యాన్ని మోసుకు తిరిగే ఒంటరితనం"

"నేనిప్పుడొక తోక తెగిన గాలిపటాన్ని
ముళ్లమధ్య కాకుండా, నాలుగు గోడలమధ్య ఉంటున్నాను"

చదువుతుండగా తలుపుతీసిన చప్పుడయింది. డైరీని మూసి తిరిగి అక్కడే పెట్టి హాలులోకి వెళ్లింది. రేణుక ఎదురయింది.

"అన్నం తిన్నావా అమ్మా" అడిగింది వైదేహి.

"తిన్నానమ్మా..నువ్వుకూడ తిని పడుకో"

"లేదమ్మా.. నువ్వుకూడ నాతో రా.. నీతో మాట్లాడుతూ తింటాను"

"బాగా అలిసిపోయి ఉంటావు. తిని పడుకో తల్లి. రేపు మాట్లాడుకుందాములే"

"లేదమ్మా..నీతో మాట్లాడుతూ తింటాను" అని తల్లి చెయ్యి పట్టుకుని డైనింగు టేబుల్ వద్దకు తీసుకువెళ్లింది. భోజనం చేస్తున్నంతసేపు తల్లితో నవ్వుతూ, తుళ్లుతూ మాట్లాడుతూనే ఉన్నది వైదేహి. కూతురు అలా మనసువిప్పి మాట్లాడుతుంటే రేణుక కళ్లకు స్కూలు రోజులలో ఆమె పెట్టే ముద్దలు తింటూ, క్లాసులో విషయాలన్ని పూసగుచ్చినట్లు చెప్పే పసి వైదేహి జ్ఞాపకానికి వచ్చింది. ఆమె మనసు ఆనందంతో పురివిప్పింది. రాత్రి తల్లి ప్రక్కనే పడుకుంది వైదేహి.

ఆరోజు నుంచి ఇంటికి రాగానే తల్లితో ఎక్కువసేపు కాలక్షేపం చేస్తూ, ఆమె మనసులోని భావాలను తెలుసుకునే ప్రయత్నం చేయసాగింది వైదేహి.

"లేదమ్మా.. నీతో మాట్లాడుతూ తింటాను" అని తల్లి చెయ్యి పట్టుకుని డైనింగు టేబుల్ వద్దకు తీసుకువెళ్లింది. భోజనం చేస్తున్నంతసేపు తల్లితో నవ్వుతూ, తుళ్లుతూ మాట్లాడుతూనే ఉన్నది వైదేహి. కూతురు అలా మనసువిప్పి మాట్లాడుతుంటే రేణుక కళ్లకు స్కూలు రోజులలో ఆమె పెట్టే ముద్దలు తింటూ, క్లాసులో విషయాలన్ని పూసగుచ్చినట్లు చెప్పే పసి వైదేహి జ్ఞాపకానికి వచ్చింది. ఆమె మనసు ఆనందంతో పురివిప్పింది. రాత్రి తల్లి ప్రక్కనే పడుకుంది వైదేహి.

* * *

"వైదేహి..నీకు చాలా రుణపడిపోయానే నేను. నీ సలహా పాటించి అత్తగారి విషయంలో మేము పద్ధతి మార్చుకున్నాము. తల్లిగా తనకు బాధ్యతలే తప్ప ఆశలు, ఆశయాలు ఉండవన్న భ్రమలో నుంచి బయటకు వచ్చాము. ఇప్పుడు మేమంతా కలిసే భోజనం చేస్తున్నాము. మేము ఎక్కడికివెళ్లినా ఆమెను తీసుకునే వెళుతున్నాము. ఇప్పుడు ఆమెలో చాలా మార్పు వచ్చింది. ఆమె మనసులో మాటను చెప్పింది. తనకు సంగీతమంటే ఇష్టమని, చిన్నత నంలో కుటుంబ బాధ్యతల వల్ల అది వీలుకాలేదట. అది తెలుసుకుని మాకు పరిచయమున్న సంగీత మాస్టారుతో మాట్లాడి, ఇంటికివచ్చి ఆమెకు సంగీతం నేర్పే ఏర్పాటు చేశాము. ఇప్పుడామె చాలా సంతోషంగా ఉన్నారు. మాలో ఒకరుగా కలిసి పోయింది. ఇదంతా నీ ట్రీట్మెంట్ మహత్యమే వైదేహి" ఆనందంతో చెప్పింది విశద.

"అందుకే డాక్టర్..వచ్చే మాతృదినోత్సవానికి అమ్మకు శుభాకాంక్షలతో పాటు వీణను బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నాము" చెప్పాడు వర్ధన్.

"మంచి నిర్ణయం తీసుకున్నారు. 'సంతోషం.. సగం బలం' అని పెద్దలు ఎంతో అనుభవంతో చెప్పారు. కళలకు సంబంధించిన వ్యాపకాలు ఆనందంతోపాటు ఆరోగ్యాన్ని కూడ ఇస్తాయి. ఇక విశాలాక్షిగారిని ఏ అనారోగ్యము దరిచేరదు.." అని వారికి అభినందనలు తెలిపింది. ఆమెకు మరొకసారి ధన్యవాదములు తెలిపి వెళ్లి పోయారు వర్ధన్ దంపతులు.

ఆలోచనలోపడింది వైదేహి. విశదలా తనుకూడ తల్లికి బహుమతిగా ఏదైనాయిస్తే.. వెంటనే ఆమె మెదడులో మెరుపు మెరిసింది. తన తల్లి రాసిన కవితలను సంపుటిగా ముద్రించి ఇస్తే, ఆమె అక్షరాలకు శాశ్వతరూపాన్ని ఇచ్చినట్లు ఉంటుంది. అవును.. అదే సరియైనది. ఒక కవికిగాని, కథకునికి గాని, తన రచనలను పుస్తకరూపంలో చూసుకుంటే వచ్చే ఆనందం అంతాయింతా కాదని చాలాచోట్ల విన్నది. కానీ విషయం అమ్మకు తెలియ కుండా చూడాలి. ఆమె కవితలను చదవాలనిచెప్పి తీసుకుని వాటిని ముద్రణకు ఇవ్వాలి. ఆ పుస్తకాన్ని మాతృదినోత్సవం రోజున తల్లికి బహుమతిగా ఇచ్చి ఆమె ముఖంలో తొణికిసలాడే ఆనందతరంగాలను చూసి మురిసిపోవాలి. అమ్మలో బాధ్యతలను మోసే తల్లినేకాదు, హక్కులను కాపాడుకోవాలనుకునే మనిషిని కూడ గుర్తించానని ఆమె తెలుసుకోవాలి. 'నీ కడుపున ననుమోసి, నాకొక ఉనికిని ఇచ్చిన నీకు కూడ నేను ఉనికిని ఇస్తానమ్మా. ఒక రచయిత్రిగా నిన్ను లోకానికి పరిచయం చేస్తాను. ఇలాగైనా తల్లి రుణం కొంతైనా తీర్చుకుంటాను' అనుకుంటూ సంతోషం మనసున ఎగిసిపడుతుంటే, కారు దిగి తల్లి పరిష్వంగంలో కరిగిపోవాలని ఆమె గదిలోకి పరుగెత్తింది వైదేహి. ★



వేసవి సెలవులు విజ్ఞాన వినోదాలకు నెలవులు

వార్షిక పరీక్షలు పూర్తి అయిన తర్వాత విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల కోసం విద్యార్థిలోకం ఎంతగానో ఎదురు చూస్తుంటుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే సుమారు రెండు మాసాల సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి. ఊపిరాడనంతగా యాంత్రిక జీవనం గడిపిన విద్యార్థుల విద్యాలయ దినచర్యకు దూరంగా కొన్ని వారాల పాటు విశ్రాంతి, వినోద విరామాలు పొందుతూ తమకు నచ్చిన కార్యక్రమాలలో పాలు పంచుకొనేందుకు ఉవ్విళ్లూరుతూ ఉంటారు. తమకు నచ్చిన రీతిలో వేసవి సెలవులు గడపడానికి పిల్లలు పథకాలు వేస్తూ ఉంటారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడి తమ అభిరుచులు, ఆసక్తి కలిగిన పనులు, ఆటపాటలు, ఆన్‌లైన్‌లో మునకలు, సినిమాలు, పర్యాటక ప్రయాణాలు, క్రీడా ప్రాంగణా లకు పరుగులు, అమ్మచేతి వంట రుచులు, దర్శనీయ స్థలాల పయనాలు, వినోద విజ్ఞాన వేదికలు, ఆరోగ్యం కాపాడుకునే కార్యాలు, మానసిక ఉల్లాస విందులు, సృజన/విలక్షణ ఆలోచనలు, తమకు నచ్చిన ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణల కోరికలు లాంటి అనేక ప్రణాళికలను నిజం చేసుకునే సమయంగా వేసవి సెలవులు ఉపకరిస్తాయి.

అవసరం మేరకు నిద్ర పోవడం, మెదడు చురుదనం పెంచడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. నచ్చిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగి తేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/జూ/సర్కస్/ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం, నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ తరగతులకు హాజరుకావడం లాంటివి మంచి నిర్ణయాలు. కొత్త ప్రదేశాలు, ప్రకృతి సహజ అందాల ఆస్వాదనలు, ప్రకృతిలో దాగిన అద్భుతాల ఆవిష్కరణలు, ఈత నేర్చుకోవడం, సైక్లింగ్ లేదా బైక్ నేర్చుకోవడం, మనకు నచ్చిన అభిరుచులను పెంచి పోషించుకోవడం, కుటుంబ సభ్యులతో సరదాగా గడపడం, సామాజిక సంబంధాలను పటిష్ట పరుచుకోవడం, మానవ సంబంధాలను పెంచుకోవడం, సహకార భావనలతో పది మందితో కలిసి పని చేయడం లాంటి పలు కార్యక్రమాలకు వేసవి సెలవులు నెలవులు కావాలి. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం లేదా హాజరు కావడం, వేసవిలో పార్ట్‌టైమ్ విద్య సంబంధ ఉద్యోగాలు చేయడం, ప్రయాణాలు చేస్తూ వినోద విజ్ఞానాలను పెంచుకోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో గడపడం లాంటివి పిల్లల వ్యక్తిత్వాలను, అవగాహన శక్తులను మెరుగు పరుచుతాయి.

ఆధునిక డిజిటల్ యుగంలో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం లేదా నూతన నైపుణ్యాలను అవగాహన చేసుకోవడం, సంగీతం, నాట్యం, చిత్రకళ నేర్చుకోవడం, సంగీత వాయిద్యాల్లో శిక్షణలు, కవిత్వం/వ్యాస రచన/కథలు రాయడంతో సాహిత్య రంగంలో తొలి అక్షర అడుగులు వేయడానికి సెలవులు ఎంతగానో ఉపయోగ పడతాయి. ఆసక్తి కలిగిన వారు కొత్త భాషను నేర్చుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యాలకు పదును పెట్టడం, జనరల్ నాలెడ్డి పెంచుకోవడం, దిన పత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యం పోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు కావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నైపుణ్యాలు, విజ్ఞానం, సామర్థ్యాలకు పదును పెట్టడం లాంటివి మరువరాదు.

నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం, యోగా, నడక, చేయడం, సూర్యోదయాన్ని చూసి వీక్షించడం మరువరాదు. వీటికి తోడుగా తోట పనుల్లో నిమగ్నం కావడం, పర్యావరణ పరిరక్షణ సేవలు, నిస్వార్థ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, శ్రమదాన కార్యక్రమాలు చేయడం, అనాథాశ్రమాలను సందర్శించి వారికి చేతనైనంత తోడ్పాటు ఇవ్వడం,ఇష్ట దైవపూజ చేయడం, దేవాలయాలు లేదా ప్రార్థనా స్థలాలను సందర్శించడం ఉత్తమం అని భావించాలి.

తల్లితండ్రుల పాత్ర

పిల్లలు వేసవి సెలవులను సమర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా గడపడంలో తల్లితండ్రుల పాత్ర అధికమని గమనించాలి. వేసవి సెలవులలో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. అధిక కాలం పాటు స్మార్ట్‌ఫోన్ వాడడం లేదా టీవీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. ఎండలను గమనిస్తూ, గంటల తరబడి మైదానాల్లో ఆడకుండా, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అతి నిద్ర లేదా అతిగా తినడం లేదా అతి గారాబానికి అస్కారం ఇవ్వకండి. డ్యాన్స్, ఫైన్ ఆర్ట్, స్విమ్మింగ్, సైక్లింగ్, మ్యూజిక్, ఆటలు లాంటివి నేర్పించండి. వేసవి సెలవులు పూర్తి స్వేచ్ఛకు నెలవులు కావని, వినోదంతో పాటు విజ్ఞానం, ఆటపాటలతో పాటు శారీరక మానసిక వికాసం, ఆన్‌లైన్‌లో సంచరిస్తూ దురలవాట్ల కోరల్లో పడకుండా రేపటి బాధ్యత కలిగిన పౌరులుగా మారడానికి నేటి పిల్లలకు వేసవి సెలవులు ఉపయుక్తం కావాలని కోరుకుందాం..

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారత క్రికెట్ కే ప్రతిష్టాత్మకంగా నిలిచే ఇండియన్ ప్రీమియర్ లీగ్ పరంపరలో భాగంగా ఐపీఎల్-19 సీజన్ హంగామాకు బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో అట్టహాసంగా తెరలేచింది. దేశవిదేశాలలోని వందల కోట్ల అభిమానులను రానున్న కొద్దివారాలపాటు 70కి పైగా లీగ్, నాకౌట్ మ్యాచ్‌ల ఈ సమరం ఉక్కిరిబిక్కిరి చేయనుంది.

అంతై.. ఇంతై.. అంతింతైన ఐపీఎల్!

ప్రపంచ క్రీడారంగ చరిత్రలోనే మొదటి మూడు అత్యుత్తమ లీగ్ బ్రాండ్లలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకొన్న మన ఐపీఎల్ బ్రాండ్ విలువ కేవలం 18 సంవత్సరాల కాలంలోనే లక్షల కోట్లకు చేరటం అనూహ్యం, అసాధారణం. అంతర్జాతీయ బ్రాండ్ వర్గాల తాజా అంచనాల ప్రకారం ఐపీఎల్ బ్రాండ్ విలువ లక్షవేల కోట్లకు చేరింది.చేరింది.'ఐపీఎల్ బ్రాండ్' విలువ సీజన్ సీజన్ కు ఆకాశమే హద్దుగా పైకి..పైపైకి దూసుకుపోతోంది. గత 18 సీజన్లలో 433 రెట్ల మేర బ్రాండ్ విలువ పెరిగింది. గతేడాది కాలంలో బ్రాండ్ విలువ 28 శాతం పెరగడంతో 10.7 బిలియన్లు (సుమారు లక్ష వేల కోట్ల రూపాయల) స్థాయికిచేరినట్లుబ్రాండ్‌ఫైనాన్స్ ప్రకటించింది. లీగ్‌లో తలపడుతున్న మొత్తం 10 ఫ్రాంచైజీలు తమ కార్యకలాపాలను మార్కెటింగ్ నిపుణుల పర్యవేక్షణలో కొనసాగిస్తూ ఉండటంతో అద్భుతమైన ఫలితాలు వచ్చినట్లు తేలింది. ఏడాది ఏడాదికీ ప్రమాణాలు మెరుగుపరచుకోడం, పటిష్టమైన జట్లతో బరిలోకి దిగడం దీనికి కారణమని వివరించింది. 2023 నుంచి 2027 కాలానికి మీడియా ప్రసారహక్కుల విక్రయం ద్వారా ఐపీఎల్ బోర్డుకు 6.02 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరడం కూడా ఓ రికార్డేనని పేర్కొంది. ప్రస్తుత చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. ఖతార్ ఎయిర్ వేస్‌తో మూడేళ్లకు రూ.75 కోట్ల ఒప్పందం కుదుర్చుకోడం బ్రాండ్ విలువ సత్తాకు నిదర్శనమని తేలింది.

రెండు కొత్త ఫ్రాంచైజీల చేరిక

ప్రస్తుతం ఐపీఎల్ 19వ సీజన్ పోటీలు దేశంలోని 13 వేర్వేరు వేదికల్లో వడివడిగా సాగిపోవడానికి రంగం సిద్ధమయ్యింది. మ్యాచ్‌లతో ప్రేక్షకులకు వినోదం లభిస్తుంటే, నిర్వాహకులకు ఆదాయం సమకూరుతోంది. మ్యాచ్‌ల వారీగా గణిస్తే మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో ఐపీఎల్‌ను రెండో అతిపెద్ద లీగ్‌గా పరిగణిస్తున్నారు. మ్యాచ్‌వారీగా మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను గణించడంతో ఐపీఎల్ బ్రాండ్ విలువ భారీగా పెరిగింది. రెండు కొత్త జట్లు చేరడంతో 2023 సీజన్లోనే ఐపీఎల్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో రూ.1.6 బిలియన్ డాలర్లు అదనంగా పెరిగింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు సైతం తమ బ్రాండ్ విలువను గణనీయంగా పెంచుకొంటూ వస్తున్నాయి. ఐదుసార్లు విన్నర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ విలువ 83 మిలియన్ డాలర్లతో అత్యధిక బ్రాండ్ విలువ పలుకుతోంది. ఆ తర్వాతి స్థానంలో కోల్‌కతా నైట్ రైడర్స్ 77 మిలియన్ డాలర్లు, చెన్నై సూపర్ కింగ్స్ 74 మిలియన్ డాలర్లు, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ (ఆర్సీబీ) 68 మిలియన్ డాలర్లు, ఢిల్లీ క్యాపిటల్స్ 62 మిలియన్ డాలర్లతో ఉన్నాయి.

బీసీసీఐకి రూ.5వేల కోట్ల ఆదాయం

ఐపీఎల్ వీక్షకులు సంఖ్య సైతం 50 కోట్లకు చేరింది. ఐపీఎల్ మ్యాచ్‌లను వీక్షించే సమయం కూడా 18,800 కోట్ల నిముషాలకు చేరినట్లు బ్రాండ్ ఫైనాన్స్ విశ్లేషించింది. టీవీ ప్రసారాలు, డిజిటల్ ప్రకటనలు ద్వారానే ఐపీఎల్ బోర్డుకు రూ.5వేల కోట్ల ఆదాయం సమకూరింది. ఐపీఎల్ ప్రసార హక్కుల్లో అధికభాగాన్ని 2023 నుంచి 2027 కాలానికి రిలయన్స్ గ్రూప్ దక్కించుకోగలిగింది. టీవీ ప్రసారహక్కులను డిస్నీ స్టార్ సంపాదించింది. రిలయన్స్ సంస్థే రూ.23,758 కోట్లు చెల్లిస్తోంది.

క్యూ కట్టిన స్పాన్సర్లు

ఐపీఎల్ ప్రసారాలకు అత్యధిక రేటింగ్ ఉండడంతో బహుళ జాతి సంస్థలతో పాటు దేశీయ వ్యాపార దిగ్గజాలు సైతం తమ తమ ఉత్పత్తుల ప్రచారం కోసం ఐపీఎల్ వేదికను వాడుకోవడానికి పోటీపడుతున్నాయి. టీవీ ప్రసారహక్కులు సంపాదించిన డిస్నీ స్టార్ స్పాన్సర్లలో టాటా న్యూ, డ్రీమ్ 11, ఏర్ టెల్, కోకా-కోలా, ఏషియన్ పెయింట్స్, క్యాడ్ బరీ, జిందాల్ పాంథర్, పార్లే బిస్కట్స్, బ్రిటానియా, రూపే, కమలా పసంద్, ఎల్ఐసీ ఉన్నాయి.

భారత ఆర్థిక వ్యవస్థకు ఐపీఎల్ దన్ను

భారత ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడంలో ఐపీఎల్ తనవంతు పాత్ర పోషిస్తూ వస్తోంది. ప్రభుత్వ నివేదిక ప్రకారం 1,150 కోట్ల డాలర్ల ఆదాయం అదనంగా వచ్చి భారత జీడీపీకి చేరింది. 2015 నుంచి 2025 మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలలో ఐపీఎల్ పాత్ర అంతా ఇంతా కాదు. భారత ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం కావడంలో ఐపీఎల్ గణనీయమైన పాత్ర పోషిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఐపీఎల్ ద్వారా సమకూరే వేల కోట్ల రూపాయల రాబడిలో అధికమొత్తాన్ని దేశంలో క్రికెట్ మౌలికసదుపాయాల కోసం వెచ్చిస్తున్నారు. భారత క్రికెట్ వ్యవస్థ నవీకరణకు ఐపీఎల్ ద్వారా ఏటా సమకూరే వందలకోట్ల రూపాయల ఆదాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రస్తుత సీజన్‌లో వివిధ జట్ల విజయావకాశాలను చూస్తే ఐదుసార్లు విజేతలుగా ముంబై, చెన్నై ఫ్రాంచైజీలతో పాటు ప్రస్తుత చాంపియన్ బెంగళూరు, మాజీ చాంపియన్లు కోల్‌కతా, హైదరాబాద్‌లతో పాటు ఢిల్లీ సైతం విజేతగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సీనియర్ స్టార్లు విరాట్ కొహ్లీ, రోహిత్ శర్మ, మహేంద్రసింగ్ ధోనీ, హార్థిక్ పాండ్యా, బుమ్రా, రిషభ్ పంత్, ప్రపంచకప్ హీరో సంజు శాంసన్‌తో పాటు విదేశీ దిగ్గజ ఆటగాళ్లు కమెరూన్ గ్రీన్, రషీద్ ఖాన్, ట్రావిస్ హెడ్, క్వింటన్ డీ కాక్, హెన్రిక్ క్లాసెన్ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

కడప : మార్చి 22న కడపలో వైభవం భారతం సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్ఎస్ఎస్ దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్ భరత్. ఈ కార్యక్రమంలో కడప జిల్లా సంఘచాలక్ కోవూరు రామసుబ్బారెడ్డితోపాటు 324మంది వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీశైలం : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు శ్రీశైలం వైపు పాదయాత్రగా తరలివస్తారు. ఈ నేపథ్యంలో, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (NMO) ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నల్లమల టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలోని పెచెరువు గూడెం వద్ద ఉచిత వైద్య శిబిరాలు మార్చి13 నుండి 18 వరకు జరిగాయి. ఈ శిబిరాల ద్వారా సుమారు 2,30,000 మంది యాత్రికులకు వైద్య సేవలు అందించబడటం విశేషం. ఈ సేవా కార్యక్రమం విజయవంతంగా కొనసాగడానికి డా. శ్రీధర్ రెడ్డి, సున్నిపెంటకు చెందిన వెంకట్ రెడ్డి సహకారం విశేషమైంది.

నంద్యాల :
సంఘశతాబ్ది కార్యక్రమాలలో భాగంగా మార్చి 29న నంద్యాల పురవీధుల్లో పదసంచలన్ జరిగింది. 426 మంది గణవేషధారి స్వయంసేవకులు సంచలన్‌లో పాల్గొన్నారు. అనంతరం కేశవరెడ్డిస్కూల్ బాలాజీ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన సభా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పుట్టాశేషు పసంగించారు. జిల్లా సంఘచాలక్ చిలూకురి శ్రీనివాస్ వేదికనలంకరించారు.

మార్కాపురం బస్సు ప్రమాదం -స్వయంసేవకుల సేవ

మార్కాపురం : మార్చి 26 తెల్లవారుజామున మార్కాపురం సమీపంలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి హుటాహుటిన స్వయంసేవకులు వెళ్లి మొదటగా గాయపడిన వాళ్లను అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. ప్రమాదంలో మరణించినవారి పార్థివ దేహాలను 108 అంబులెన్స్ సహాయంతో గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి మార్చురిలో ఉంచే ఏర్పాటు చేశారు. బాధితుల బంధువుల కోసం ప్రయాణికుల వివరాలు లిస్టు తీసుకొని ఫోన్ ద్వారా తెలియజేశారు. అత్యవసరమైన మాస్కులు, గ్లోవ్స్, త్రాగునీరు, బిస్కెట్‌లు, టిఫిన్లు బాధితులకు అందజేశారు. అధికారులు కలెక్టర్, ఎమ్ఎల్ఏలు స్వయంసేవకుల వద్దకు వచ్చి బాధితుల వివరాలను సేకరించారు. స్వయంసేవకుల సేవను కొనియాడారు.

ఖమ్మం : సంఘ శతాబ్ది కార్యక్రమాలలో భాగంగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండంలో మార్చి 25న జరిగిన హిందూ సమ్మేళనంలో భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానందభారతి స్వామి ఆశీఃప్రసంగం చేశారు. ఈ సమ్మేళనంలో 2,650 హిందువులు హాజరయ్యారు.

ఉట్కూరు : నారాయణపేట జిల్లా ఉట్కూరు ఉప మండలంలో మార్చి 25న జరిగిన సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పురాణపీఠం అనంత ఆశ్రమం స్వామిజీ శ్రీశ్రీశ్రీ అనంతానందభారతీ, అధ్యక్షులుగా పింగిలి చందాలాల్ (రిటైర్డ్ టిఆర్, ఉట్కూర్), ముఖ్యవక్తగా ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు భాగయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనానికి 2277 మంది ప్రజలు హాజరయ్యారు.

బిజనేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజనేపల్లి మండలంలో మార్చి 15న జరిగిన సమ్మేళనంలో భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానందభారతి స్వామి ఆశీఃప్రసంగం చేయగా, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

బాల జాగృతి

శరభయ్య బద్ధకం

కథ

ఒకానొక ఊరిలో శరభయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి పొలం పనులన్నా, కష్టపడాలన్నా మహా బద్ధకం. ఒకరోజు శరభయ్య తన ఎడ్లబండి మీద ప్రయాణం మొదలుపెట్టాడు. అది వర్షాకాలం కావడంతో ముందురోజే కురిసిన కుంభవృష్టికి దారులన్నీ బురదమయంగా మారిపోయాయి.

శరభయ్య ఏదో పరధ్యానంలో బండి తోలుతుండగా, ఒక్కసారిగా బండి కుదుపుకు గురై ఆగిపోయింది. కిందకు దిగి చూడగా, బండి చక్రం లోతైన బురద గుంటలో గట్టిగా కూరుకుపోయింది. సాధారణంగా కొంచెం బలం ఉపయోగించి నెట్టితే ఆ చక్రం సులభంగా బయటకు వచ్చేస్తుంది. కానీ, శరభయ్యలో ఉన్న బద్ధకం అతన్ని కదలనివ్వలేదు.

నేరుగా మోకాళ్లపై కూర్చుని ఆకాశం వైపు చేతులెత్తి, "దేవుడా! చూశావా నా కష్టం? ఈ బండి చక్రం బురదలో చిక్కుకుంది. నువ్వే దిగి వచ్చి దీనిని బయటకు తీయాలి. నువ్వే నా దిక్కు!" అంటూ అరవడం మొదలుపెట్టాడు. గంటలు గడుస్తున్నా శరభయ్య మాత్రం అంగుళం కూడా కదలలేదు, కనీసం ప్రయత్నించలేదు. 'దేవుడే వచ్చి తీస్తాడు' అని మొండిగా భీష్మించుకుని అక్కడే కూర్చున్నాడు.

కాసేపటికి మళ్లీ వర్షం మొదలైంది. వాన ధాటికి బురద మరింత ఎక్కువై, బండి చక్రం ఇంకా లోపలికి దిగబడిపోయింది. ఆ రాత్రంతా వానలో తడుస్తూ, చలికి వణుకుతూ అక్కడే గడిపాడు తప్ప, స్వయంగా చక్రాన్ని పైకి తీయాలన్న ఆలోచన చేయలేదు. తెల్లవారిన తర్వాత, ఆకలి, అలసట ఎక్కువవ్వడంతో ఇక లాభం లేదని గ్రహించాడు. వేరే దారి లేక, గట్టిగా ఊపిరి పీల్చుకుని తన భుజ బలంతో చక్రాన్ని ఒక్క తోపు తోశాడు. అంతే! క్షణాల్లో చక్రం బయటకు వచ్చేసింది.

అప్పుడు శరభయ్యకు అర్థమైంది–"మనం ప్రయత్నించకుండా దేవుడిని వేడుకుంటే ఫలితం ఉండదు. మన కష్టానికి తోడుగా మాత్రమే దైవబలం ఉంటుంది" అని. తన బద్ధకాన్ని వదిలేసి, ఆ రోజటి నుండి శరభయ్య కష్టపడటం మొదలుపెట్టాడు. ★

మంచిమాట

ఆశావాది గులాబీ పువ్వును
చూస్తే నిరాశావాది ముల్లును
చూస్తాడు

మెదడుకు మేత

అక్కడిక్కడి బండి అంతరాల బండి,
మద్దూరి సంతలోన మాయమైన
బండి. ఏమిటది?

పద్యం

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు దప్పిన
తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ.

భావం : కమలాలు తమ నివాసమైన నీటిని విడిచిపెట్టిన తరువాత తమ మిత్రుడు సూర్యుని వేడిమికి కమలుతున్నాయి. మానవులు తమ తమ నివాసాలను విడిచిపెడితే స్నేహితులే శత్రువు లవుతారు.

శ్లోకం

యత్ర విద్వజ్జనో నాస్తి శ్లాఘ్య స్తత్రాల్పధీరపి
నిరస్తపాదపే దేశే ఏరండోపి ద్రుమాయతే

భావం : విద్వాంసులు లేనిచోట అల్పమైన మేధావులు గొప్ప పండితులుగా చలామణి అవుతూ పొగడ్తలను అందుకుంటారు. వృక్షాలు లేని చోట ఆముదం చెట్లే మహా వృక్షాలుగా కీర్తి పొందుతాయి.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

అక్షరము	అబ్బురము
అద్భుతము	అక్కరము
ఆకాశము	ఆదరువు
ఆధారము	అయ్యా
ఆర్య	ఆకసము

[illegible]

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

బ్రహ్మగుప్తుడు



ప్రాచీన భారతదేశానికి చెందిన (క్రీ.శ. 598–668) అత్యంత ప్రసిద్ధ గణిత, ఖగోళ శాస్త్రవేత్త. సున్నాతో కూడికలు, తీసివేతలు ఎలా చేయాలో నియమాలను రూపొందించిన మొదటి గణిత శాస్త్రవేత్త. ఆయన రాసిన 'బ్రాహ్మస్ఫుట సిద్ధాంతం' 'ఖండఖద్యక' అనే గ్రంథాలు భారతీయ గణిత, ఖగోళ శాస్త్రాలకు ప్రామాణికంగా నిలిచాయి. భూమి గోళాకారంగా ఉందని, వస్తువులు భూమి వైపు పడటానికి కారణం భూమికి ఉన్న ఆకర్షణ శక్తి (గురుత్వాకర్షణ) అని న్యూటన్ కంటే వెయ్యి ఏళ్ల ముందే ఈయన వివరించారు.

జనరల్ నాలెడ్జ్

1. సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ ఏ నదిపై ఉంది?
2. డెన్మార్క్ దేశ రాజధాని ఏది?
3. వరల్డ్ థియేటర్ డేని ఎప్పుడు జరుపుకుంటారు?
4. భారతదేశంలో 'జాతీయ గణాంక దినోత్సవం' ఎవరి పుట్టినరోజున జరుపుకుంటారు?

సమాధానాలు: 1. నర్మద; 2. కోపెన్‌హాగన్; 3. మార్చి 27; 4. పి.సి. మహలనోబిస్ (జూన్ 29).

భక్తాగ్రేసరులు

కావ్యకంఠ గణపతిముని

విశాఖ జిల్లా కలువరాయి గ్రామంలో అయ్యల సోమయాజుల నరసింహశాస్త్రి, నరసమాంబ దపంతులకు జన్మించిన 'కావ్యకంఠ గణపతిముని'అసలు పేరు గణపతి శాస్త్రి. నవద్వీప విద్వత్ పరీక్షలో కావ్యకంఠ బిరుదు లభించింది. పదేళ్ల వయసులోనే మూడు కావ్యాలు పూర్తి చేసి, కవిత్వం మొదలుపెట్టారు. అప్పటికే ఆయనకు జ్యోతిష్యంలో చక్కటి ప్రవేశం ఉంది. మరో ఆరేళ్లలో కావ్య శాస్త్ర ఇతిహాసాదుల్లో నిష్ణాతులు, ఆశుకవి అయ్యారు. పంచాగ గణనంలో కొత్త పథకం తయారు చేసి గురువుకే గురువయ్యారు. పన్నెండవ ఏట పెళ్లి జరిగింది. భార్యను ఉద్దేశించి 'భృంగసందేశం' కావ్యం రాశారు. తండ్రి వద్ద మహా మంత్రదీక్ష స్వీకరించి, నాసిక్, భువనేశ్వర్ ప్రాంతాలకు తపస్సు కోసం వెళ్లారు. అరుణాచలేశ్వరుడిపై వెయ్యి పద్యాలు చెప్పారు.అక్కడ వెంకట రామన్‌కు 'భగవాన్ రమణ మహర్షి'గా నామకరణం చేసి ఆయనతో 'నాయనా'అని పిలిపించుకున్నారు. ఆ అదృష్టం కలిగించిన ఈశ్వరిని స్తుతిస్తూ 'ఉమా సమస్రం' రాశారు. రుగ్వేదం నుంచి విదితమైన భారత చరిత్రాంశాలతో 'భారత విమర్శ'అనే గ్రంథం రాశారు. 'ఇంద్రాణీ సప్తశతి'లో ఆయన దేశభక్తి, స్వాతంత్ర్యం కోసం ఆరాటం వ్యక్తమవుతుంది.

వారఫలాలు

06-12 ఏప్రిల్ 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆస్తి విషయంలో నెలకొన్న స్తబ్ధత తొలగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం. ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు తీరి ఉపశమనం పొందుతారు. వ్యాపారులు కొత్త పెట్టుబడుల అన్వేషణలో సఫలమవుతారు. ఉద్యోగులకు ప్రమోషన్లు. కళాకారులకు కొత్త అవకాశాలు దక్కుతాయి. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరమైన సమయం. 6,7 తేదీల్లో అనారోగ్య సూచనలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆత్మీయులతో ఆనందాన్ని పంచుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి ఒప్పందాలలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులు అనుభవాలతో మరింతగా లాభాలు గడిస్తారు. ఉద్యోగస్తులకు విధుల్లో మరింత ప్రోత్సాహం. కళాకారులకు కీలక సమాచారం రాగలదు. రచయితల ఆశలు నెరవేరతాయి. 9,10 తేదీల్లో సోదరులతో తగాదాలు. ఆరోగ్య సమస్యలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

రావలసిన సొమ్ము అంది ఉత్సాహంగా గడుపుతారు. సమాజంలో గౌరవం మరింత పెరుగుతుంది. స్నేహితుల నుంచి సహాయసహకారాలు అందుతాయి. నూతన వ్యక్తులతో పరిచయం. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. వ్యాపారులు భాగస్వాములతో అంగీకారానికి వస్తారు. లాభాలు ఉత్సాహాన్నిస్తాయి. పరిశోధకులు, వైద్యుల నైపుణ్యం వెలుగు చూస్తుంది. 11,12 తేదీల్లో దూర ప్రయాణాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

పలుకుబడి కలిగిన వారి పరిచయాలు. వివాహ ప్రయత్నాలు కలిసివస్తాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆస్తుల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు లాభాలతో ఉత్సాహంగా సాగుతారు. ఉద్యోగస్తులు సత్తా చాటుకునే సమయం. రాజకీయవేత్తలకు నూతనోత్సాహం. 7,8 తేదీల్లో అనుకోని ఖర్చులు. అనారోగ్యం. కుటుంబంలో కొన్ని సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. ఒక ప్రకటన నిరుద్యోగులకు ఉత్సాహాన్నిస్తుంది. వ్యాపారులు కొత్త పెట్టుబడుల యత్నాలు ఫలించి ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల నుంచి సహకారం అందుతుంది. పారిశ్రామిక వేత్తలకు అంచనాలు ఫలిస్తాయి. క్రీడాకారులు, పరిశోధకులకు మరింత ఉత్సాహం. 6,7 తేదీల్లో శ్రమాధిక్యం. గణేశాష్టకం పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

పాతబాకీలు వసూలై అవసరాలు తీరతాయి. సన్నిహితుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారులకు ఆశించినమేర లాభాలు అందుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. కళాకారులకు అవకాశాలు కొన్ని అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులు, వైద్యులు లక్ష్యసాధనలో విజయం సాధిస్తారు. 10,11 తేదీల్లో ఖర్చులు అధికం. మానసిక ఆందోళన. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

కాంట్రాక్టర్లు కొంత అసంతృప్తి చెందుతారు. దేవాలయాలు సందర్శిస్తారు. ఆరోగ్య సమస్యలు. స్నేహితులతో విభేదిస్తారు. ఆస్తి వివాదాలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. వ్యాపారులకు ఒడిదుడుకులు పెరుగుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. రచయితలు, క్రీడాకారుల యత్నాలు ముందుకు సాగవు. 7,8 తేదీల్లో శుభవర్తమానాలు. వాహనయోగం. శివపంచాక్షరి పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధువులనుంచి శుభవర్తమానాలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఇంటి నిర్మాణ యత్నాలు అనుకూ. ఉద్యోగులు విధి నిర్వహణలో మరింత ఉత్సాహంతో గడుపుతారు. రాజకీయ వేత్తలకు సంతోషకరమైన సమాచారం. కళాకారులు, పరిశోధకులకు కొత్త అవకాశాలు దక్కించుకుంటారు. 11,12 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్య సూచనలు. సుబ్రహ్మణ్యేశ్వరుని స్తోత్రాలు పఠించండి.



ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

స్నేహితులతో వివాదాలు సర్దుకుంటాయి. విద్యార్థుల కృషిఫలిస్తుంది. నిరుద్యోగులకు అనుకూల సమాచారం. ఉద్యోగులు శ్రమకు ఫలితం దక్కించుకుంటారు. రాజకీయవేత్తలకు ఊహించని పదవులు దక్కుతాయి. రచయితలు, వైద్యుల ఆశలు నెరవేరతాయి. 7,8 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. కుటుంబంలో చికాకులు. ఆకస్మిక ప్రయాణాలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తి విషయంలో సమస్యలు, చికాకులు తొలగుతాయి. కాంట్రాక్టులు పొందుతారు. ముఖ్య నిర్ణయాలు తీసుకుని బంధువులను ఆశ్చర్యపరుస్తారు. వ్యాపారులు అనుకున్న లాభాలు పొందుతారు. ఉద్యోగులు విధుల్లో ఉత్సాహంగా సాగుతారు. కళాకారులకు ఊహించని అవకాశాలు లభిస్తాయి. క్రీడాకారులకు శుభవార్తలు. 10,11 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. పనిఒత్తిడులు. ఖర్చులు. విష్ణుధ్యానం చేయండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

నిరుద్యోగులు అనుకున్న ఉద్యోగాలు సాధిస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. ప్రముఖులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. వ్యాపారులు లాభాలు దక్కి ఉత్సాహంగా అడుగు వేస్తారు. రాజకీయవేత్తలకు శుభ వార్తలు. రచయితలు, క్రీడాకారుల అంచనాలు ఫలి స్తాయి. 9,10 తేదీలలో మానసిక అశాంతి. బంధువుల నుంచి ఒత్తిడులు. ఆదిత్య హృదయం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

స్థిరాస్తి వివాదాల నుంచి గట్టెక్కి లబ్ధి పొందుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. భాగస్వాములతో వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగస్తులు ఊహించని హోదాలు దక్కించుకుంటారు. పారిశ్రామికవేత్తలు, పరిశోధకులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 8,9 తేదీల్లో సోదరులతో వివాదాలు. దూరప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. హనుమాన్ చాలీసా పఠించండి.

పదరసం-558



ఆధారాలు

అడ్డం

1. ఈ మహర్షి బలరామకృష్ణుల గురువు (3)
3. ఒక కావ్య ప్రక్రియ...వందతో (3)
5. కాళిదాసు పంపిన సందేశం.... (2)
6. రాత్రి, పసుపు (3)
8. తెలుపు వర్ణం (3)
10. వేళాకోళం (2)
11. తిరిగి, మళ్లీ (3)
13. సుబ్రహ్మణేశ్వరుడి జన్మతిథి (2)
14. పట్టుదల, శపథం (3)
15. లాభం, ఆదాయం (3)
16. భార్య (2)
17. చప్పుడు, శబ్దం (2)
18. ఆకర్షణ, ఇష్టం (2)
19. చివరి (2)
23. మాద్రి పెద్ద కుమారుడు (4)
25. అశ మదిరితే... (3)
27. మండూకం (2)
28. చూచు, ప్రసవం (2)
29. రమారమి (3)
32. తగదా (3)
34. వస్త్రాలు, కుంటలు (4)
35. హారంతో శిక్ష (3)

నిలువు

1. ఓదార్పు, స్వస్థత (3)
2. విధాత (4)
3. గాంధారి సోదరుడిలో ఒక వారం (2)
4. మెడ (3)
5. బాజాబజంత్రీలు (2)
7. ఉదకం (2)
9. రతీపతి (4)
11. అభిప్రాయం, విశ్వాసం (2)
12. సిగ్గులాంటిదే (3)
13. నిబంధన (3)
14. విద్వాంసులు (4)
18. కైవల్యం, ముక్తి (2)
20. ప్రభాకరుడు (5)
21. త్యాగం చేసేవాడు... తలకిందులయ్యాడు (2)
22. ప్రాయం, ఈడు (3)
24. రాశి, పోగు (2)
25. తర్జుమా, భాషాంతీకరణ (4)
26. ఈ దేవి ఇంద్రపత్ని (2)
28. కావ్యకర్త (2)
30. అమ్మ సోదరుడు (2)
31. దీనిని ఎరిగి వాతపెట్టాలట (2)
33. హారం,మాల (2)

పదరసం - 557 సమాధానాలు

1 ఉ	ప	2 దే	శం		3 మృ	గ	4 తృ	ష్ణ	
ర్వి		వ		5 అం	గ		ప్తి		6 చు
	7 ఉ	ద	యం		8 శి	స్తు		9 మె	ట్ట
	10 చి	త్తం		11 తె	ర		12 ము		రి
13 యా	తం		14 చె	లి		15 పె	ద్ద	16 రి	కం
మి		17 కో	ర	వి		ద్ది		క్క	
18 ని	19 జం		సా		20 ఆ	న	21 తి		22 బ
	23 కు	24 టి	ల		దా		మిం		హు
25 లో		త		26 సా	యం		27 గ	రి	మ
28 కం	ద		29 దం	ము		30 కా	లం		తి

చూస్తూండగానే 2026లో మూడు నెలలు గడిచిపోయాయి. సినిమాల విడుదల సంఖ్య చూస్తుంటే ఈ యేడాది కూడా అనువాద చిత్రాలతో కలిపి 250కు పైగా విడుదలయ్యే దాఖలాలు కనిపిస్తున్నాయి. అయితే సినిమాల సక్సెస్ రేటు మాత్రం పది శాతంలోపే ఉంటుందేమో అనిపిస్తోంది. విశేషం ఏమంటే గడిచిన మూడు మాసాల్లో చిన్న చిత్రాలకు పెద్దంత విజయం మాత్రం దక్కలేదు.

ఈ యేడాది ప్రారంభంలో టాప్ స్టార్స్ అందరూ పొంగల్ బరిపైనే గురి పెట్టారు. కానీ, కొందరికే జనం జై కొట్టారు. మరి కొందరికి నిరాశనే మిగిల్చారు. జనవరిలో మొత్తం

తెలుగు సినిమా... త్రైమాసిక ఫలితాలు!

26 చిత్రాలు వెలుగు చూశాయి. వాటిలో స్ట్రెయిట్ మూవీస్ 22 కాగా, నాలుగు డబ్బింగ్ సినిమాలు ఉన్నాయి. 'సైక్ సిద్ధార్థ', 'వనవీర', 'మదం', 'సుకుటుంబానాం' చిత్రాలు జనవరి 1వ తేదీనే జనం ముందు నిలిచాయి. కానీ, అవి ప్రేక్షకుల మదిని గెలవలేకపోయాయి. 2వ తేదీన వచ్చిన 'నీలకంఠ, వినరా ఓ వేమ, ఓ అందాల రాక్షసి, ఘంటసాల: ది గ్రేట్, గులాబీ' చిత్రాలు కూడా ఆకట్టుకోలేక పోయాయి. తెలుగు సినిమాకు ఆక్సిజన్ లాంటిది సంక్రాంతి సీజన్. అందువల్ల టాప్ స్టార్స్‌తో చిత్రాలు నిర్మించే వారందరూ పొంగల్ బరిలోనే దూకాలని ఆశిస్తారు. దాంతో అందరి చూపు రెబల్ స్టార్ ప్రభాస్ 'ద రాజాసాబ్'పైనే పడింది. పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా జనవరి 9వ తేదీన జనం ముందు నిలచి, తీవ్ర నిరాశను కలిగించింది. అయితే సంక్రాంతి సీజన్‌లో రెండో సినిమాగా జనవరి 12న వెలుగు చూసిన 'మన శంకరవరప్రసాద్ గారు' బంపర్ హిట్‌గా నిలచింది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి రూపొందించిన ఈ చిత్రం అదరహో అనిపించింది. వెంకటేశ్ కూడా ఓ కీ రోల్ లో కనిపించడం ఈ చిత్రంలో ఓ ప్రధానాకర్షణ. 400 కోట్ల రూపాయలు పోగేసి ఈ యేడాది ఇప్పటి దాకా హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలచింది. జనవరి 13న రవితేజ హీరోగా రూపొందిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విడుదలయింది. అయితే 'మన శంకర వరప్రసాద్ గారు' ప్రభంజనం ముందు నిలవలేక పోయింది. 14వ తేదీన రిలీజైన 'అనగనగా ఒకరాజు', 'నారీ నారీ నడుమ మురారి' రెండు చిత్రాలు గుడ్ టాక్‌ను సంపాదించాయి. వీటిలో నవీన్ పోలిశెట్టి హీరోగా రూపొందిన 'అనగనగా ఒకరాజు' వంద కోట్లు పోగేసి అందరినీ ఆశ్చర్య పరచింది. శర్వానంద్ హీరోగా తెరకెక్కిన 'నారీ నారీ నడుమ మురారి' సైతం అలరించింది. అయితే 'మన శంకర వరప్రసాద్ గారు' తరువాత పొంగల్ రేసులో నంబర్ టూ ప్లేస్‌ను నవీన్ పోలిశెట్టి దక్కించు కున్నారు. జనవరి 30న 'ఓం శాంతి శాంతి శాంతిః, జగన్నాథ్, జమానా, ధృతరాష్ట్రుడు, దేవగుడి, ప్రేమకడలి, త్రిముఖ, వన్ బై ఫోర్' చిత్రాలు ప్రేక్షకులను పలకరించినా, అవి వారిని అలరించలేక పోయాయి.

ఫిబ్రవరిలో అత్యధిక చిత్రాలు రిలీజ్ కావడం ఓ విశేషం! 24 స్ట్రెయిట్ పిక్చర్స్‌తో పాటు 5 డబ్బింగ్ మూవీస్‌తో కలిపి మొత్తం 29 సినిమాలు జనం ముందు నిలిచాయి. ఫిబ్రవరి 6న ముందుగా 'ఎర్రచీర, లగ్గం టైమ్ ఆపరేషన్ పద్మ, బరాబర్ ప్రేమిస్తా, శ్రీచిదంబరం గారు, యుఫోరియా, సుమతీ శతకం, బ్లడ్ రోజెస్, హనీ, దక్షిణ కాళీ' రిలీజ యయ్యాయి. గుణశేఖర్ దర్శకత్వంలో భూమిక ప్రధాన పాత్రలో రూపొందిన 'యుఫోరియా' ఆలోచింప చేసిందే కానీ ఆకట్టుకోలేక పోయింది. దీనితో పాటే వచ్చిన మిగతా చిత్రాలు ఊసులోకే లేకుండా పోయాయి. ఫిబ్రవరి 13న విశ్వక్ సేన్ ఎన్నో ఆశలు పెట్టుకున్న 'ఫంకీ' ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోయింది. ఆ మరుసటి రోజునే వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' యువతను అలరించింది. సంతోష్ శోభన్‌కు నటునిగా మంచి మార్కులే సంపాదించి పెట్టింది. తరువాత వచ్చిన సినిమాలేవీ మురిపించలేక పోయాయి.

మార్చి 5వ తేదీన 'విధాత, చెప్మా రాజా – సెల్ఫీ రాణి' థియేటర్లకు వచ్చాయి. మరుసటి రోజున వెలుగు చూసిన చిత్రాల్లో శివాజీ, లయ జంటగా రూపొందిన 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' కాస్త ఆసక్తి రేపింది, కానీ ఆకట్టుకోలేక పోయింది. ఈ సినిమాతో పాటే వచ్చిన 'కాక్రోచ్', 'మృత్యుంజయ్', 'మెన్షన్ హౌస్ మల్లేష్' వంటివి కూడా మెప్పించలేక పోయాయి. 19వ తేదీ వైపే పలువురి చూపు సాగింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్' 19న వెలుగు చూసింది. అసలు పవన్ కళ్యాణ్ మూవీ నేనా ఇది అనే తీరున 'ఉస్తాద్ భగత్ సింగ్' సాగింది. ఆశించిన స్థాయిలో అలరించలేక పోయింది. 26వ తేదీన 'బ్యాండ్ మేళం, లేచింది మహిళా లోకం' చిత్రాలు 27న 'సుయోధన' సినిమా వచ్చాయి. ఏవీ ఆకట్టుకోలేకపోయాయి. మార్చిలో 8 డబ్బింగ్ సినిమాలు రిలీజయ్యాయి. స్ట్రెయిట్ మూవీస్ 14 మాత్రమే విడుదలయ్యాయి. ఈ నెలలో 22 చిత్రాలే వెలుగు చూశాయి. మార్చి నెలలో డబ్బింగ్ సినిమా లదే హవా అని చెప్పొచ్చు. రణవీర్ కపూర్ హీరోగా ఆదిత్య ధర్ రూపొందించిన 'ధురంధర్' గత యేడాది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలచింది. ఆ క్రేజ్‌తో సీక్వెల్ అయిన 'ధురంధర్-ద రివేంజ్'ను కూడా జనం ఆదరించారు. దాదాపు నాలుగు గంటల రన్ టైమ్ ఉన్న 'ధురంధర్-2' ప్రేక్షకులను అలరిస్తూ సాగు తోంది. చివరలో వచ్చిన తమిళ డబ్బింగ్ 'యూత్' పరవాలేదనిపించుకుంది. ఇలా ఇప్పటి దాకా ఈ మూడు నెలల్లో వచ్చిన మొత్తం 77 చిత్రాల్లో కేవలం ఆరు చిత్రాలే ఆకట్టుకోగలిగాయి. అందులో 'మన శంకర వరప్రసాద్ గారు' బ్లాక్ బస్టర్ కాగా, అనువాదాల్లో 'ధురంధర్-2' ఆధిక్యత చాటుకుంది. రాబోయే మాసాల్లో మన తెలుగు సినిమా ఏ తీరున సాగుతుందో చూడాలి.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.80/-



వెల : ₹.135/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.135/-

వెల : ₹.800/900 : 999/1200



వెల : ₹.250/-

వెల : ₹.130/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 25

अँधेरा हटेगा... सूरज निकलेगा... कमल खिलेगा...

చీకట్లు తొలగిపోతాయి... సూర్యుడు ఉదయిస్తాడు... కమలం వికసిస్తుంది...

06 ఏప్రిల్ 2026

జాతీయవాదాన్ని నరనరాన నింపుకొని దేశంకోసం, పార్టీకోసం, ప్రాణాలర్పించిన కార్యకర్తలను స్మరించుకుంటూ..

ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు కృషి సల్పిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మద్దతుదారులందరికీ పేరుపేరునా

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

పోరెడ్డి కిషోర్ రెడ్డి
రాష్ట్ర అధికార ప్రతినిధి, భాజపా – తెలంగాణ

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01